సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 295
సోమవారం 15-1-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి'

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
సంక్రాంతి శుభాకాంక్షలు



వాయుకాలుష్యంలో హస్తిన

ఢిల్లీ మళ్లీ వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. దీంతో అత్యవసరంకాని నిర్మాణాలను ఆపేయాలని కేంద్రం ఆదేశించింది.

వివరాలు 6లో ▸



డెన్మార్క్ రాజుగా పదో ఫ్రెడరిక్

డెన్మార్క్ రాజ సింహాసనాన్ని పదో ఫ్రెడరిక్ అధిష్టించారు. రాణి రెండో మార్గరెట్ (83) అనారోగ్యంతో సింహాసనం వీడారు.

వివరాలు 6లో ▸



మిలింద్ దేవ్‌రా రాజీనామా

కాంగ్రెస్ సీనియర్ నేత మిలింద్ దేవ్‌రా ఆ పార్టీకి రాజీనామా చేసి మహారాష్ట్ర సీఎం షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు.

వివరాలు 6లో ▸



ఆడుతూ పాడుతూ...

రెండో టి20లోనూ అఫ్గాన్‌పై భారత్ నెగ్గి.. సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. అర్ధ సెంచరీలతో దూబే, యశస్వి రాణించారు.

వివరాలు 12లో ▸

న్యూస్‌రీల్

ఐఐటీల్లో మరిన్ని సీట్లు... కటాఫ్ మేజిక్‌లో మార్పు



ఐఐటీలు, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. డిమాండ్ మేరకు సీట్లను పెంచాలని ఐఐటీలు, ఎన్ఐటీలు కేంద్రానికి సమర్పించిన నివేదికలో కోరాయి. దీనికి కేంద్రం సానుకూలంగా ఉందని, త్వరలో నిర్ణయం రావొచ్చని భావిస్తున్నారు.

- వివరాలు 3లో▶

ప్రాణం తీసిన చైనా మాంజా!



చైనా మాంజా ఓ ఆర్మీ అధికారి ప్రాణం తీసింది. లంగర్‌హౌస్‌లోని మిలటరీ ఆస్పత్రిలో పనిచేసే విశాఖవాసి కాగితాల కోటేశ్వర్ రెడ్డి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లంగర్ హౌస్ ఫ్లైఓవర్‌పై ఓ పతంగికి ఉన్న చైనా మాంజా గొంతుకు బిగుసుకొని గాయమైంది. చికిత్స పొందుతూ ఆయన మరణించారు.

- వివరాలు 5లో▶

సెలవు

సంక్రాంతి సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

ఎమ్మెల్సీలు @ సస్పెన్స్

ఎమ్మెల్యే కోటాపై కాంగ్రెస్‌లో కొనసాగుతున్న తర్జనభర్జన

ఎమ్మెల్యేలు, గవర్నర్ కోటాల్లో రెండు చొప్పున, ఇతర కోటాల్లో మరో రెండు సీట్లు

- ఢిల్లీ వేదికగా రెండు రోజులుగా భేటీలు.. చర్చలు ఓ కొలిక్కి వచ్చినా బయటికి రాని పేర్లు
- తొలుత ఎమ్మెల్యే కోటా పేర్ల ప్రకటనకు చాన్స్.. అద్దంకి దయాకర్, మహేశ్‌గౌడ్‌లకు ఖరారు!
- షబ్బీర్‌అలీ అభ్యర్థిత్వంపై ఉత్కంఠ.. నేడు లేదా రేపు ప్రకటించే అవకాశం
- గవర్నర్ కోటాలోనూ పలువురి పేర్లపై చర్చ.. కోదండరాం విషయంలో రాని స్పష్టత
- కొత్తగా రేసులోకి జాహెద్ అలీఖాన్ పేరు.. లేదంటే ఆయన కుమారుడు అమేర్ అలీ ఖాన్
- పాలమూరు స్థానిక సంస్థల కోటాలో చిన్నారెడ్డి.. నల్లగొండ గ్రాడ్యుయేట్స్‌కు తీన్మార్ మల్లన్న!
- నామినేటెడ్ పదవులకూ లైన్ క్లియర్.. తొలి విడతలో 9 లేదా 18 మందికి అవకాశం!
- అనుబంధ సంఘాల నేతలు బల్మూరి వెంకట్, శివసేనారెడ్డి, ప్రీతమ్, మెట్టు సాయిలకు చాన్స్
- ఈ నెల 20 తర్వాత కార్పొరేషన్ పదవుల జాబితా కూడా విడుదల చేసేలా కసరత్తు



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ చాన్స్ ఎవరికి అన్నదానిపై కాంగ్రెస్ పార్టీలో ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. రెండు రోజులుగా ఢిల్లీ వేదికగా పలుమార్లు భేటీలు జరిగినా.. అభ్యర్థుల ఎంపిక ఓ కొలిక్కి వచ్చిందని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నా.. అభ్యర్థులు ఎవరనే దానిపై ఆదివారం రాత్రి వరకు కూడా ఎలాంటి ప్రకటన రాలేదు. ఈ నెల 18లోపు నామినేషన్లు దాఖలు చేయాల్సిన నేపథ్యంలో.. సోమవారం లేదా మంగళవారం (16న) అభ్యర్థులను ప్రకటించవచ్చని సమాచారం.

ఎవరెవరికి చాన్స్?

తుంగతుర్తి అసెంబ్లీ టికెట్‌ను త్యాగం చేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఉద్యమకారుడు అద్దంకి దయాకర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఇద్దరూ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఖరారైనట్టు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఇదే సమయంలో మైనార్టీ నేతను ఎమ్మెల్సీగా చట్టసభకు పంపి కేబినెట్ అవకాశం ఇవ్వాలనే కోణంలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తదితరులు జరిపిన చర్చల్లో.. ఇందులో ఇద్దరు పేర్లను ఖరారు చేశారని, అధికారికంగా ప్రకటించడమే తరువాయి అని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఆ రెండు అభ్యర్థిత్వాలపైనా చర్చ

ఇక గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న మరో రెండు ఎమ్మెల్సీ పదవులపైనా కాంగ్రెస్ కసరత్తు పూర్తి చేసినట్టు తెలుస్తోంది. ఈ కోటాలో ఇప్పటికే పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం పేరును పరిశీలిస్తున్నారనే చర్చ జరుగుతున్నా.. రాజకీయ పార్టీకి

మిగతా 5వ పేజీలో ▶



మకర సంక్రాంతిని పురస్కరించుకొని ఆదివారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆవులకు గడ్డి తినిపిస్తున్న ప్రధాని మోదీ

6లో

అన్యాయాన్ని ప్రశ్నించేందుకే...

భారత్ జోడో న్యాయ్ యాత్రపై రాహుల్‌గాంధీ

- మణిపూర్ నుంచి యాత్రకు శ్రీకారం.. రాష్ట్రానికి శాంతి, సామరస్యం తెస్తాం
- మణిపూరీల కన్నీళ్లు తుడిచేందుకు మోదీ రాకపోవడం సిగ్గుచేటు
- ఆరంభ సభలో ప్రధానిపై ధ్వజం

6లో



ఆదివారం మణిపూర్‌లోని థౌబాల్‌లో 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభం సందర్భంగా రాహుల్‌కు పూలతో చిన్నారుల స్వాగతం

మణిపూర్‌లో ఘర్షణలతో లక్షలాదిమంది అమాయకులు నష్టపోయారు. వారికి చేయూత ఇచ్చేందుకు ప్రధాని మోదీ ఇప్పటికీ రాకపోవడం సిగ్గుచేటు. మోదీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ దృష్టిలో మణిపూర్ భారత్‌లో అంతర్భాగం కాకపోవచ్చు. అందుకే మీ బాధను వారి బాధగా భావించడం లేదు. కానీ మీ దుఃఖాన్ని, మీకు తగిలిన గాయాలను, మీరు ఎదుర్కొంటున్న విచారాన్ని మేం అర్థం చేసుకున్నాం

– రాహుల్ గాంధీ

భారీ పెట్టుబడులే లక్ష్యంగా..

నేటి నుంచి సీఎం రేవంత్ బృందం దావోస్ పర్యటన

- మూడు రోజుల్లో 70మందికి పైగా పారిశ్రామికవేత్తలను కలిసే చాన్స్..
- అంతర్జాతీయ స్థాయి కంపెనీల సీఈఓలతో భేటీలు
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడితో సమావేశం
- తెలంగాణ బలాబలాలు, ప్రాధాన్యతలను చాటుతాం: మంత్రి శ్రీధర్‌బాబు

2లో

భూకంప జోన్‌లో మల్లన్నసాగర్

- 'కాళేశ్వరం'పై ముసాయిదా ఆడిట్ నివేదికలో కాగ్
- మల్లన్నసాగర్ ప్రాంత భూగర్భంలో 3 జతల భారీ నిట్ట నిలువు చీలికలు, కదలికలు
- ఎన్‌జీఆర్ఐ నివేదిక, సిఫార్సులను విస్మరించారు..
- సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ సీఈ అత్యవసర ఆమోదంతోనే ముందుకెళ్లారు
- 95 శాతం నిర్మాణం పూర్తయ్యాక టెక్నికల్ కమిటీ వేయడం విడ్డూరమని వ్యాఖ్య

2లో

కాంగ్రెస్ సర్కారును కూల్చేందుకు కుట్ర



- ఎంపీ ఎన్నికల తరువాత కూలే ప్రమాదం: సంజయ్

2లో

కూలుస్తామంటే ఊరుకోం..: పొన్నం



- మమ్మల్ని ముట్టుకునే దమ్ముందా?
- కాంగ్రెస్ పార్టీ బలహీనంగా లేదు

వివరాలు 2లో ▸



క్లుప్తంగా...

పదిరోజుల్లో ఫాంహౌస్‌కు వస్తా..

- ఎరువులు, విత్తనాలు రెండు, మూడ్రోజుల్లో కావాలి
- ఫర్టిలైజర్ షాపు యజమానిని కోరిన మాజీ సీఎం కేసీఆర్



గజ్వేల్: 'పదిరోజుల్లో ఫాంహౌస్‌కు వస్తా. ఇక వ్యవసాయంపై దృష్టి పెడతా. ఎరు వులు, విత్తనాలన్నీ రెండు, మూడ్రోజుల్లో కావాలి. వెంటనే పంపించు'అంటూ మాజీ సీఎం కేసీఆర్ సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడిలోని ఓ ఫర్టిలైజర్ షాపు యజమానికి ఆదివారం ఫోన్ చేసి కోరారు. తుంటి ఎముక సర్జరీ కారణంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న కేసీఆర్ తాజాగా ఫర్టిలైజర్ షాపు యజమాని బాపురెడ్డితో మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేసీఆర్ ఇక ప్రజల్లోకి వస్తారనే అంశం చర్చనీయాంశంగా మా రింది. ఇందులో భాగంగానే ముందుగా ఫాంహౌస్‌కు వచ్చి వ్యవసాయంపై దృష్టి పెట్టనున్నారని, తర్బూజ సాగుచేయాలని నిర్ణయిం చుకున్నారని తెలుస్తోంది. ఇందుకోసం విత్తనాలు, మల్చింగ్ షీట్లు, డీఏపీ, యూరియా, ఇతర ఎరువులు తెప్పించే పనిలోపడ్డారు.

శాసనవ్యవస్థ సచివాలయ సలహాదారుగా ప్రసన్న కుమార్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనవ్యవస్థ సచివాలయ (లెజిస్లేచర్ సెక్రటేరియట్) సలహాదారుగా సూర్యదేవర ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. భారత ప్రభుత్వంలో 30 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన ఆయనను సలహాదారుగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లు ఎంపిక చేయగా, సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదంతో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రసన్న కుమార్ గతంలో అయిదేళ్ల పాటు లోక్‌సభ స్పీకర్ ఓఎస్డీగా, రాజ్యసభ చైర్మన్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్, డైరెక్టర్‌గా ఆరేళ్ల పాటు విధులు నిర్వహించారు. లోక్‌సభ టీవీ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన ఆయన రాజ్యసభ టీవీ వ్యవస్థాపకుల్లో ఒకరు. మూడేళ్ల పాటు ఢిల్లీ శాసనసభ కార్యదర్శిగా కూడా ప్రసన్నకుమార్ పనిచేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం ఓఎస్డీగా, సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌గా కూడా సేవలందించారు. తొలుత ఢిల్లీ ఆకాశవాణిలో న్యూస్‌కాస్టర్‌గా, పరిపాలన బాధ్యతలను కూడా ప్రసన్న కుమార్ నిర్వర్తించారు.

ప్రజలే ప్రభుత్వాన్ని కాపాడుకుంటారు

కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలే.. ప్రభుత్వాన్ని కాపాడుకుంటారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కుట్రలు చేసే ఏ పార్టీనైనా ప్రజలే నామరూపాల్లేకుండా చేస్తారని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంజయ్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య ఉన్న అనైతిక మైత్రిని మరోమారు తేటతెల్లం చేశాయని చెప్పారు. ఆ రెండు పార్టీల రాజకీయంపై తమకు స్పష్టమైన అవగాహన ఉందని పేర్కొన్నారు. ఆ రెండు పార్టీలకు మించి రాజకీయం చేయగల శక్తి కాంగ్రెస్ పార్టీకి ఉందని స్పష్టం చేశారు. అలాంటి పరిస్థితి వచ్చినప్పుడు తమ వ్యూహాలు తమకుంటాయని దయాకర్ పేర్కొన్నారు.

రాజకీయాలు మానేసి జోతిష్యం చెప్పుకోండి

బండి సంజయ్‌కి మల్లురవి హితవు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎంపీ బండి సంజయ్ రాజకీయాలు మానేసి జోతిష్యాలు చెప్పుకుంటే బాగుంటుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారని, పార్లమెంటు ఎన్నికల తర్వాత ఎప్పుడైనా ప్రభుత్వం కూలిపోవచ్చని సంజయ్ చేసిన వ్యాఖ్యలు.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య బలమైన సంబంధాలున్నాయనే విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌లా, గోబెల్స్‌కు వారసుడిలా సంజయ్ తీరు ఉందని విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన పనిచేస్తోందని, కాంగ్రెస్ ఎమ్మెల్యేల గురించి ఎలాంటి ఆలోచన చేసినా రాజకీయ పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ ఐదేళ్లే కాకుండా రానున్న ఐదేళ్ల పాటు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం స్థిరంగా పరిపాలన సాగిస్తుందని మల్లురవి ధీమా వ్యక్తం చేశారు.

భూకంప జోన్‌లో మల్లన్నసాగర్

కాళేశ్వరం ప్రాజెక్టుపై ముసాయిదా ఆడిట్ నివేదికలో కాగ్

- మల్లన్నసాగర్ ప్రాంత భూగర్భంలో 3 జతల భారీ నిట్టనిలువు చీలికలు, కదలికలు
- ఎన్‌జీఆర్‌ఐ నివేదిక, సిఫార్సులను విస్మరించారు.. తగిన అధ్యయనాలు, పరిశోధనలు చేయలేదు
- సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ సీఈ అత్యవసర ఆమోదంతోనే ముందుకెళ్లారు
- ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్‌ను సైతం తయారు చేయలేదు
- 95 శాతం నిర్మాణం పూర్తయ్యాక టెక్నికల్ కమిటీ వేయడం విడ్డూరమని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: తగిన అధ్యయనాలు, పరిశోధనలు చేయకుండానే మల్లన్నసాగర్ రిజర్వాయర్ డ్రాయింగ్‌లను ఆమోదించి, నిర్మాణం చేపట్టారని 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) పేర్కొంది. మల్లన్నసాగర్ ప్రాంత భూగర్భంలో చాలా లోతు వరకు నిలువునా చీలికలు, కదలికలు ఉన్నాయని.. భూకంపాలకు అవకాశం ఉందని నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ) తమ ప్రాథమిక నివేదికలో పేర్కొందని గుర్తు చేసింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈ సిఫార్సులను పట్టించుకోకుండా.. తగిన సర్వేలు, అధ్యయనాలు చేపట్టకుండానే రిజర్వాయర్ నిర్మాణం చేపట్టిందని తప్పుపట్టింది. ఒకవేళ భూకంపం వస్తే సమీప ప్రాంతాల ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ముప్పు అని ఆందోళన వ్యక్తం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై మూడేళ్లుగా సమగ్ర ఆడిట్ నిర్వహించిన కాగ్.. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వానికి ముసాయిదా నివేదికను సమర్పించింది. ఆ నివేదికలో పేర్కొన్న అంశాలివీ..

సగం ఆయకట్టు మల్లన్నసాగర్ కిందే..

కాళేశ్వరం ప్రాజెక్టులో అతిపెద్ద జలాశయమైన మల్లన్నసాగర్‌ను 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. దీని కింద 10.3లక్షల ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన మొత్తం ఆయకట్టులో ఇది సగానికికన్నా ఎక్కువ. 2017 అక్టోబర్‌లో మల్లన్నసాగర్ నిర్మాణాన్ని ప్రారంభించగా.. మార్చి 2022 నాటికి రూ.6,126 కోట్లు విలువైన పనులు చేశారు. గత సీఎం 2020 ఫిబ్రవరిలో దీనిని ప్రారంభించారు.

అధ్యయనం జరపాలని కోరినా..: మల్లన్నసాగర్ ప్రాథమిక డ్రాయింగ్స్‌ను 2016 ఆగస్టులో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) చీఫ్ ఇంజనీర్ ఆమోదించారు. అయితే నిర్మాణం ప్రారంభించడానికి ముందే ఆ ప్రాంతంలో భూకంపాలు సంభవించడానికి ఉన్న అవకాశాలపై (సైట్ స్పెసిఫిక్ సీస్మిక్ స్టడీస్) నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్‌ఐ) వంటి సంస్థలతో అధ్యయనం జరిపించాలని సూచించారు. దీంతో సంబంధిత అధ్యయనాలు నిర్వహించాలని నీటిపారుదల శాఖ హైదరాబాద్‌లోని ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్‌కు లేఖలు రాసింది. కానీ ఆ అధ్యయన నివేదిక వచ్చే వరకు వేచిచూడకుండానే.. 2017లో ప్రాజెక్టు నిర్మాణాన్ని కాంట్రాక్టర్లకు అప్పగించింది. తర్వాత ఎన్‌జీఆర్‌ఐ నివేదిక ఇచ్చింది.

భూకంపాలకు అవకాశం ఉందంటూ..

దేశంలో భూకంపాల సంభావ్యత తక్కువగా ఉండే సీస్మిక్ జోన్–2లో తెలంగాణ ఉన్నా.. 1967లో కోయినాలో, 1993లో లాతూర్‌లో 6.3 తీవ్రతతో వచ్చిన భూకంపాలతో.. జోన్–2 ప్రాంతం కూడా భూకంపాలకు అతీతం కాదని తేలిందని ఎన్‌జీఆర్‌ఐ నివేదికలో పేర్కొంది. ఇటీవలికాలంలో ఒంగోలు, లాతూర్‌లో వచ్చిన భూకంపాలతో తెలంగాణలోనూ ప్రకంపనలు వచ్చాయని, ఇక్కడి నిర్మాణాలకు స్వల్పంగా నష్టం జరిగిందని తెలిపింది. 1969లో భద్రాచలం వద్ద 5.7 తీవ్రతతో వచ్చిన భూకంపంతో దక్షిణ భారతదేశం అంతా ప్రకంపనలు కనిపించాయని పేర్కొంది. 1983 జూన్‌లో హైదరాబాద్ శివార్లలోని మేడ్చల్ ప్రాంతంలో 4.9 తీవ్రతతో భూకంపం వచ్చిందని.. దాని ప్రభావం 200 కిలోమీటర్ల వరకు కనిపించిందని గుర్తు చేసింది. నాటి భూకంప కేంద్రం మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి కేవలం 20 కిలోమీటర్ల దూరంలోనే ఉందని స్పష్టం చేసింది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. ఇక్కడ 5 లేదా అంతకంటే ఎక్కువ తీవ్రతతో భూకంపం వస్తే తట్టుకునేలా కట్టని (నాన్ ఇంజనీర్డ్) నిర్మాణాలు దెబ్బతింటాయని పేర్కొంది. మల్లన్నసాగర్ ప్రాంతంలోని భూగర్భంలో చాలా లోతు వరకు నిలువునా మూడు జతల చీలికలు (3 సెట్స్ ఆఫ్ డామినెంట్ లీనమెంట్) ఉన్నాయని.. కదలికలు కూడా చోటుచేసుకుంటున్నాయని నివేదికలో తెలిపింది. వీటితో పడే ప్రభావంపై సమగ్ర సర్వే, పరిశోధనలు చేయాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను పట్టించుకోకుండా, అధ్యయనాలు చేపట్టకుండానే రిజర్వాయర్ నిర్మాణం విషయంలో నీటిపారుదల శాఖ ముందుకు వెళ్లింది. ఈ క్రమంలో మల్లన్నసాగర్ దృఢత్వం, భూకంపం వస్తే జరిగే విపత్తు తీవ్ర ఆందోళన కలిగించే అంశాలేనని కాగ్ పేర్కొంది.

అత్యవసరంగా డ్రాయింగ్స్‌కు ఆమోదం

మల్లన్నసాగర్ నిర్మిత ప్రాంతంలో భూకంపాల సంభావ్యతపై అధ్యయనాలు లేవని.. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా అత్యవసర పరిస్థితిలో రిజర్వాయర్ డ్రాయింగ్స్‌ను ఆమోదిస్తున్నామని సీడీఓ చీఫ్ ఇంజనీర్ పదే పదే పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణ డ్రాయింగ్స్ సమయంలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన 'సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్, ఐఐటీ–రూర్కీ'ల నుంచి ఈ డ్రాయింగ్స్‌కు తదుపరి ఆమోదం(వెట్టింగ్) తీసుకోవాలని కూడా సూచించారు. కానీ నీటిపారుదల శాఖ సదరు సంస్థలతో వెట్టింగ్ చేయించినట్టు ఎలాంటి రికార్డులు లేవని కాగ్ పేర్కొంది. మల్లన్నసాగర్ నిర్మాణం 95శాతం పూర్తయ్యాక 2021 జనవరిలో ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలైన డిజైన్లు, స్థిరత్వ విశ్లేషణలు, డిజైన్లకు వెట్టింగ్ కోసం టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయడం విడ్డూరమని స్పష్టం చేసింది. ఆ కమిటీ ఇప్పటివరకు ఎలాంటి సమావేశాలు జరపలేదని, ఎలాంటి నివేదిక సైతం ఇవ్వలేదని పేర్కొంది.

ప్రమాదం జరిగితే తీవ్ర నష్టం

ఒకవేళ ఏదైనా విపత్తు సంభవించి మల్లన్నసాగర్ డ్యామ్ దెబ్బతింటే.. ప్రాణ, ఆస్తి నష్టం నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై 'సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్' ఓ నివేదిక సమర్పించింది. మల్లన్నసాగర్‌లో నీళ్లు నింపడానికి ముందే ఈ నివేదికలోని అంశాలకు అనుగుణంగా ఎమర్జెన్సీ యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయాలని సూచించింది. మల్లన్నసాగర్‌లో 2021 ఆగస్టు నుంచి నీళ్లు నింపడం ప్రారంభించగా.. ఇప్పటివరకు ఎమర్జెన్సీ ప్లాన్‌ను తయారు చేయలేదని కాగ్ ఆక్షేపించింది. ఒకవేళ్ల మల్లన్నసాగర్‌కు ప్రమాదం జరిగితే.. సమీప ప్రాంతాల్లోని ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ముప్పు ఉంటుందని హెచ్చరించింది.

బీజేపీలో 'గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ' జోష్

ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి

- నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల టికెట్ రేసులో ప్రకాశ్‌రెడ్డి, కాసం, గుజ్జుల



సాక్షి, హైదరాబాద్: పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలికి జరగనున్న ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. గతేడాది హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఏవీఎన్ రెడ్డి బీజేపీ బీ–ఫామ్‌పై గెలిచి మండలిలో అడుగు పెట్టిన విషయం తెలిసిందే. త్వరలో ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటుకు జరిగే ఎన్నికల్లోనూ ఈ ఫలితమే పునరావృతం చేయాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. పట్టభద్రుల స్థానం నుంచి గెలుపునకు ఓటర్ల నమోదు కీలకం కావడంతో దానిపై దృష్టి పెట్టింది. ఇందుకోసం పాతవారితోపాటు పెద్దఎత్తున కొత్తగా డిగ్రీలు, పీజీలు పూర్తిచేసిన వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహానికి పదును పెడుతోంది. ఓటర్ల నమోదుకు సంబంధించి పెద్దమొత్తంలో ఫామ్–18 దరఖాస్తులను ముద్రించి పోలింగ్ బూత్ స్థాయి వరకు పంపాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ స్థానానికి గత ఎన్నికల్లో పార్టీ పరంగా జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో తగిన ఓట్లు దక్కని ఈ మూడు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ సీటును గెలుచుకోవడం ద్వారా సత్తా చాటాలని నాయకత్వం యోచిస్తోంది. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే... ఈ ఎమ్మెల్సీ ఎన్నిక జరిగే అవకాశం ఉండటంతో పార్టీకి సానుకూలత పెరుగుతుందని అంచనావేస్తోంది.

పార్టీలో తీవ్ర పోటీ

ఈ సీటు కోసం బీజేపీ నేతల మధ్య పోటీ కూడా తీవ్రంగానే ఉంది. ఈ టికెట్‌ను తనకు కేటాయించాలని డా.ఎస్.ప్రకాష్‌రెడ్డి ఇప్పటికే నాయకత్వాన్ని కోరగా, రాష్ట్ర పార్టీ ప్రధానకార్యదర్శి డా.కాసం వెంకటేశ్వర్లు యాదవ్ కూడా ఈ సీటును కోరుకుంటున్నారు. గతంలో పోటీచేసి ఓడిన ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కూడా రేసులో ఉన్నారు. వీరితోపాటు వివిధ విద్యాసంస్థల అధినేతలు, విద్యావేత్తలు కూడా బీజేపీ టికెట్‌ను కోరుకుంటున్న వారిలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ స్థానం నుంచి గెలుపొందిన బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటు ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ స్థానానికి జూన్ 8 లోగా ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో కేంద్ర ఎన్నికల సంఘం సైతం ఓటర్ల నమోదుకు షెడ్యూల్ విడుదల చేసింది. ఇందుకు ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించింది. పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకుంటే తప్పనిసరిగా ఫ్రెష్‌గా ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ స్థానం నుంచి పోటీకి ఉత్సాహం చూపుతున్న ఇతర పార్టీల నాయకులు సైతం ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేవారు సైతం ఈ విషయంలో తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఈ పట్టభద్రుల సీటుకు ఓటర్ల నమోదుకు మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావును ఇన్‌చార్జిగా నియమించారు.

కాంగ్రెస్ సర్కారును కూల్చే కుట్ర

ఎంపీ ఎన్నికల తరువాత ఎప్పుడైనా కూలే ప్రమాదం

- కేసీఆర్‌తో టచ్‌లో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- కేటీఆర్‌కు ఎంతుందో.. పొన్నంకూ అంతే అహంకారం
- గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో ఉండాల్సింది మోదీ సర్కారే
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



కరీంనగర్‌టౌన్/ఎల్కతుర్తి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు మాజీ సీఎం కేసీఆర్ పెద్దఎత్తున కుట్ర చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్‌లో కేసీఆర్‌కు కోవర్టులున్నారని, గత ఎన్నికల్లో ఆయన వారికి పెద్దఎత్తున నిధులు ఇచ్చారని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి కేసీఆర్ స్కెచ్ వేస్తున్నారని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు కేసీఆర్‌కు టచ్‌లో ఉన్నారని అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేసి ఆ నిందను బీజేపీపైకి నెట్టివేసినా ఆశ్చర్యం లేదని సంజయ్ ధ్వజమెత్తారు. ఆదివారం కరీంనగర్‌లో బండి సంజయ్ సమక్షంలో మానకొండూరు నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. యాదాద్రి అక్షింతలు పంచితే అధికారంలోకి వచ్చేవాళ్లమని కేటీఆర్ అంటున్నారని, పంచొద్దని ఎవరు అన్నారని ప్రశ్నించారు. 'భద్రాద్రి రామాలయానికి తలంబ్రాలు కూడా తీసుకురానోడు.. ఎములాడ రాజన్నకు, కొండగట్టుకు, ధర్మపురి ఆలయాలకు నిధులిస్తామని మోసం చేసిన వ్యక్తి కేసీఆర్' అని అన్నారు. ప్రజలు కేసీఆర్‌ను మర్చిపోయారని, బయటికి వస్తే ఎవరూ పట్టించుకోరని ఎద్దేవా చేశారు. గల్లీలో ఎవరు అధికారంలో ఉన్నా.. ఢిల్లీలో ఉండాల్సింది మోదీనే అని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నేతల దుష్ప్రచారం..

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని.. అలాంటి కాంగ్రెస్ నేతలను చూస్తే జాలేస్తుందని బండి సంజయ్ అన్నారు. రాష్ట్ర ప్రజల బతుకులను సర్వనాశనం చేసిన బీఆర్ఎస్‌ను పూర్తిగా బొందపెట్టేదాకా విశ్రమించబోమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే కేంద్రంలో బీజేపీ ఎంపీలు ఎక్కువగా గెలవాలన్నారు.

అయోధ్యపై రగడ ఎందుకు?

అయోధ్య రామమందిర ఉత్సవం రాజకీయాలకు అతీతంగా జరిగే కార్యక్రమమని, దీనిపై రగడ ఎందుకని బండి సంజయ్ ప్రశ్నించారు. అసలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రామ మందిర నిర్మాణానికి అనుకూలమా? వ్యతిరేకమా? సమాధానం చెప్పాలన్నారు. ఒకనాడు కాంగ్రెసోళ్లు అయోధ్యలోనే రాముడు పుట్టారనడానికి ఆధారాలేమిటని ప్రశ్నించారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడగానే ఈ దేశంలో విధ్వంసం జరగాలని కోరుకున్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. కానీ దేశ ప్రజలు ప్రశాంతంగా ఉంటూ కోర్టు తీర్పును స్వాగతించే సరికి జీర్ణించుకోలేక అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ హితవు పలికారు. ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొడుకు కేటీఆర్‌కు ఎంత అహకారం ఉందో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కూడా అంతే అహంకారం ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుల మాటలనే పొన్నం ప్రభాకర్ కాపీ కొడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీని నిందిస్తే పొన్నంకు ఏమి వస్తుందో అర్థం కావడం లేదన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయిన ప్రజలు మనల్ని చూసి గర్వపడాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకొని అభివృద్ధిలో ముందుకు సాగాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తారని ఓ మిత్రుడు అడగడంతో పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ 350 సీట్లకు పైగా గెలవడం ఖాయమని అన్నారు. తెలంగాణలో ఎంతమంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే అంత ఎక్కువగా నిధులు తీసుకొచ్చి రాష్ట్రం అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

భారీ పెట్టుబడులే లక్ష్యంగా..

నేటి నుంచి సీఎం రేవంత్ బృందం దావోస్ పర్యటన

- మూడు రోజుల్లో 70మందికి పైగా పారిశ్రామికవేత్తలను కలిసే చాన్స్
- అంతర్జాతీయ స్థాయి కంపెనీల సీఈఓలతో భేటీలు.. కీలక పెట్టుబడులపై సంతకాలు
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడితో ప్రత్యేక సమావేశం
- తెలంగాణ బలాబలాలు, ప్రాధాన్యతలను చాటుతాం: మంత్రి శ్రీధర్‌బాబు





సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం దావోస్ పర్యటనకు సిద్ధమైంది. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) 54వ సమావేశంలో రేవంత్ నేతృత్వంలోని అధికారిక బృందం పాల్గొననుంది. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, బలాబలాలు, ప్రాధాన్యతలను ఈ వేదిక ద్వారా చాటి చెప్పాలని రాష్ట్ర బృందం నిర్ణయించింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశానికి వెళ్తున్న రాష్ట్ర అధికారిక బృందానికి ముఖ్యమంత్రి నేతృత్వం వహించడం ఇది తొలిసారి. ఈ బృందంలో ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ కూడా ఉన్నారు.

వరుసగా పారిశ్రామికవేత్తలతో భేటీలు

రాష్ట్ర బృందం ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో భాగంగా దేశ, విదేశ పారిశ్రామికవేత్తలను కలసి కొత్త ప్రభుత్వ విజన్, ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించనుంది. ఐటీ రంగంలో అగ్రగామిగా, లైఫ్ సైన్సెస్ రంగానికి హబ్‌గా ఉన్న తెలంగాణ బలాలను ప్రపంచానికి చాటి చెప్పి పెట్టుబడులను ఆకర్షించాలని భావిస్తోంది. మూడు రోజుల దావోస్ పర్యటనలో 70మందికిపైగా పారిశ్రామికవేత్తలతో రాష్ట్ర బృందం భేటీ కానుంది. ఇందులో నోవార్టిస్, మెడ్ ట్రానిక్స్, ఆస్ట్రాజెనిక్, గూగుల్, ఉబర్, మాస్టర్ కార్డ్, బేయర్, ఎల్డీసీ, యూపీఎల్ తదితర అంతర్జాతీయ కంపెనీల సీఈఓలు ఉన్నారు. భారత్‌కు చెందిన టాటా, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, జేఎస్ డబ్ల్యూ, గోద్రెజ్, ఎయిర్‌టెల్, బజాజ్ వంటి సంస్థల ప్రతినిధులు, సీఐఐ, నాస్కాం వంటి చాంబర్స్ ప్రతినిధులతోనూ రాష్ట్ర బృందం సమావేశం కానుంది. దావోస్ పర్యటనలో భాగంగా ఫార్మా, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, డిఫెన్స్, ఏరోస్పేస్, ఆహారశుద్ధి, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాల్లో పెట్టుబడుల ఒప్పందాలపై సీఎం బృందం సంతకాలు చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

ఏఐపై శ్రీధర్‌బాబు ప్రసంగం: కృత్రిమ మేధ (ఏఐ) పరిశ్రమ వర్గాలు ఏర్పాటు చేస్తున్న చర్చా వేదికలో ''డెవలపింగ్ స్కిల్స్ ఫర్ ఏఐ''అనే అంశంపై మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడనున్నారు. టెక్ కంపెనీలు, వర్తక సంస్థలు, ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్తలను కూడా రాష్ట్ర బృందం కలవనున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు మీడియాకు వెల్లడించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడు బ్రెండే బోర్జ్‌తో సమావేశం కానున్నట్టు తెలిపారు. తెలంగాణతో వరల్డ్ ఎకనామిక్ ఫోరంకు బలమైన వ్యవస్థీకృత సంబంధాలు ఉన్నాయని.. హెల్త్ కేర్– లైఫ్ సైన్సెస్ రంగంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఆధ్వర్యంలోని 'సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవెల్యూషన్ (సీ4ఐఆర్)'సదస్సు హైదరాబాద్‌లో జరగబోతోందని గుర్తు చేశారు. దావోస్ పర్యటనలో తెలంగాణ బలాబలాలను, ప్రాధాన్యతలను చాటనున్నట్టు వివరించారు.

ఫోరం చర్చల్లో మాట్లాడనున్న రేవంత్

తొలిసారి దావోస్ పర్యటనలోనే సీఎం రేవంత్ రెడ్డికి వరల్డ్ ఎకనామిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో మాట్లాడే అవకాశం దక్కింది. అక్కడ జరిగే చర్చాగోష్టిలో.. పురోగమిస్తున్న వైద్యరంగంపై రేవంత్ తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. ''ఫుడ్ సిస్టమ్స్ అండ్ లోకల్ యాక్షన్''అంశంపై జరిగే అత్యున్నత స్థాయి సదస్సులో పాల్గొని 'అగ్రి–ఎకానమీపై వాతావరణ మార్పుల ప్రభావం–రైతుల జీవనోపాధి పరిరక్షణలో భాగంగా వాతావరణానికి అనుగుణంగా సాగే వ్యవసాయాన్ని ప్రోత్సహించే చర్యల'పై సీఎం ప్రసంగించనున్నారు.

యాసంగి పంటలకు నీళ్లు ఇవ్వండి

మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు ఫోన్



సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా రైతుల యాసంగి పంటల కోసం రంగనాయక సాగర్ నుంచి నీరు విడుదల చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఫోన్ ద్వారా కోరారు. యాసంగి పంటకు నీళ్లు లేక రైతాంగం ఆందోళన చెందుతున్న నేపథ్యంలో నీటి లభ్యత ఉన్న మిడ్ మానేరు లేదా అనంతగిరి రిజర్వాయర్ నుంచి 1.50 టీఎంసీల నీటిని పంపింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా హరీశ్‌రావు నీటి విడుదల కోసం మంత్రి ఉత్తమ్‌ను కలసి లేఖ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన మరోసారి జిల్లాలో సాగు నీటి ఆవశ్యకత గురించి ఫోన్ ద్వారా మంత్రికి వివరించారు. అదేవిధంగా మల్లన్న సాగర్ ద్వారా కూడా రైతులకు నీళ్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాగా, మంత్రి ఉత్తమ్ తన వినతికి సానుకూలంగా స్పందించారని, నీటిపారుదల శాఖ అధికారులతో చర్చించి నీటి పంపింగ్ కోసం ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చారని హరీశ్‌రావు తెలిపారు.

కాంగ్రెస్ సర్కారు నుంచి అభినందనలు రాలేదు

స్వచ్ఛ సర్వేక్షన్ –23లో దేశంలోనే సిద్దిపేట 9వ స్థానంలో నిలిచిందని, దక్షిణ భారతదేశంలో మొదటి స్థానంలో నిలిచి క్లీన్ సిటీగా అవార్డు సొంతం చేసుకుందని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో మున్సిపాలిటీ ఏదైనా అవార్డు సాధిస్తే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభినందించే సంస్కృతి ఉండేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి అభినందనలు రాలేదరని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటిన సిద్దిపేట మున్సిపాలిటీ గురించి రాష్ట్ర ప్రభుత్వం ఒక ట్వీట్, ప్రెస్ నోట్ కూడా విడుదల చేయని దుస్థితిలో ఉన్నామని అన్నారు.

'కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తాయి'



సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేద్దామని బీజేపీ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఎక్స్ వేదికగా స్పందించారు. '2018లో కరీంనగర్, నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుపులో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించింది.. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను చూస్తే వచ్చే లోకసభ ఎన్నికల్లోను.. వారిద్దరూ కలిసి పనిచేసే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.. అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

కూలుస్తామంటే ఊరుకోం

మమ్మల్ని ముట్టుకునే దమ్ముందా?

- కాంగ్రెస్ పార్టీ బలహీనంగా లేదు
- ప్రశ్నిస్తే హిందూ వ్యతిరేకులా?
- సంజయ్‌వి మతిలేని మాటలు: మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్ కార్పొరేషన్: 'ప్రభుత్వాన్ని కూలుస్తామంటే చూస్తూ ఊరుకోం.. మమ్మల్ని ముట్టుకొనే దమ్ముందా, కాంగ్రెస్ పార్టీ బలహీనంగా లేదు.. మా పార్టీలో కోవర్ట్ వ్యవస్థ లేదు, మా 64 మంది కుటుంబ సభ్యులమంతా కలిసే ఉన్నాం, నోరు.. ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడాలి'అని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ నేత బండి సంజయ్‌ని హెచ్చరించారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో చిట్ చాట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ కూలుస్తుందని బండి సంజయ్ చెప్పడంపై స్పందిస్తూ.. ఆయన జోస్యం చెబుతున్నారా, లేదంటే బీఆర్ఎస్ నాయకులు ఆయనకు సమాచారం ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని తాము చెప్పిందే నిజమని దీనితో రుజువైందన్నారు. దేశంలో విధ్వంసం సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్న సంజయ్ వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా తప్పుపట్టారు. తాము దేశ నిర్మాణం చేసినవారిమని, విధ్వంసాలు సృష్టించే పని తమకెందుని అన్నారు. ఇవి మతిలేని వ్యాఖ్యలని ధ్వజమెత్తారు. తాము జీవితంలో బీజేపీతో కలిసేది లేదని, రెండు పార్టీల దారులు వేరని స్పష్టం చేశారు. ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన బండి సంజయ్ జోస్యాలు చెపుతున్నారని పొన్నం ఎద్దేవా చేశారు.

పర్మినెంట్‌గా 'కేసీఆర్'లానే ఉండండి..

'మీ నాయనకు సీఎం పదవి అనేది ఎడం కాలు చెప్పు అయింది. నీకు కూడా ఆ అక్షరాలు నచ్చట్లేదు.. పర్మినెంట్‌గా కేసీఆర్‌లానే ఉండండి. జీవితంలో సీఎం అనే పదవి తీసుకోకండి. సీఎం అనే పదమే మీకు పడదు. ఆ పదవి దిక్కే రాకండి. చాలా సంతోషం'అంటూ మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి పొన్నం వ్యాఖ్యానించారు. సీఎం పదవి కన్నా కేసీఆర్ అనే మూడు అక్షరాలు పవర్‌ఫుల్ అన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా విమర్శించారు. అధికారం కోల్పోతామని కేటీఆర్ కలలో కూడా ఊహించలేదని, అందుకే అసహనంతో మాట్లాడుతున్నారని అన్నారు.

అయోధ్యలో ఎన్నికల మార్కెటింగ్

అయోధ్యలో ధర్మానికి విరుద్ధంగా ఎన్నికల మార్కెటింగ్ జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇదే విషయం మాట్లాడితే హిందూ వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారన్నారు. అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ ఎవరు చేయాలో హిందువులందరికి తెలుసని, జంటగా లేనటువంటి వారెలా చేస్తారని ప్రశ్నించారు. ఆలయం నిర్మాణం పూర్తి కాకుండానే ప్రారంభోత్సవమేమిటన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించవచ్చన్నారు.

క్లుప్తంగా...

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మరోసారి బెదిరింపు కాల్స్

- శోభాయాత్ర తీస్తే చంపేస్తామని హెచ్చరికలు



అబిడ్స్(హైదరాబాద్): గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మరోసారి అరబ్ దేశాల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఈ ఏడాది శ్రీరామ నవమి రోజున శోభాయాత్ర తీయొద్దని, తీస్తే చంపేస్తామని 71999 42827, 42235 32270 ఫోన్ నంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చినట్లు రాజాసింగ్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి ప్రాణప్రతిష్ట జరగనున్న నేపథ్యంలో ఈ బెదిరింపులు రావడం గమనార్హం. గతంలో వచ్చిన బెదిరింపులపై రాష్ట్ర డీజీపీకి, పోలీస్ కమిషనర్‌కు, మంగళ్‌హాట్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రాజాసింగ్ ఇదివరకు విచారం వ్యక్తం చేశారు. తాజా బెదిరింపులపై మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా తనకు ఎమ్మెల్యే రాజాసింగ్ ఫిర్యాదు చేయలేదని, ఒక వేళ ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.

కులగణన తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలి

- సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన జాజుల



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీసీ కులగణన చేపట్టిన తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన నిర్వహించి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామంటూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని సీఎంకు గుర్తుచేశారు. ఆదివారం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌తో జాజుల భేటీ అయ్యారు. అనంతరం మాట్లాడుతూ పదిహేను రోజుల్లో సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. కులగణన తర్వాత సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తే బీసీల మద్దతు కాంగ్రెస్‌కు ఉంటుందనే విషయాన్ని సీఎం దృష్టికి తీసికెళ్లినట్లు వివరించారు. బీసీ రిజర్వేషన్‌ల పెంపు, కులగణనపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు జాజుల తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీలపట్ల అలసత్వం ప్రదర్శిస్తోందని విమర్శించారు.

ఐఐటీల్లో మరిన్ని సీట్లు.. | కటాఫ్ మేజిక్‌లో మార్పు

ఈ ఏడాది జేఈఈ పరీక్షపై సరికొత్త అంచనాలు

- ముంబై ఐఐటీలో 300లోపు సీటు
- ఇతర కాలేజీల్లో 11 వేల ర్యాంకు దాకా చాన్స్
- కంప్యూటర్ కోర్సుల్లో సీట్ల పెంపునకు కసరత్తు
- ప్రభుత్వ అనుమతి కోసం నిరీక్షణ



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ) కాలేజీల్లో ఇంజనీరింగ్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. కొన్నేళ్లుగా విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు సీట్లను పెంచాల్సిన అవసరాన్ని ఐఐటీలు, ఎన్‌ఐటీలు గత ఏడాది కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. ముఖ్యంగా కంప్యూటర్ కోర్సులను విద్యార్థులు కోరుకుంటున్నారని చెప్పాయి. కొన్ని ఆన్‌లైన్ కోర్సులను కూడా అందించాలనే ప్రతిపాదనను ఐఐటీలు చేశాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్ అర్హత సాధించిన విద్యార్థులంతా అన్ని ఐఐటీల్లోనూ కంప్యూటర్ కోర్సులనే మొదటి ఆప్షన్‌గా పెట్టుకున్నారు. దాదాపు 1.45 లక్షల మంది ఈ బ్రాంచ్‌లనే కౌన్సెలింగ్‌లో మొదటి ఐచ్ఛికంగా ఎంచుకున్నారు. ఈ ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా ఉందని, త్వరలో నిర్ణయం రావొచ్చని భావిస్తున్నారు. ఇదే జరిగితే ఐఐటీల్లో ఈ ఏడాది కనీసం 4 వేల కంప్యూటర్ సైన్స్ సీట్లు పెరిగే వీలుంది. ప్రస్తుతం ఐఐటీల్లో 15 వేల సీట్లు మాత్రమే ఉన్నాయి.

ముంబైకి మొదటి ప్రాధాన్యం

సీట్ల పెంపునకు కేంద్రం అంగీకరిస్తే ముంబై ఐఐటీకి మొదటి ప్రాధాన్యమిచ్చే వీలుంది. ఈ కాలేజీని జేఈఈ అడ్వాన్స్ ర్యాంకు పొందిన వాళ్లు ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఆ తర్వాత ఢిల్లీ, కాన్పూర్, మద్రాస్‌కు ప్రాధాన్యమిచ్చారు. తర్వాత స్థానంలో హైదరాబాద్ ఐఐటీ నిలిచింది. ముంబై ఐఐటీల్లో ఓపెన్ కేటగిరీలో బాలురు 67, బాలికలు 291వ ర్యాంకుతో సీటు కేటాయింపు ముగిసింది. మొత్తం మీద మంచి పేరున్న ఐఐటీల్లో 5 వేల లోపు ర్యాంకు వరకూ సీటు దక్కింది. అయితే, విద్యార్థులు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వని ఐఐటీల్లో 11,200 ర్యాంకు వరకూ సీట్లు వచ్చాయి. ఈ కేటగిరీలో బిలాల్ ఐఐటీ ఉంది. ఇలాంటి ఐఐటీల్లో సీట్లు పెంచడం అవసరం లేదని ఐఐటీలు భావిస్తున్నాయి.

ఎన్‌ఐటీల్లో చాన్స్ పెరిగేనా?

వచ్చే సంవత్సరం ఎన్‌ఐటీల్లో కటాఫ్ పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఐఐటీల్లో సీట్లు పెరగడం వల్ల కొంతమంది ఐఐటీల్లో చేరతారు. మరోవైపు ఎన్‌ఐటీల్లోనూ సీట్లు పెరిగే వీలుంది. కాబట్టి కటాఫ్‌లో మార్పులు ఉండొచ్చని భావిస్తున్నారు. వరంగల్ ఎన్‌ఐటీలో కంప్యూటర్ సైన్స్ 2022లో 1,996 ర్యాంకు వరకూ సీటు వస్తే, 2023లో బాలురకు 3,115 ర్యాంకు వరకూ సీటు వచ్చింది. సీట్లు పెరిగితే 2024లో 4 వేల ర్యాంకు వరకూ సీటు వచ్చే వీలుంది. ఎన్‌ఐటీల్లో 82 శాతం విద్యార్థులు తొలి ప్రాధాన్యతగా కంప్యూటర్ సైన్స్‌ను ఎంచుకున్నారు. రెండో ప్రాధాన్యత కూడా 80 శాతం ఇదే బ్రాంచ్ ఉండటం గమనార్హం. మొత్తం మీద గత ఏడాది ఆరు రౌండ్ల తర్వాత 34,462వ ర్యాంకు వరకూ బాలికల విభాగంలో సిక్కిం ఎన్‌ఐటీలో సీఎస్‌సీ సీట్లు వచ్చాయి. మెకానికల్‌కు మాత్రం ఇదే ఐఐటీలో 58 వేల ర్యాంకు వరకూ ఓపెన్ కేటగిరీ సీట్లకు కటాఫ్‌గా ఉంది. ఈసారి సీట్లు పెరగడం వల్ల సీట్ల కటాఫ్‌లో మార్పులు ఉండొచ్చని భావిస్తున్నారు.

గత ఏడాది ప్రధాన ఐఐటీల్లో కటాఫ్ ర్యాంకులు

ఐఐటీ	కటాఫ్	
	బాలురు	బాలికలు
బాంబే	67	291
కాన్పూర్	238	610
ఖరగ్‌పూర్	279	702
ఢిల్లీ	118	419
మద్రాస్	148	479
హైదరాబాద్	674	1300
తిరుపతి	3701	6558
రూర్కీ	412	1165
పాలక్కడ్	5162	11200

ప్రధాన ఎన్‌ఐటీల్లో ఆరవ రౌండ్ తర్వాత ఓపెన్ కేటగిరీలో కటాఫ్

నిట్	బాలురు/బాలికలు	సీఎస్‌సీ	మెకానికల్	బయోటెక్నాలజీ
వరంగల్	బాలురు	3115	17718	40209
	బాలికలు	4530	25560	23522
ఆంధ్రప్రదేశ్	బాలురు	19558	43936	57872
	బాలికలు	19909	41062	59825
తిరుచ్చి	బాలురు	1509	10751	-
	బాలికలు	2086	20150	-
సూరత్‌కల్	బాలురు	1984	14069	-
	బాలికలు	3298	21223	-
కాలికట్	బాలురు	5256	22734	38003
	బాలికలు	6850	32842	42454
జలంధర్	బాలురు	11017	33152	49496
	బాలికలు	17138	45565	48593
సిక్కిం	బాలురు	24093	49141	-
	బాలికలు	34462	58776	-

సిరిధాన్యాల అంబలే నిజమైన వైద్యుడు

పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.ఖాదర్ వలి



సాక్షి, హైదరాబాద్: సిరిధాన్యాల అంబలే మనకు నిజమైన వైద్యుడని పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఖాదర్ వలి పేర్కొన్నారు. ఆరోగ్యంగా జీవించాలని అనుకునే ప్రతి ఒక్కరూ రోజుకు రెండు పూటలూ సిరిధాన్యాల అంబలి భోజనానికి ముందు విధిగా తాగాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ రాగన్నగూడలోని లక్ష్మీ మెగా టౌన్‌షిప్‌లో ఆదివారం రాత్రి అనుదిన అంబలి ఉచిత పంపిణీ కేంద్రాన్ని ఖాదర్ వలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి శ్యామ్ ప్రసాద్ రెడ్డి తన సతీమణి దివంగత జయశ్రీ జ్ఞాపకార్థం అనుదినం అంబలి పంపిణీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తాను రోజూ భోజనానికి ముందు అంబలి తాగుతానని, రెండుపూటలా సిరిధాన్యాలే తింటానని, 67 యేళ్ల నిండినా తనకు ఏటువంటి సమస్యలు లేవన్నారు. మన ఆహారం ప్రపంచవ్యాప్తంగా కంపెనీల పరమైపోయిందని, మనం ఆహార సార్వభౌమత్వాన్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కిలో శరీర బరువుకు 4 గ్రాముల కన్నా ప్రొటీన్ ఎక్కువ అవసరం లేదని, ఎక్కువ ప్రొటీన్ తినండి అని కంపెనీలు వ్యాపారాభివృద్ధి కోసమే ప్రచారం చేస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చిత్రకారులు తోట వైకుంఠం పాల్గొన్నారు.

75 గిరిజన తెగల అభివృద్ధి కోసం..

- నేడు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ప్రధాని మోదీ: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- 18 రాష్ట్రాల్లో రూ. 24,104 కోట్లతో ఈ తెగల అభ్యున్నతికి కృషి
- తెలంగాణలో 468 గ్రామాల్లో ప్రత్యేక సౌకర్యాలు



సాక్షి, హైదరాబాద్: దేశంలో కనుమరుగవుతున్న 75 గిరిజన తెగల అభ్యున్నతికి కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి ఆదివాసీల అభివృద్ధి పథకం కింద చేపట్టే ఈ కార్యక్రమాన్ని సోమవారం ప్రధాని మోదీ ప్రారంభిస్తారని చెప్పారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం ఇప్పటికే 2023లో రూ.1,17,943 కోట్లు ఖర్చు చేసిందని, అంతరించిపోతున్న గిరిజన తెగలను కాపాడేందుకు వారికి ప్రాథమిక హక్కుల కల్పనతోపాటు మౌలిక సదుపాయాలను అందించే కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభిస్తోందన్నారు. ఇందులోభాగంగా 75 గిరిజన ఆదివాసీ తెగల కోసం రూ. 24,104 కోట్ల ప్రత్యేక నిధులను కేటాయించినట్లు తెలిపారు. కనుమరుగవుతున్న 75 గిరిజన ఆదివాసీ తెగలు 18 రాష్ట్రాల్లోని 454 మండలాల్లోని 22 వేల గ్రామాల్లో ఉన్నాయని, ఈ తెగలకు చెందిన గిరిజనులు మొత్తం 39 లక్షలు మంది ఉన్నారని చెప్పారు. 75 ఏళ్లుగా నీళ్లు, ఇళ్లు, కరెంటు, స్కూల్స్, ఆస్పత్రులు, రోడ్లు ఇతర మౌలిక వసతులు వీరికి లేకుండా పోయాయన్నారు. దేశవ్యాప్తంగా వంద జిల్లాల్లో వీరి అభ్యున్నతి కోసం ఆదివాసీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. నవంబర్ 17 నుంచి ఇప్పటివరకు లబ్ధిదారులను గుర్తించామని, వంద జిల్లాల్లో 45 రోజుల్లోనే లక్ష ఇళ్లను మంజూరు చేశామని, వారికి హక్కు పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో వెయ్యి కిలోమీటర్ల రోడ్లు వేస్తామని, 27వేల ఇళ్లకు రక్షిత మంచినీరు ఇస్తామని, 100 మొబైల్ మెడికల్ యూనిట్లు అందుబాటులో ఉంటాయని, 100 హాస్టళ్లను నిర్మిస్తామని చెప్పారు. ఆదివాసీలకు రుణాలు ఇచ్చేందుకు 19,478 కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేయనున్నట్లు తెలిపారు.

తెలంగాణలో 468 గ్రామాలు

ఈ పథకం కింద గుర్తించిన ఆదివాసీ గ్రామాల్లో 468 తెలంగాణలో ఉన్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌లోని కోలం ఆదివాసీ తెగలు, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వికారాబాద్‌లోని చెంచు తెగలు ఇందులో ఉన్నట్లు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో 27,335 మంది కోలం తెగకు చెందిన వారున్నారన్నారు. 75 ఏళ్ల తరువాత వీరికి హక్కులు కల్పించబోతున్నట్లు పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ గిరిజన యూనివర్సిటీని ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని కేంద్రం యోచిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని ఆబిడ్స్‌లో గిరిజన మ్యూజియానికి శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు.

ఓ పరమాత్మా! నా సకల అంగాలు - వాక్, చక్షు(కన్ను), శ్రోత్రమ్(చెవి), ఇంకా ప్రాణం, మొదలైన సర్వేంద్రియాలు, నా శారీరక, మానసిక శక్తులన్నీ పరిపుష్టం చేయుము.
- ఉపనిషత్తు

సాక్షి
సోమవారం, 15 జనవరి 2024

శ్రీ సూర్యనారాయణా...

బతుకులో పండుగ కాని క్షణం ఏముంటుంది! జీవితాన్ని కేవలం జీవించడం కాదు, ఉత్సవీకరించుకోమని చెబుతుంది ఒక సూక్తి. కాకపోతే ఒక షరతు; మహాకవి చెప్పినట్టు, మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, ఆకసమున హరివిల్లు విరిస్తే అవి మనకేనని ఆనందించే పసికూనలమైపోవాలి అందరం. జీవితం అనుక్షణ ఉత్సవభరితమే అయినా ప్రకృతిలో మారే ప్రతి ఋతువూ, కాలం వెంబడి మనిషి వేసే ప్రతి కీలకమైన అడుగూ పెద్దపండుగ అవుతుంది. ధనూరాశి నుంచి మకరరాశి లోకి సూర్యుడి సంక్రమణాన్ని సంకేతించే అలాంటి పెద్ద పండుగే సంక్రాంతి.

ఏటా నెల నెలా రాశి విడిచి రాశిలోకి సూర్యుడు అడుగుపెట్టే ప్రతి సందర్భమూ సంక్రాంతే అయినా, మకర సంక్రాంతి మాత్రమే ఎందుకు మైలురాయి అయిందంటే; అప్పటికి మంచుపొరలు, చీకటి తెరలు క్రమంగా తొలగి వెలుగు వాకిళ్ళు తెరచుకోవడం మొదలవుతుంది. కొత్త పంట చేతికొచ్చిన ఆనందంలో పశువులు, పక్షులతో సహా ప్రకృతి సమస్తం భాగమై మనిషిలో కృతజ్ఞత ఉప్పొంగుతుంది. అలా ప్రతి ప్రాణితోనూ, చెట్టుతోనూ, పుట్టతోనూ తన ముడిని గుర్తుచేసుకునే సందర్భమే సంక్రాంతి. ఆ మాటకొస్తే ఏ పండుగైనా అంతే. చిత్రవిచిత్రమైన రంగవల్లులను తీర్చిదిద్దేది, కొత్త బియ్యపు పిండిని చీమల వంటి సూక్ష్మజీవులకు ఆరగింపు చేసి భూతదయను చాటుకునేందుకేనని పెద్దలంటారు. ఒక్కోసారి తత్త్వం అడుగంటి తంతు మిగలడం కాలం చేసే మాయ.

మనిషి ఊహలో తొలిదైవంగా ముద్రపడిన ప్రాకృతిక అద్భుతమే సూర్యుడు. పరోక్ష దేవతలకు భిన్నంగా ఆయన ప్రత్యక్ష దైవం. అందుకే సర్వసాక్షి, కర్మసాక్షి సహా ఆయన చుట్టూ ఎన్నో కల్పనలు. దేవతల్లో పెద్దాయన ఆయనే. ప్రపంచమంతటా తొలి కొలుపులు అందుకున్నవాడిగా ఆయన వైశ్విక దైవం. దేవుడి గురించిన తొలి ఎరుక కలిగించిన ఆ మెరుపు, మైమరపు ఋగ్వేదంతో సహా ఆదిమ కృతులన్నింటిలో నిసర్గసుందరంగా వ్యక్తమవుతాయి. మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఒకప్పుడు ప్రధాన దైవమైన సూర్యుడికి మన పౌరాణిక ప్రసిద్ధుడైన నారాయణుని పేరు చేర్చిన ఫలితంగానే ఆయన సూర్యనారాయణుడయ్యాడని గుంటూరు శేషేంద్రశర్మ అంటారు. ఒకప్పుడు పశ్చిమాసియాలో మిత్రారాధన పేరుతో వర్ధిల్లిన సూర్యారాధన ప్రభావం ఇతర మతాలపై ఎలా పడిందో అత్యంత ఆశ్చర్యకరంగా వివరిస్తాడు జి.జె.ఎం. ఫ్రేజర్ తన 'గోల్డెన్ బౌ' అనే బృహద్రచనలో. మన శ్రీరామచంద్రుడే కాక, ఒకనాటి పశ్చిమాసియా రాజులు, పర్షియన్ చక్రవర్తులు కూడా తమను సూర్యుడితో ముడిపెట్టుకున్నారు. ఆదిత్యహృదయోపదేశం పొందిన తర్వాతే రాముడు రావణుని జయించగలిగాడని రామాయణం అంటుంది.

సంక్రాంతినీ, సూర్యునీ లోతుగా తడిమిన కొద్దీ ఇంకా ఎన్నెన్ని విశేషాలో! సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించే ఘట్టాన్నే మనం మకర సంక్రాంతిగా జరుపుకొంటాం కానీ నిజంగా సూర్యుడికి గమనమంటూ ఉంటుందా? భూమే సూర్యుడి చుట్టూ ఒకింత వంపుతో తిరుగుతూ దూరమూ, దగ్గరా అవుతున్న క్రమంలోనే కాలాలూ ఋతువులూ ఏర్పడుతున్నాయి. మకర సంక్రాంతిని ఇప్పుడు జనవరి 15న జరుపుకొంటున్నాం కానీ, క్రీ.శ. 1000లో డిసెంబర్ 31న, క్రీ.శ.272లో డిసెంబర్ 21న జరుపుకొనేవారట. మరో తొమ్మిదివేల సంవత్సరాల తర్వాత మకర సంక్రాంతి జూన్ నెలలో వస్తుందట. జ్యోతిశ్శాస్త్ర సంబంధమైన కాలగణనాలు ఇలాంటి విచిత్రాలను ఆవిష్కరిస్తే, శాస్త్రవిజ్ఞానం మరో రకమైన విలక్షణ దృశ్యానికి తెరతీసి ఒక్కోసారి వెన్నులో వణకు పుట్టిస్తుంది. సూర్యుడు ఎంత పెద్దాయనంటే, ఆయన వయసు 460 కోట్ల సంవత్సరాలకు పైనేనట. మరో 500 కోట్ల సంవత్సరాలు గతిస్తే, తన చుట్టూ తిరిగే భూమితో సహా అన్ని గ్రహాలనూ తనలో కలిపేసుకుని ఓ తెల్లని మరుగుజ్జు నక్షత్రంగానూ, ఆ తర్వాత నల్లని నక్షత్రంగానూ మారిపోతాడట. ఆ లోపల తన కేంద్రంలో నిరంతరాయంగా జరిగే కోట్ల టన్నుల హైడ్రోజన్, హీలియమ్‌ల కలయిక నుంచి లక్షల టన్నుల పదార్థం శక్తిగా మారిపోయే క్రమంలోనే మన మనుగడకు అవసరమైన వెలుగు, వేడి లభిస్తున్నాయి. శీతోష్ణాల నిర్విరామ ఘర్షణ నుంచే జీవి పుట్టి మనతో సహా అనేక ప్రాణుల రూపంలో పరిణామం చెందడం వేరే కథ.

మన ఊహకు అతీతమే కాక, మన నిత్యజీవన సంతోషాలకు ఏమాత్రమూ అడ్డురాని సూర్యుని వైశ్విక మూలాలను ఈ పండుగ వేళ మరీ లోతుగా తడమడమెందుకు? ప్రకృతితో మమేకమై వెలుగూ వేడిలో స్నానిస్తూ ఈ క్షణాలను మధురమధురం చేసుకుందాం. పొన్న, ఉల్లి, జాజి, సంపంగి, మల్లె, మంకెన, ములగ, ఆవ, వంగ, గుమ్మడి పూచాయలు ధరించే ఆ సూర్యనారాయణుడికి నోరారా మేలుకొలుపు పాడుకుందాం. కవయిత్రి కుప్పిలి పద్మ అన్నట్టు, ఒక్కుమ్మడిగా పండుగను పిలిచేందుకు ఈ చేతులతో చుక్కల ముగ్గుల్ని, రంగుల చామంతుల్ని పూయిద్దాం. ఎక్కడెక్కడి చుట్టాలనో ఏడాదికొకచోట కలిపే సారంగధర మెట్ట మీది తనివితీరని తిరునాళ్ళ పుట్టినిల్లు జ్ఞాపకాల నెగడు దగ్గర చలి కాగుదాం. చెట్టుకొకరుగా పుట్టకొకరుగా తుప్పల వెంటా పుంతల వెంటా పడి తిరుగుతూ, ముళ్ళు గుచ్చుకోకుండా, ఒక్క మొగ్గనీ తెంపకుండా, ఒక్క పువ్వునూ వదలకుండా మృదువైన పూల వేట సాగిద్దాం.

ఇలా కాదే వీళ్లు ఉండాల్సింది!

కామెంట్



కరణ్ థాపర్

బ్రిటన్ భిన్నమైన దేశం. బ్రిటన్ దేశస్థులు విలక్షణమైనవారు. ఎవరి వ్యక్తిగత జీవితాలలోకీ తొంగిచూడరు. నిత్య జీవిత భౌతిక సంభాషణలలో అంతర్లయగా ఉన్న హాస్యాన్ని చక్కగా పట్టుకోగలరు. విధి నిర్వహణలలో ఘటనాఘటన సమర్థులు. మర్యాద ఇవ్వడంలో మన రామన్నలను మించినవారు. ఎంతటి విపత్తుకైనా ముందస్తుగా సిద్ధమై ఉండేవారు. పరదేశీ అతిథులను గౌరవించి, ఆదరించేవారు. తలవని తలంపుగానైనా తమ దేశానికి అప్రతిష్ఠను తీసుకురాని వారు. అంతటి ఉత్కృష్ట ప్రజల పైన, అంతటి నాగరిక దేశం మీద గత డిసెంబరు 23న హీత్రో విమానాశ్రయంలోని మూడవ నంబరు టెర్మినల్ పూర్తి విరుద్ధమైన నీడల్ని ప్రసరింపజేసింది! 'ఇలా కాదే వీళ్లు ఉండాల్సింది' అన్న భావనను ఆనాటి ప్రయాణికులకు కలిగించింది.

ఇక్కడి నా వ్యాసాల సరళిని బాగా ఎరిగివున్న వారికి ఆ వ్యాసాలలో తరచు నేను బ్రిటన్ దేశాన్ని, బ్రిటన్ దేశస్థులను ఆకాశానికి ఎత్తేసినంతగా వెనకేసుకు రావటమన్నది గ్రహింపునకు వచ్చే ఉంటుంది. బ్రిటన్ దేశస్థుల గుండె ధైర్యాన్ని నేను ఇష్టపడతాను. వ్యక్తుల జీవితాలలోని గోప్యతను గౌరవించి, వారి ఆంతరంగిక విషయాలలోకి చొరబడకుండా ఉండే ఆ స్వభావాన్ని ప్రశంసిస్తాను. అంతేకాదు, ప్రపంచంలోనే బ్రిటిషర్లు గొప్ప హాస్యచతురత ఉన్నవారనీ దృఢంగా విశ్వసిస్తాను. ఇది చాలా వరకు ఉద్దేశపూర్వకమైన అతిశయోక్తి, తేలికపాటి వ్యంగ్యోక్తి, పైనుంచి కిందివరకు కూడా నర్మగర్భ విమర్శ. ఇదంతా ఎక్కువగా బ్రిటన్ రాచకుటుంబం పైన! ఈ క్రమంలో వారి అసహజ ప్రవర్తనల్ని అభినందించడం, వారి అసాధారణతల్లోని అవకరాలను కనుకొనల్లోంచి చూసీచూడనట్లుగా వదిలేయడం, వారు మాటిమాటికీ చేస్తుండే తప్పులను మన్నించడం వంటి మనో నైపుణ్యాలను నేను పెంపొందించుకున్నాను.

కానీ డిసెంబర్ 23 సాయంత్రం హీత్రో విమానాశ్రయంలోని 3వ టెర్మినల్‌లో ఏదైతే జరిగిందో అది మాత్రం క్షమించలేనిది. నిజానికి క్షమించ తగనిది. మరోమాటకు ఆస్కారం లేకుండా అదొక వాదనలకు తావులేని అసమర్థతకు నిదర్శనం. బ్రిటన్‌ను సందర్శించే వ్యక్తుల పట్ల నమ్మశక్యం కానంతటి అమర్యాదకరమైన ధోరణి. బహుశా ఎన్నడూ లేనంతగా పూర్తిస్థాయి ఆత్మాశ్రయ ఓటమి. బ్రిటన్ స్వరూపాన్ని గరిష్ఠ స్థాయిలో ఘోరాతిఘోరంగా వీక్షింపజేసిన ఉదాసీనత.

రాత్రి ఎనిమిది గంటలకు విమానం దిగిన ప్రయాణికులు విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ కోసం కిక్కిరిసిపోయి, మందకొడిగా మెలికలు తిరుగుతూ ముందుగు సాగుతూ ఉన్న పొడవాటి వరుసలో రెండున్నర గంటలసేపు విధిలేక వేచి ఉండవలసి వచ్చింది. పాదం నొప్పితో నేను అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో ఇంకా ల్యాండ్ అవుతున్న విమానాల నుంచి కొత్త ప్రయాణికులు మా వరుసలోకి వెనుక నుంచి జమ అవుతుండటం గమనించాను. ఇప్పుడు వరుసలో వేచి ఉండే కాలం బహుశా రెండున్నర నుంచి నాలుగు గంటలు అవుతుందా! ఫస్ట్ క్లాస్, అంతకంటే కాస్త మాత్రమే దిగువ శ్రేణిలో ఉండే క్లబ్ క్లాస్ ప్రయాణికులు కూడా మా క్యూలో ఉన్నారు. వారి కోసం వేరుగా ఏర్పాటై ఉండే 'ఫాస్ట్ ట్రాక్'ను బ్రిటన్ తొలగించి ఉండటమే అందుకు కారణం.

విమానాశ్రయ అధికారులకు ఇదేమైనా పట్టి ఉంటుందా? నిజం ఏమిటంటే, వారిలో ఒక్కరు కూడా విచారం వ్యక్తం చేయటం లేదు. క్షమాపణ కోరటం అటుంచండి, అడిగిన దానికి సమాధానం చెప్పిన వారైనా ఎవరు? ఒకవేళ క్యూలో ఉన్న ప్రయాణికులు బాత్‌రూమ్‌కి వెళ్లవలసివస్తే వారి పరిస్థితి ఏమిటన్న కనీస ఆలోచనైనా వారికి వచ్చి ఉంటుందా? నాకు గుర్తున్నంత వరకు క్యూలో ఉన్న వారెవరికీ అదృష్టవశాత్తూ ఆ అవసరం రాలేదు. లేదా, అలాంటి అవసరం వచ్చినప్పటికీ వారు క్యూలో తమ స్థానం కోల్పోయి, మరిన్ని అంతులేని గంటలపాటు వేచి ఉండవలసి వస్తుందన్న భయంతో ఆ బాధను అలాగే ఉగ్గబట్టి ఉండాలి.



అదీంకా క్రిస్మస్‌కు వచ్చిపోయే వారు ఎక్కువలో ఎక్కువగా ఉండే సమయం. ఆ రద్దీని ముందే ఊహించి, అందుకు సిద్ధంగా కదా అధికారులు ఉండాలి. పైగా హీత్రో విమానాశ్రయానికి గతంలో ఇలాంటివి చాలినన్ని అనుభవాలు ఉన్నాయి. 2019లో ఈ విమానాశ్రయం ద్వారా దాదాపు 8 కోట్ల 10 లక్షల మంది రాకపోకలు సాగించారు.

అయినప్పటికీ 23న సగానికి పైగా ఇమ్మిగ్రేషన్ కౌంటర్‌లు సిబ్బంది లేకుండా కనిపించాయి. చివరికి ఎట్టకేలకు నా వంతు వచ్చినప్పుడు, క్లియరెన్స్ కోసం నా దగ్గరికి వచ్చిన అధికారి దగ్గర కనీసం పెన్ను కూడా లేదు! పెన్ను కోసం అతడు తన సహ అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పుడు నేను మరికొన్ని ఆవేదనా భరితమైన నిమిషాలను గడుపుతూ అతడి కోసం వేచి ఉండవలసి వచ్చింది. అదృష్టవశాత్తూ నాల్గవ వ్యక్తి దగ్గర అతడికి - మళ్లీ తిరిగి ఇచ్చే షరతుపై - ఒక పెన్ను లభించింది.

అప్పటికి మా బ్యాగులు లగేజ్ బెల్టుల నుంచి జారి వచ్చి, తీరూతెన్నూ లేకుండా కలగాపులగంగా పడిపోయాయి. కొన్ని అసలైన చోటులో, మిగతావి చాలా వరకు విసిరివేసినట్లుగా అక్కడికి దూరంగా చెల్లాచెదురైన వాటిలో! వాటి నుంచి నా రెండు బ్యాగుల్ని కనిపెట్టి తీసుకోడానికి మరొక అరగంట! దాదాపు మూడు వందల మంది ప్రయాణికుల బ్యాగులతో అవి కిందామీదా అయి కేవలం కలిసిపోవడం మాత్రమే కాదు, వాటిని వెతికి పట్టుకోడానికి అవి ఏమాత్రం పడి ఉండే అవకాశం లేని చోట వాటిని కనిపెట్టాల్సి వచ్చింది.

ఢిల్లీ నుంచి ముందురోజు రాత్రి బుక్ చేసుకున్న క్యాబ్ డ్రైవర్ నేను హీత్రోలో ల్యాండ్ అయిన వెంటనే నాకు ఫోన్ చేసి, తను విమానాశ్రయ నిష్క్రమణ మార్గం వైపు ఉన్న డబ్ల్యు.హెచ్. స్మిత్ కౌంటర్ దగ్గర నా కోసం వేచి ఉన్నానని చెప్పాడు. కానీ నేను అతడిని చేరడానికి మూడు గంటల సమయం పడుతుందని అనుకుని ఉండడు. నా కోసం ఓపికగా వేచి ఉండటం తప్ప అతడికి వేరే దారి లేదు. లేకుంటే హీత్రో బాడుగకు అతడికి డబ్బు రాదు కదా!

ఇది ఆమోదయోగ్యం కాదని బ్రిటిష్ ప్రభుత్వానికి గట్టిగా చెప్పాల్సిన అవసరం ఉన్నందున నేను ఇదంతా నిజాయితీగా రాస్తున్నాను. ఇంతకుమించి వేరే మార్గం లేదు. ఎవరికి నేనీ అనుభవాన్ని చెప్పినా భయపడిపోయారు. కానీ ఇది నాకు మాత్రమే ప్రత్యేకమైన అనుభవం కాదు. ఇలా వేల మందికి, బహుశా పదుల వేల మందికి జరిగి ఉంటుంది. టెర్మినల్ 3లో ఇది సర్వసాధారణం. అయితే ఈ సర్వసాధారణత్వాన్ని ఒక మామూలు విషయంగా బ్రిటిష్ అధికారులు భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

కనుక ఒక వ్యంగ్య వ్యాఖ్యతో, ఒక విధమైన ప్రతీకారం వంటి సూచనతో ఈ వ్యాసాన్ని నేను ముగిస్తాను. టెర్మినల్ 3లో దిగితే భారతదేశ పాస్‌పోర్టు కలిగివున్న తన అత్తమామలకు కూడా ఇదే జరుగుతుందని రిషి సునాక్ గ్రహించగలరా... బహుశా ఆయన వాళ్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయిస్తే తప్ప?

నా సలహా. ప్రతి భారతీయ విమానాశ్రయంలో ఫాస్ట్ ట్రాక్‌ను ఉపయోగించకుండా బ్రిటిష్ పౌరులందరినీ నిరోధించాలి. అది నిజంగా జరిగితే హీత్రోలో పరిస్థితులు చాలా త్వరగా మెరుగుపడతాయి. నిజం! నా మాట నమ్మండి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇవీ తేడాలు!



గుర్తుంచుకోండి: హిందూయిజం హిందూత్వ కాదు. హిందూత్వ జాతీయవాదం కాదు. జై శ్రీరామ్ అనేది జై సియారామ్ లేదా రామ్ రామ్ లాంటిది కాదు. ప్రభుత్వం, ప్రధాని మాత్రమే దేశం కాదు. అయోధ్యలోని రామాలయ లక్ష్యాలు: ఒక మనిషిని అమితంగా పెంచడం, రాజకీయ లబ్ధి.

- ఉర్వీశ్ కోఠారీ, గుజరాతీ రచయిత

జెంటిల్‌మన్ల కోసం...



టాయ్‌లెట్లలో కొంతమంది మగవాళ్లు సీటును ఎత్తకుండానే మూత్రం పోస్తుంటారు. ముఖ్యంగా విమానాలు, రైళ్లలో కామన్ టాయ్‌లెట్ ఉన్నప్పుడు ఆ సీటు మీద కూర్చోలేక స్త్రీలు చాలా ఇబ్బందిపడతారు. అందుకే నా జీవితాన్ని, టాయ్‌లెట్‌ను ఒక స్త్రీతో పంచుకోవడం మొదలుపెట్టినప్పుడు, నేను కూడా మహిళల్లాగే కూర్చుని మూత్రం పోయాలని నిర్ణయం తీసుకున్నాను. వాళ్లకోసం కనీసం టాయ్‌లెట్‌ను శుభ్రంగా ఉంచడమైనా మనం చేయగలం.

- రాహుల్ రవీంద్రన్, నటుడు

విలువైన బహుమానం



అందమైన నేపాలీయులు (అయోధ్యలోని) రామాలయం కోసం సాలగ్రామాలను బహూకరించారు. రాముడు, సీత విగ్రహాలను వాటినుంచి చెక్కుతారు. 1951లో నేపాల్ రాజు త్రిభువన్ వీర్ విక్రమ్ షా నేపాల్‌ను భారత్‌లో విలీనం చేస్తానని అన్నారు. ఆ ప్రతిపాదనను నెహ్రూ తిరస్కరించారు.

- ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' గౌరవ సంపాదకుడు

అంత కష్టమా?



యెమెన్ మీద యూకే నావిక సైనిక చర్యకు పాల్పడగలదు; కానీ పడవల మీద అక్రమంగా వలస వచ్చేవారిని అడ్డుకోవడానికి ఇంగ్లీష్ ఛానల్‌ను మాత్రం మూసివేయలేదా?

- ఇంతియాజ్ మహమూద్, థింకర్

కొత్త చీదర



రెస్టారెంట్లలో క్యూఆర్ కోడ్స్‌ను సాధారణీకరించడాన్ని నిర్మూలించడానికి పూనుకునే ఏ అతివాద గ్రూపునకైనా నిధులు ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

- కబీర్ తనేజా, ఫెలో

అందరికీ దూరంగా...



తన జీవితమంతా మా తాతయ్య నన్ను ఎంతో ప్రేమించాడు. ఆయన ఈరోజు (జనవరి 13) చనిపోయాడు. ఆయన్ని నేను 14 ఏళ్లుగా చూడలేదు. 4 ఏళ్లుగా ఆయనతో కనీసం మాట్లాడలేదు. ఇస్లాంలో మతభ్రష్టతకు చెల్లించాల్సిన మూల్యానికి అంతం లేదు.

- అలీ మాలిక్, పాకిస్తాన్ నాస్తికుడు

ఇన్ బాక్స్

పుష్యలక్ష్మి



గోమయంబుతో గొబ్బెమ్మలు
శోభాయమానమై కొలువుదీరే
ముంగిళ్ళందు రంగవల్లులు
ముస్తాబై మురిసే
భగ భగల భోగి మంటలు
భోగ భాగ్యాలనిచ్చే భవ్య భోగి!

పుడమినందు పాడిపంటలు
పొంగిపొరలే
దండిగా ధాన్యపు రాశులు
రైతు లోగిళ్ళకు తరలే
వచ్చేను క్రాంతి తెచ్చేను శాంతి
స్వాగతంబు పలికే సంక్రాంతి!

పసుపు కుంకుమలద్ది
పశువుల పూజించి
పొలి చెలకల్లో పొంగళ్ళు జల్లి
మన్ను మిన్నులకు ప్రణమిల్లి
కాచు మమ్మేలు కనుమ గౌరి!!

- బోనగిరి పాండురంగ

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

పచ్చా పొంగలి... పాలా పొంగలి... పొంగలో పొంగలి!

సందర్భం



ప్రొ॥ నాగపట్ల భక్తవత్సల రెడ్డి

గొబ్బియాళ్లో గొబ్బియని పాడారమ్మ
కంచి వరదరాజులే గొబ్బియాళో
గొబ్బియాళో పతిని పార్వతినీ దలసి
పరమ గొబ్బి తట్టారే గొబ్బియాళో
గొబ్బియల్లో భామలందరు గూడి భజన
గొబ్బి తట్టరే గొబ్బియల్లో
గొబ్బియల్లో భామలందరూ గూడి
బాయిసీళ్ళకు పోయిరే గొబ్బియల్లో
గొబ్బియల్లో గొబ్బియని పాడారమ్మ
కంచి వరదరాజులే గొబ్బియల్లో

డిసెంబరు 15 లేదా 16 మొదలు జనవరి 14 లేదా 15 వరకు ఉండే నెల తిరుపతి ప్రాంతంలో పండగ నెల. ధనుర్మాసం, మార్గళి మాసం అని కూడా అంటారు. ఈ మాసం చాలా పవిత్రమైంది. ఈ నెల మొత్తం పొద్దున్నే ఇంటి ముందర కళ్లాపి చల్లి ముగ్గు వేసి పేడతో చిన్న చిన్న ముద్దలు చేసి, గుమ్మడి పువ్వు పెట్టి గొబ్బెమ్మలు బేసి సంఖ్యలో పెడతారు. ఈ గొబ్బెమ్మల్ని తర్వాత గోడమీదనో లేక కాలు తగలడానికి అవకాశం లేని చోటో పిడకలు తట్టి ఎండ బెడతారు. ప్రతిరోజు ఆడవారు రాత్రి పూట గాని లేదా వీలు చూసుకొని పగటి పూట గాని గొబ్బి తట్టుతూ గొబ్బి పాటలు పాడుకుంటారు. ఒకపుడు పెండ్లి కావలసిన వారు మాత్రమే పాడేవారని అంటారు కాని ఇపుడు అందరూ పాడుతున్నారు. గొబ్బి పాటల్లో గొబ్బెమ్మను మేల్కొల్పి, నిద్రబుచ్చే పాటలు ఉండేవి. గొబ్బియాళ్లో, గొబ్బియల్లో అని పాట పాదానికి ముందు చివర, లేదా పాదాంతంలో లేదా ఆ పదమే లేకుండా పాడే గొబ్బిపాటలు మార్గళి మాసంలో మార్మోగుతుండేవి. వందలకొద్దీ ఉండిన ఈ పాటలు కనుమరుగవుతున్నాయి.

ఈ నెలలో ఆడవారు పోటీలు పడి ముగ్గుపిండి ముగ్గులు, రుబ్బిన బియ్యపు పిండితో వేసే ముగ్గులు పెట్టేవారు. చుక్కల ముగ్గులు, గీతల ముగ్గులు కూడా ఉంటాయి. ముగ్గులతో పాటు ఎర్రమట్టి (కాషాయ రంగు) పట్టీలు గీసేవారు. సంక్రాంతి నాలుగు రోజుల పండగ- భోగి, పెద్ద పండగ, పశువుల పండగ, కనుమ పండగ (ఊరిని బట్టి పండగ పేర్లు, రోజులు మారవచ్చు). తెల్లవారు జామున వేసే భోగి మంటల్లో పాత లేదా పనికిరాని పనిముట్లు, గంపలు, చేటలు, చింకి చాపలు, ఒక నెల ముందు నుంచి సేకరించి భద్రపర్చిన తుట్లు లేదా కంపతో పాటు వేస్తారు. పొద్దున్నే భోగిలోనే అండాలు పెట్టి నీళ్లు కాచి, ఆ నీళ్లతో తలంటు స్నానాలు చేసేవారు. ఇంటిలోని నులక మంచాలు, పనిముట్లు ఆ వేడి నీళ్లతోనే కడిగేవారు. ఇది మాంసాహారం (తినేవారికి) తప్పనిసరి.

రెండో రోజు పెద్దపండగ. పూర్తిగా శాకాహారం (కొన్ని కులాల్లో మద్యం, మాంసాహారం కూడా) ఉంటుంది. ఇల్లంతా అలికి పిండి ముగ్గులు వేసి, ఎర్రమట్టి పట్టీలు గీసి, రంగులద్ది, గుమ్మాలకు మామిడాకు తోరణాలు కట్టి అలంకరించుకొనేవారు. ఒకనాడు పడమటింటిలో నైరుతి మూల గోడకు చిన్న చతురస్రాకారంలో ఆకులు నలిపి పచ్చగా రుద్ది దానిమీద పసుపుబొట్లు పెట్టేవారు. ఇది పేరంటాలుకీ, పెద్దలకూ పెట్టుకొనే స్థలం. అదే ఇంటిలో వాయవ్య మూల దేవుళ్ల పటాలు ఉండేవి. చనిపోయిన వారికి బట్టలు పెట్టి, మూడు తరాల వారికి తర్పణాలు వదిలి, బేసి సంఖ్యలో అరటి విస్తర్లు వేసి, పలురకాల వంటలతో, అవిశాకు, గుమ్మడి పొరుటు తప్పనిసరిగా వడ్డించి, నైవేద్యం ఇచ్చి కొనియాడే పండగ ఈ పెద్దపండగ. పెద్దపండగ రోజు అన్నం కన్నా కూరలు ఎక్కువ తినాలన్న నమ్మకం ఉంది. రాత్రి మిగిలిన కూరలన్నింటిని రాత్రి కుంపటి మీద ఉంచి ఆ కలగూర మర్నాడు కూరగా వాడుకునేవారు. గొబ్బి తట్టుతూ పాడే పాటలతో (బాణీ, పాటల్లో కూడా బతుకమ్మ పాటలతో సామ్యం చూడవచ్చు) ఊరు సంగీతాత్మక లోకంగా మారిపొయ్యేది. గొబ్బిపాటలు పాడడానికి ఇదే చివరి రోజు.



మర్నాడు పశువుల పండగ. తెల్లవారు జామున పొద్దు మొలవడానికి ముందే తూర్పు దిక్కున పడమటి ముఖంగా కొత్త పొయ్యి పెట్టి మూడు పొంగళ్లు - పెద్ద పొంగలి, సూర్య పొంగలి, గొబ్బి పొంగలి - పెట్టేవారు. పొంగు వచ్చేటపుడు 'పచ్చా పొంగలి పాలా పొంగలి పొంగలో పొంగలి' అంటారు. తూర్పు లేదా ఉత్తరం వైపు పొంగితే మంచిదన్న నమ్మకం. తెల్లవారేటప్పటికి ఎద్దుల్ని కడిగి, కొమ్ములకు రంగులు పూసి నల్లేరు, తంగేడు ఆకులు పూలతో దండలు కట్టి అలంకరిస్తారు. ఆ రోజు దొడ్డిలోని పేడనంతా ఒక కువ్వగ పోసి దాని మీద నల్లేరు, తంగేడు వేసి సింగారిస్తారు. పెద్ద పొంగలిలోని అన్నాన్ని విస్తరిలో, పొంగిన నీటిని చెంబులో పేడ కువ్వ ముందర పెట్టి పూజిస్తారు. ఆ విస్తరిలోని అన్నంలో పసుపు కుంకుమ (ఒకప్పుడు పసుపు సున్నం) కల్పి దాన్ని ఇంటి పైన, దొడ్డిలో, ఇంకా పొలంలో కూడా 'పొలో పొలో' అంటూ పొలి చల్లుతారు. ఇంకొకరు పొంగటి నీటిని అదే సమయంలో 'పొంగలో పొంగలి' అంటూ అనుసరిస్తారు. సూర్యపొంగలి పెట్టి సూర్యుడికి నైవేద్యం, గొబ్బి పొంగటి కూడు పెట్టి గొబ్బెమ్మను పూజిస్తారు. గొబ్బెమ్మకు ఇది చివరి రోజు. నాలుగో రోజు గ్రామదేవతకు పొంగళ్లు పెడతారు. రాత్రి 'ఊరు మెరవణి' ఉంటుంది (ఇది కొన్ని ఊర్లలో మాత్రమే).

ఈ నెల మొత్తం పవిత్రం కనుక శుచీ శుభ్రతకు పెద్ద పీట. పండగకు ఇంటిల్లిపాదికీ, పెద్దలకూ, కొత్త అల్లుళ్లకు కూడా కొత్త బట్టలు. మొత్తం మీద ఈ నెల అంతా సంక్లిష్టంగా, భిన్న అంశాలతో కూడుకొని ఉంటుందని చెప్పవచ్చు.


ఇదే నెలలో ఉత్తర కేరళ ప్రాంతంలో 'ధనుర్మాసత్తిల్ తిరువాదిర ... తిరువాదిర' అంటూ ధనుర్మాసంలోని ఆరుద్ర నక్షత్రం రోజున తెల్లవారు జామునే నదికి వెళ్లి స్నానం చేసి ఉపవాసాలతో పూజలతో తమ భర్త చిరాయువుగా ఉండాలని కోరుకొంటూ ఆచరించే వ్రతం ఒకటి ఉంది. తెల్లవారు జామున చేసే స్నానం ఒక వారం ముందు నుంచే ప్రారంభిస్తారు. చాలా సాంగ్యాలున్నాయి. తిరువా దిర సమయంలో ప్రతి ఇంటిలోనూ ఉయ్యాలలు కట్టి ఊగడం కూడా ఒక ఆచారం. అలాగే కొంతమంది సర్ప కావు - పాముల పొదల్లకు కూడా పోతారు. ఆ రోజున తమ భర్త చిరాయువుగా ఉండాలని 108 తమలపాకుల తాంబూలం కూడా సేవిస్తారు.

ఆడి (ఆషాఢం) మాసంలో భార్యాభర్తలు కలిస్తే ఎండాకాలంలో, పండగ నెలలో కలిస్తే వర్షాకాలంలో ప్రసవం ఉండడానికి అవకాశం ఉంది. ఆ రెండు కాలాలు కూడా పుట్టిన బిడ్డకు - బహుశా వాతావరణ మార్పు వల్ల - మంచిది కాదన్న సందేశం పండగనెల పీడనెల అనీ, ధనుర్మాసం శూన్యమాసం అనీ, ఈ నెలలో ఏ పనీ చేయరాదని, ప్రతీకాత్మకంగా దానికి సంబంధించిన అంశాల్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రచారంలో పెట్టారని అనిపిస్తుంది.

వ్యాసకర్త జానపద విజ్ఞాన పరిశోధకులు
మొబైల్: 94401 70703

సంక్రాంతి సంబరం

సూర్యుడు నెలనెలా ఒక రాశి దాటి మరొక రాశిలోకి సంక్రమిస్తూనే ఉంటాడు. కానీ ఆయన మకరరాశిలో ప్రవేశించే సమయానికి ఉన్న ఆధ్యాత్మిక, భౌగోళిక, ఆర్థిక పరమైన ప్రాముఖ్యాలు మరే ఇతర సంక్రమణానికి వర్తించవు. మకరంలో ప్రవేశించిన సూర్యుడు ఆరు నెలల పాటు (జనవరి-జూలై) ఉత్తర దిశగా ప్రయాణం చేస్తాడు. ఆ ఉత్తరాయణంలో మనకు దగ్గరవుతాడు. చలి తగ్గి, వెచ్చదనం క్రమంగా పెరుగుతుంది. తరవాతి ఆరు నెలలు (జూలై-జనవరి) ఆయన దక్షిణంగా వెళతాడు. క్రమంగా మనకు వేడిమి తగ్గి చలి పెరిగిపోతుంది.



జ్యోతిర్మయం

ఆధ్యాత్మిక పరంగా కూడా ఉత్తరాయణం పుణ్య కాలం. ఉత్తరాయణంలో శరీరం త్యజించిన బ్రహ్మవేత్తలు అర్చిరాది మార్గాన ప్రయాణించి బ్రహ్మ సాయుజ్యం పొందగలరని భగవద్గీత చెప్తుంది. ఇక ఆర్థిక పరంగా చూస్తే, మకర సంక్రాంతి కాలానికి మన ప్రాంతాల కర్షకులకు ధాన్య సంపద చేతికందుతుంది. ప్రజలు కొంత తృప్తిగా ఉంటారు. గ్రామాలు, ముఖ్యంగా సంపన్నగ్రామాలు కళకళలాడుతూ ఉంటాయి. ఆర్థిక పుష్టి ఉన్నప్పుడు సాంస్కృతిక సమృద్ధి కూడా సాధారణంగా అనుసరించి వస్తుంది.

సంక్రాంతి సమయం సాంప్రదాయికంగా సమకూరుస్తూ వస్తున్న కళకళలకు ముఖ్య కారణాలు మూడు. ఒకటి - దైవానుగ్రహం వల్ల కలిగిన వర్షపాతం, శీతోష్ణస్థితుల ఆనుకూల్యం. రెండు - చెమటోడ్చిన కర్షకుల, కార్మికుల శ్రమశక్తి. మూడు - పశుగణం అందించిన సహకారం. అందుకే, మూడు రోజుల పెద్దపండగ జరిపి, కొంత సమయం దైవారాధనకూ, మరికొంత సమయం రైతన్నలూ, వాళ్ళ కుటుంబీకులు, సహాయకుల సరదాలకూ, ఉత్సాహోల్లాసాలకూ, మూడో రోజు పశువుల పండగకూ కేటాయించే సంప్రదాయం ఏర్పడినట్టు కనిపిస్తుంది.

ఇహమే కాక, పరం కూడా ఒకటి ఉన్నది కదా! డబ్బు చేత ఉన్నపుడూ, అంతో ఇంత దానధర్మాలు, అందునా పుణ్యకాలంలో చేస్తే, జన్మాంతరంలో కూడా మేలు. అందుకే, ధనం చాలకపోతే, కనీసం పెరట్లో కాసిన గుమ్మడి కాయన్నా(కూష్మాండం) దానం చేసే ఆనవాయితీ ఏర్పడింది. కాలగతిలో ఇతర ధనార్జన మార్గాలు సమకూరి, జాతీయాదాయంలో వ్యవసాయాదాయం పాలు ఎనభయి శాతం నుంచి పద్దెనిమిది శాతానికి పడిపోవడం వల్ల, పెద్ద పండగ ప్రభా, ప్రాభవం ఇప్పుడు నిస్సందేహంగా కొంత తగ్గింది. అయినా, హెచ్చు తగ్గులుండవచ్చేమో కానీ, మనిషికి పాడిపంటల అవసరం ఉన్నన్నాళ్లూ సంక్రాంతి పండగ ప్రాధాన్యం కొనసాగుతూనే ఉంటుంది. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

- ఎం. మారుతిశాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: శు.చవితి ఉ.9.59 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: శతభిషం ప.1.13 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: రా.7.10 నుండి 8.38 వరకు, దుర్ముహూర్తం: ప.12.32 నుండి 1.20 వరకు తదుపరి ప.2.47 నుండి 3.35 వరకు, అమృతఘడియలు: ఉ.6.31 నుండి 7.58 వరకు, మకర సంక్రాంతి.ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం: రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.40.

క్లుప్తంగా...

యాదాద్రిలో గోదాదేవి కల్యాణం



గోదాదేవి-శ్రీరంగనాథుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి పుణ్యక్షేత్రంలో ఆదివారం గోదాదేవి-శ్రీరంగనాథుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఈ పర్వాన్ని ప్రధానాలయంలోని పంచనారసింహుల సన్నిధిలో పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం జరిపించారు. ఆలయ ముఖ మండపంలో గోదాదేవి-శ్రీరంగనాథులను అధిష్టించి కల్యాణ వేడుకను వైభవంగా జరిపించారు.

అన్నారంలో సీపేజీకి మరమ్మతులు

- ప్రత్యేక కెమికల్‌తో గ్రౌటింగ్ పనులు



అన్నారం బ్యారేజీ 28వ పియర్ వద్ద కెమికల్‌తో గ్రౌటింగ్ చేస్తున్న సిబ్బంది

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నారం (సరస్వతి) బ్యారేజీలో ఏర్పడిన సీపేజీ లీకేజీ (బుంగలు)కి మరమ్మతులు జరుగుతున్నాయి. నిర్మాణ సంస్థ అఫ్కాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్ విభాగం, ప్రభుత్వ నీటి పారుదల శాఖల ఆధ్వర్యంలో.. బ్యారేజీ 5వ బ్లాక్‌లోని 28, 38 పియర్ల వద్ద డౌన్‌సీమ్‌లో ఏర్పడిన సీపేజీల వద్ద పాలీయూరేథీన్ (పీయూ) కెమికల్‌ను భూమిలోపలికి పంపి గ్రౌటింగ్ చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో సమస్యల నేపథ్యంలో గతనెల 29న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల బృందం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించిన విషయం తెలిసిందే. అప్పుడు ఈఎన్‌సీ మురళీధర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మేడిగడ్డ బ్యారేజీ కుంగిన తీరు, అన్నారంలో సీపేజీలను వివరించారు. ఈ సందర్భంగా అన్నారం బ్యారేజీ వద్ద మరమ్మతులు చేపట్టాలని మంత్రులు ఆదేశించారు. దీంతో బ్యారేజీ నిర్మాణ సంస్థ సీపేజీ మరమ్మతులు చేపట్టింది.

పతంగులు ఎగరేస్తూ మృత్యుఒడికి...

- విద్యుత్ షాక్‌తో భర్త మృతి... భార్యకు గాయాలు
- మరో ఘటనలో భవనం పైనుంచి పడి డిగ్రీ విద్యార్థి మృతి



నాగ సుబ్రహ్మణ్యం



ఆకాశ్

జోగిపేట (అందోల్)/ కుత్బుల్లాపూర్: గాలిపటాల సరదా రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. పతంగులు ఎగురవేస్తూ ఇస్నాపూర్‌లో ఓ వ్యక్తి మృతి చెందగా, కుత్బుల్లాపూర్‌లో జరిగిన మరో ఘటనలో విద్యార్థి మృతిచెందాడు. కృష్ణా జిల్లా కొరగంటిపాలెం గ్రామానికి చెందిన టి.నాగసుబ్రహ్మణ్యం (35) కుటుంబంతో ఇస్నాపూర్‌లో ఉంటున్నారు. సంక్రాంతి సందర్భంగా భార్య చాముండేశ్వరీదేవితో కలిసి అత్తగారిల్లయిన సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి వెళ్లారు. ఆదివారం ఉదయం మేడపై కుమారులతో కలిసి నాగసుబ్రహ్మణ్యం గాలిపటాలను ఎగురవేస్తున్నా రు. ఆ సమయంలో గాలిపటం ఎగురుతూ పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు చిక్కుకుంది. సుబ్రహ్మణ్యం గాలిపటం దారాన్ని గట్టిగా లాగడంతో విద్యుత్ తీగలు ఒక్క దగ్గరకు చేరి హై ఓల్టేజీతో కరెంట్ షాక్ కొట్టింది. పక్కనే ఉన్న చాముండేశ్వరికి సైతం షాక్ తగిలింది. చాముండేశ్వరీ అరుపులతో ఆమె అక్క భారతి వచ్చి ఆమెను లాగేయగానే కరెంట్ ఓల్టేజీ వేగానికి సుబ్రహ్మణ్యం మేడపై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలు కాగా, చాముండేశ్వరికి స్వల్పగాయాలు అయ్యాయి. వెంటనే వారిని సంగారెడ్డి ఆస్పత్రికి త రలిస్తుండగా మార్గమధ్యలోనే సుబ్రహ్మణ్యం మృతి చెందాడు.

యువకుడి మృతి..

అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న రాజశేఖర్ కుటుంబం కొంపల్లిలోని క్యాస్కేడ్ గ్రీన్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటోంది. డిగ్రీ చదువుతున్న రాజశేఖర్ చిన్న కుమారుడు ఆకాశ్ (20) ఆదివారం అపార్ట్‌మెంట్ ఐదవ అంతస్తులో స్నేహితులతో కలిసి గాలిపటం ఎగరేస్తున్నాడు. ఈ క్రమంలోనే చరఖా పైఅంతస్తులోని ప్లాస్టిక్‌షీట్‌పై పడింది. దాన్ని తీసే క్రమంలో ప్లాస్టిక్ షీట్‌పై కాలుపెట్టగా అది విరగడంతో ఆకాశ్ మొదటి అంతస్తులోని పెంకులపై పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు.

ఇంటికో ఇప్పమొక్క!

భద్రాచలం ఐటీడీఏ పరిధిలో వినూత్న ప్రయోగం

- పీఓ ప్రతీక్ చొరవతో ఆదివాసీ, గిరిజనులకు పంపిణీ
- 25వేలకు పైగా మొక్కలు ఇచ్చేలా ప్రణాళిక
- గిరిజనం ఆర్థిక స్వావలంబనకు యత్నాలు
- మరోవక్క లక్ష్యం మేర జీసీసీకి ఇప్పపూవు సేకరణ



ఒకప్పుడు భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఇప్పపూల సేకరణ జోరుగా సాగేది. ఏటా వందల క్వింటాళ్లు... ఒక్కో ఏడాది అంతకు మించి ఇప్పపూవు సేకరించే గిరిజనులు జీసీసీకి అమ్మి ఆర్థికంగా ఎంతోకొంత లబ్ధి పొందేవారు. తద్వారా వారికి ఉపాధి లభించడమే కాక ఆ పూవును మరింత శుద్ధి చేసి అమ్ముతూ జీసీసీ సైతం ఆదాయం గడించేది. కానీ రానురాను రకరకాల కారణాలతో ఇప్ప పూల సేకరణ తగ్గిపోయి అటు గిరిజనులు, ఇటు జీసీసీ ఆదాయానికి గండి పడుతోంది. ఈ నేపథ్యంలో మళ్లీ సేకరణను గాడిలో పడేసేలా రాష్ట్రంలోనే ప్రత్యేకంగా భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ చొరవ తీసుకుని అడుగులు వేస్తున్నారు.

– సాక్షి, ఖమ్మం డెస్క్

25వేలకు పైగా మొక్కలు

పునర్విభజనతో భద్రాచలానికి సమీపాన ఉన్న చిక్కని అటవీ ప్రాంతం ఏపీ పరిధిలోకి వెళ్లింది. దీంతో అక్కడి గిరిజనులు ఇప్పపూవు సేకరించి పాడేరు ఐటీడీఏ పరిధి జీసీసీకి అమ్ముతున్నారు. ఇదేకాక పోడు సాగుతో ఇప్ప చెట్ల సంఖ్య నానాటికీ తగ్గుతోంది. ఆదేవిధంగా భద్రాచలం జీసీసీకి గిరిజనులు ఇస్తున్న ఇప్పపూవు పరిమాణమూ తగ్గుతోంది. ఇక ఇప్పపూవు సేకరణ, శుద్ధి, అమ్మితే సమకూరే ఆదాయంపై ఆదివాసీ, గిరిజనులకు అవగాహన కల్పించే వారు కరువయ్యారు. ఏడాది క్రితం భద్రాచలం ఏటీడీఏ పీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్‌జైన్ గిరిజనుల ఉపాధి అవకాశాలు మెరుగపడేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జీసీసీ ఆధ్వర్యాన సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులపై ఆరా తీయగా ఇప్పపూవు విషయంలో హెచ్చుతగ్గులు గుర్తించి మళ్లీ గాడిన పడేయాలని రంగంలోకి దిగారు.

అడవి లేక.. చెట్లు కానరాక



'ఇంటికో ఇప్పమొక్క'లో భాగంగా మొక్క అందజేస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

ఇప్పపూవు సేకరణ పెరగాలంటే అదే సంఖ్యలో మొక్కలు ఉండాలి. అందుకోసం అటవీ శాఖ నుంచి 25వేలకు పైగా మొక్కలు సేకరించిన పీఓ.. ప్రతీ గిరిజన కుటుంబానికి ఒక్కో మొక్క పంపిణీ చేయడం ప్రారంభించారు. అయితే, ఈ మొక్కలు ఉచితంగానే ఇవ్వాలని తొలుత భావించినా.. అలా చేస్తే నాటడం, సంరక్షణపై శ్రద్ధ చూపరనే ఆలోచనతో నామమాత్రపు ధర నిర్ణయించారు. 'ఇంటికో ఇప్పమొక్క' పేరిట ఆరంభించిన ఈ కార్యక్రమంతో మంచి ఫలితాలు వచ్చేలా స్వయంగా పీఓ సైతం ఐటీడీఏ కార్యాలయంలో మొక్క నాటారు. ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చి ఇప్పమొక్కలు వనాలైతే పూల సేకరణ ద్వారా గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించడమే కాక జీసీసీకి సైతం ఆదాయం పెరగనుందని చెబుతున్నారు.

గత ఏడాది 327 క్వింటాళ్లు

భద్రాచలం జీసీసీ పరిధిలో ఆరు సబ్ బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటి ద్వారా గడిచిన ఆర్థిక సంవత్సరం(2022–23)లో 327 క్వింటాళ్ల ఇప్పపూవు సేకరించారు. అయితే, పదేళ్ల క్రితం వందలు దాటి వేల క్వింటాళ్లు సేకరించిన దాఖలాలూ ఉన్నాయి. ఇప్పపూవు నాణ్యత ఆధారంగా కేజీకి రూ.30 నుంచి రూ.35 చొప్పున జీసీసీ నుంచి గిరిజనులకు చెల్లిస్తారు. ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఇల్లెందు, కరకగూడెం నుంచి ఎక్కువగా ఇప్పపూవు తీసుకొస్తున్నారని జీసీసీ అధికారులు చెబుతున్నారు.

ఏం చేస్తారంటే?

జీసీసీ ద్వారా సేకరించిన ఇప్పపూవును మరింత శుద్ధి చేస్తారు. దీన్ని ఎక్కువగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వ్యాపారులు లేదా అక్కడి ప్రజలు నేరుగా కొనుగోలు చేస్తారు. వీరు ఇప్పపూలతో గారెలు, లడ్డూలు, ఇతర వంటకాలు చేసుకుంటారు. మరోపక్క అనధికారికంగా ఇప్పపూలతో సారా కాచి తాగడం ఆదివాసీల్లో ఏళ్ల నుంచి ఆచారంగా కొనసాగుతోంది.

పర్ణశాలలో అమ్మకం

శ్రీసీతారామచంద్రస్వామి వన వాసానికి వచ్చినప్పుడు భద్రాచలం సమీపాన దుమ్ముగూడెం మండలం పర్ణశాలకు వచ్చినట్లు పురాణాల్లో ఉంది. సీతారాములు వనవాసానికి వచ్చినప్పుడు అన్ని అటవీ ఫలాలతో పాటు ఇప్పపూవు తీసుకున్నారని భక్తులకు నమ్మకంగా చెప్పే చిరువ్యాపారులు పర్ణశాల వద్ద ఇప్పపూలను కుప్పలుగా పోసి అమ్మడం కనిపిస్తుంది. కానీ దీనికి ఎలాంటి చారిత్రక, పురాణ ఆధారాలు లేవని అర్చకులు చెబుతారు. అయినప్పటికీ పర్ణశాల, భద్రాచలం వచ్చిన భక్తులు ఎంతో కొంత ఇప్పపూవు కొనుగోలు చేసి తీసుకెళ్లడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

ఎమ్మెల్సీలు @ సస్పెన్స్

▶ మొదటి పేజీ తరువాయి

అధ్యక్షుడిగా ఉన్న ఆయన అభ్యర్థిత్వానికి గవర్నర్ ఆమోదం విషయంలో ఇబ్బంది రావొచ్చనే చర్చ జరిగినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా కోదండరాంకు అవకాశం దక్కుతుందని అంటున్నారు. వీలుంటే ఇప్పుడు లేదంటే మరోమారు ఎమ్మెల్యే కోటాలో ఆయనను మండలికి పంపుతారని.. సాంకేతిక సమస్యలను అధిగమించగలిగితే గవర్నర్ కోటాలోనే సిఫార్సు చేయవచ్చని తెలిసింది. మరోవైపు గవర్నర్ కోటాలో మైనార్టీలకు అవకాశం కల్పించే అంశాన్ని కాంగ్రెస్ పరిశీలిస్తోంది. ఈ కోటా కింద హైదరాబాద్ కేంద్రంగా విద్యాసంస్థలను నిర్వహిస్తున్న జాఫర్ జావేద్, సియాసత్ పత్రిక ఎడిటర్ జాహెద్ అలీఖాన్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే గతంలో తనకు వచ్చిన రాజ్యసభ అవకాశాన్ని జాహెద్ అలీ ఖాన్ తిరస్కరించిన నేపథ్యంలో.. ఆయన కుమారు డు అమేర్‌అలీఖాన్‌ను ఎంపిక చేయవచ్చని అంటున్నారు.

ఆ రెండు దాదాపు ఖరారేనా?

మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి పేరు దాదాపు ఖరారు చేయగా.. నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ అభ్యర్థిగా గత ఎన్నికల్లో ఓటమి పాలైన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. అయితే ప్రస్తుతానికి రెండు ఎమ్మెల్యే కోటా పేర్లను మాత్రమే ప్రకటిస్తారని, సమయాన్ని బట్టి మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను అధికారికంగా ప్రకటిస్తారని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి.

నామినేటెడ్ పదవుల టెన్షన్

రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సంక్రాంతికి ముందే ఈ పోస్టులను భర్తీ చేస్తారని గతంలో చర్చ జరిగినా కసరత్తు ఓ కొలిక్కి రాలేదు. తొలిదశలో పది వరకు కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను ప్రకటిస్తారని భావించారు. తర్వాత ఈ సంఖ్య 18కి చేరింది. ఈ క్రమంలో తొలిదఫాలో 9 లేదా 18 కార్పొరేషన్ల పదవులను ఈ నెల 20 తర్వాత ప్రకటిస్తారని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. ఇందులో పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. సామాజిక కోణంలోనూ సరిపడేలా ఎస్సీ సెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, టీపీసీసీ ఫిషర్ మెన్ సెల్ చైర్మన్ మెట్టుసాయికుమార్‌లకు తొలిదఫాలోనే అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది. అయితే ఎవరికి, ఏ కార్పొరేషన్ ఇస్తారన్న అంశం బయటికి రాకుండా కాంగ్రెస్ పార్టీ జాగ్రత్తలు తీసుకుంటోంది. మహిళల కోటా కింద తొలిదఫాలో మాజీ మంత్రి పుష్పలీలకు అవకాశం రావొచ్చని, ఆమెను మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమించవచ్చని గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. నామినేటెడ్ పోస్టుల జాబితా ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి చేరిందని అంటున్నాయి.

పాతపంటల జాతర ఆరంభం

- ఎడ్లబండ్లలో చిరుధాన్యాల ప్రదర్శన
- జాడిమల్కాపూర్‌కు తరలివచ్చిన మహిళారైతులు



జహీరాబాద్: చిరుధాన్యాల అవసరం, వాటి ప్రాధాన్యతను చాటిచెప్పే పాతపంటల జాతర ఆదివారం సంగారెడ్డి జిల్లాలో కనువిందు చేసింది. మొగుడంపల్లి మండలం జాడిమల్కాపూర్‌లో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) ఈ ఉత్సవాలను ప్రారంభించింది. జ్యోతి వెలిగించి ఎడ్లబండ్ల ఊరేగింపు తీశారు. ఎనిమిది ఎడ్లబండ్లలో చిరుధాన్యాలను తెచ్చి జాతరలో ప్రదర్శించారు. ఊరేగింపులో మహిళారైతులు చిరు ధాన్యాలతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నెలరోజులపాటు జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లోని 23 గ్రామాల్లో ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహిస్తూ ఉత్సవాలను కొనసాగిస్తారు. జాతర సందర్భంగా జీవవైవిధ్య సంరక్షకులను సత్కరించారు. వారి కృషిని డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ వినోద్ పావురాల, సోషియాలజీ ప్రొఫెసర్ అపర్ణ రాయప్రోలు, కమ్యూనికేషన్ డీన్ ప్రొఫెసర్ వాసుకి బేలవాడి, యునెస్కో కమ్యూనిటీ మీడియా ప్రతినిధి కంచన్ మాలిక్, డీడీఎస్ డైరెక్టర్ రుక్మిణీరావు, సర్పంచ్ ఎస్.పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన చైనా మాంజా!

- మాంజా గొంతుకు చుట్టుకోవడంతో ఆర్మీ అధికారికి తీవ్రగాయం
- లంగర్‌హౌస్ ఫ్లైఓవర్ మీదుగా వెళ్తుండగా ఘటన
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో కన్నుమూత



కోటేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/లంగర్‌హౌస్: హైదరాబాద్‌కు అక్రమంగా దిగుమతి అయిన చైనా మాంజా ఓ ఆర్మీ అధికారి ప్రాణం తీసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా పెదవాల్తేరుకు చెందిన కాగితాల కోటేశ్వర్‌రెడ్డి ఆర్మీలో నాయక్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం లంగర్‌హౌస్‌లో ఉన్న మిలటరీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్నారు. భార్య ప్రత్యూష, రెండేళ్ల కుమార్తెతో కలిసి బాపునగర్‌లో నివసిస్తున్నారు. విధులకు హాజరయ్యేందుకు శనివారం ద్విచక్ర వాహనంపై బాపునగర్ నుంచి లంగర్‌హౌస్ వైపు వస్తున్నారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో లంగర్‌హౌస్ ఫ్లైఓవర్‌పై ప్రయాణిస్తున్న ఆయన మెడకు ఎగురుకుంటూ వచ్చిన పతంగికు కట్టిఉన్న చైనా మాంజా చుట్టుకుంది. ఆయన అప్రమత్తమయ్యేలోపే మాంజా గొంతుకు బిగుసుకుని కోసుకుపోయింది. దీంతో గొంతుపై తీవ్రగాయమై కోటేశ్వర్‌రెడ్డి వాహనంపైనుంచి కింద పడిపోయారు. రక్తం మడుగులో పడి ఉన్న అయన్ను గుర్తించిన స్థానికులు చికిత్స కోసం ఆయన పనిచేసే మిలటరీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు రెండు గంటలపాటు శ్రమించినా ఫలితం దక్కలేదు. కోటేశ్వర్‌రెడ్డి చికిత్స పొందుతూ శనివారం రాత్రి 9.30 సమయంలో కన్నుమూశారు. కేసు నమోదు చేసుకున్న లంగర్‌హౌస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

కట్టడి చేసినా.. విచ్చలవిడిగా...

మనుషులతో పాటు పక్షులు, ఇతర ప్రాణులకు ముప్పు కలిగించే చైనా మాంజాను కట్టడి చేయాలని నగర పోలీసులు గత నెల నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. మాంజా రవాణా, నిల్వ, విక్రయంపై నిఘా ఉంచి అనేక కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ ధనార్జనే ధ్యేయంగా అనేక మంది వ్యాపారులు చైనా మాంజాను అక్రమంగా తీసుకువచ్చి విక్రయించారు. శని, ఆదివారాల్లో ఈ మాంజా ప్రభావం నగరవ్యాప్తంగా కనిపించింది. అనేక మంది వాహనచోదకులు దీని బారినపడి గాయపడ్డారు. రాజధానిలోని అనేక ప్రాంతాల్లో పక్షులు ఈ మాంజా కారణంగా తీవ్రంగా గాయపడటం, చనిపోవడం కనిపించింది. నగరంలోని దాదాపు అన్ని ఫ్లైఓవర్లు 'డేంజర్ జోన్లు'గా మారాయి. మాంజా కారణంగా వాహనాలు సడన్‌గా వేగాన్ని తగ్గించడం .. వెనుక వచ్చే వాహనాలు ఢీకొట్టడంతో పలుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

బస్సులోంచి రూ.13 లక్షలు చోరీ

- నిజామాబాద్ శివారులో ఘటన

ఖలీల్‌వాడి(నిజామాబాద్): నిజామాబాద్ నగర శివారులో ఓ ప్రైవేట్ బస్సులోంచి రూ.13 లక్షల నగదు మాయమైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శనివార ఉదయం 6 గంటలకు ఓ ప్రైవేట్ బస్సు ముంబై నుంచి జగిత్యాల వెళ్తుండగా నిజామాబాద్ శివారులోని సారంగపూర్ డైరీఫాం వద్ద డ్రైవర్ చాయ్ కోసం బస్సు ఆపారు. బస్సులో ఉన్న హన్మంతు అనే వ్యక్తి రూ.13 లక్షలు తీసుకొని జగిత్యాలకు వెళ్తున్నారు. సారంగాపూర్ డైరీఫాం వద్ద బస్సు ఆగగానే హన్మంతు డబ్బులున్న బ్యాగ్‌ను అందులోనే ఉంచి టీ కోసం కిందికి దిగారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఆ బ్యాగ్‌ను అపహరించారు. అనంతరం గుర్తించిన బాధితుడు ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి బస్సులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాకు చేయి అడ్డుపెట్టి చోరీకి పాల్పడ్డట్లు రికార్డైంది. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా పోలీసులు దుండగుల కోసం గాలిస్తున్నారు. బస్సులో ప్రయాణించే వ్యక్తులే చోరీకి పాల్పడ్డారా.. లేక బయటివ్యక్తులు వచ్చారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

యాదాద్రిపై సంక్రాంతి ముద్ర

- కిటకిటలాడిన ఆలయం

యాదగిరిగుట్ట: సంక్రాంతి సెలవులతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తుల రాక పెరిగింది. ఆదివారం భోగి పండుగ కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు అధికంగా యాదాద్రీశుడిని దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు. దీంతో శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, క్యూకాంప్లెక్స్, బస్టాండ్లు భక్తులతో నిండుగా కనిపించాయి. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.45,52,569 వచ్చినట్లు అధికారులు తెలిపారు. శ్రీస్వామి వారిని 45వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు.



ప్రధానాలయంలో భక్తుల రద్దీ

భూ సమస్యలపై అధ్యయనం

- పైలెట్ ప్రాజెక్టుగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలం ఎంపిక
- 18న మంతన్‌గౌరెల్లిలో రైతుల సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ
- లీఫ్స్ సంస్థ సహకారంతో భూ న్యాయ శిబిరాలు



ఫిర్యాదు నమూనా ప్రతులను ఆవిష్కరిస్తున్న కోదండరెడ్డి, సునీల్‌కుమార్ తదితరులు

యాచారం: తెలంగాణలో భూ సమస్యల అధ్యయనానికి లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) సంస్థ రంగారెడ్డి జిల్లా యాచారం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. లీఫ్స్ సంస్థ ద్వారా భూ న్యాయ శిబిరాలతో అనేక భూ సమస్యలు పరిష్కరించిన ప్రముఖ న్యాయవాది, ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సభ్యుడు భూమి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో యాచారం మండలంలోని 24 గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నారు.

18 నుంచి శిబిరాలు

ఈ నెల 18న మంతన్‌గౌరెల్లిలో మొదటగా భూ న్యాయ శిబిరం నిర్వహించనున్నారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను ఫిర్యాదుల రూపంలో స్వీకరిస్తారు. మిగతా 23 గ్రామాల్లో ఈ నెల 20న శిబిరాలు ప్రారంభించి, అన్ని గ్రామాల్లో 10 నుంచి 15 రోజుల పాటు దండోరా వేయించి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు. రైతులు ఏయే సమస్యలపై ఫిర్యాదు చేశారు, సమస్యల పరిష్కారం కోసం ఏ విధంగా కృషి చేయాలనే విషయంపై లీఫ్స్ సంస్థ ధరణి పోర్టల్ పునర్నిర్మాణ కమిటీ సభ్యులకు నివేదిక అందజేస్తుంది.

కమిటీ సభ్యుల భేటీ

యాచారం మండల కేంద్రంలో ఆదివారం ధరణి పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ముదిరెడ్డి కోదండరెడ్డి, సునీల్‌కుమార్, సీసీఎల్‌ఏ ధరణి ప్రాజెక్టు డైరెక్టర్ వి.లచ్చిరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూ న్యాయ శిబిరాల్లో రైతులు తమ సమస్యలను నమోదు చేసే నమూనా ప్రతిని ఆవిష్కరించారు. అనంతరం అందులో సమస్యలను వివరించే పద్ధతిపై సునీల్‌కుమార్ రైతులకు వివరించారు. రాష్ట్రంలో భూ సమస్యలు లేని గ్రామాలే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 'భూ సమస్య మీది.. పరిష్కార మార్గం సూచించే బాధ్యత మాది'అంటూ రైతులకు భరోసా కల్పించారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు భవిష్యత్తులో భూ సమస్యలు లేకుండా చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. భూ న్యాయ శిబిరాల ద్వారా రైతుల సమస్యలు గుర్తించి ఆ దిశగా ప్రభుత్వం వారికి మేలు చేసేలా కృషి చేస్తామన్నారు. కోదండరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో భూ సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

అదుపుతప్పి.. పల్టీకొట్టి

- కారు ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తుండగా ప్రమాదం
- ఒకరు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- బాధితులంతా మైనర్లు
- హుస్నాబాద్ పట్టణం వద్ద ఘటన



ప్రమాదానికి గురైన కారు



యశ్వంత్

హుస్నాబాద్: పండుగ పూట సంతోషంగా గడపాల్సిన ఆ ఇళ్లల్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. భోగి రోజు దైవ దర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా కారు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందగా, మరో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. హుస్నాబాద్ పట్ట ణానికి చెందిన ఎగ్గోజు యశ్వంత్ (17), నారోజు వెంకటేశ్ (16), ఎగ్గోజు అఖిల్ (17), కేమసాగరం అజయ్ (17) స్నేహితులు. అందరూ వేర్వేరు కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నా రు. ఇందులో ఎగ్గోజు యశ్వంత్‌కు చెందిన కారులో వీరంతా ఆదివారం ఉదయం భోగి పండుగ సందర్భంగా ఆలయాల్లో దైవ దర్శనం చేసుకోవడానికి బయలుదేరారు. కారును యశ్వంత్ నడుపుతున్నా డు. ముందుగా పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వర స్వా మి దేవాలయానికి వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి చిగురుమామిడి మండలం సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లి పూజలు చేశారు. అనంతరం హుస్నాబాద్‌కు బయలు దేరారు. మధ్యా హ్నం ఒంటిగంట ప్రాంతంలో హుస్నాబాద్ పట్ట ణం శివారులోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద కారు ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణం చేస్తున్న నలుగురు మైనర్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో వాహనం వచ్చేలోపే యశ్వంత్ మృతి చెందాడు. అతడిని పోస్టుమా ర్టం నిమిత్తం హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు. అతని మరణ వార్త విన్న కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. క్షతగాత్రులకు అదే ఆస్ప త్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, కారు ఢీ.. నలుగురి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- పుట్టువెంట్రుకలు తీసేందుకు గుడికి వెళ్లి వస్తూ మృత్యువాత
- మృతులందరిదీ ఒకే కుటుంబం
- మహబూబాబాద్ జమాండ్లపల్లి అర్బన్ పార్క్ సమీపంలో ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

మహబూబాబాద్ రూరల్: కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కుమారుడి పుట్టువెంట్రుకలు తీసేందుకు గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లి అటవీశాఖ అర్బన్ పార్క్ సమీపాన ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మహబూబాబాద్ అదనపు సీఐ బి.రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చిన్న ఎల్లాపురం గ్రామశివారు హేముతండాకు చెందిన ఇస్లావత్ శ్రీను(35), అతడి కుమారుడు రిత్విక్(6), కుమార్తె రిత్విక(5), శ్రీను తల్లి పాపా(60), బంధువులు శాంతి, సర్దార్ కలిసి శనివారం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ సమీపంలోని గుండ్ల సింగారం వద్దనున్న బుడియాబాపు గుడికి వెళ్లారు. ఆదివారం ఉదయం అక్కడ రిత్విక్ పుట్టువెంట్రుకలు సమర్పించిన తర్వాత సాయంత్రం పొద్దుపోయాక ఆటోలో తిరిగి హేముతండాకు బయలు దేరారు. జమాండ్లపల్లి అటవీశాఖ అర్బన్‌పార్కు దాటుతున్న ఆటో, ఎదురుగా గూడూరు మండలం గుంజేడు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పాపా, శ్రీను, రిత్విక్, రిత్విక మృతి చెందారు. సర్దార్, శాంతికి తీవ్రగాయాలయ్యాయి. కారులో మల్యాల పీహెచ్‌సీ వైద్యుడు తిరుపతి, ప్రవీణ్, భరత్, ప్రతాప్, వసంత్ ఉన్నారు. టౌన్ ఎస్సైలు రామారావు, శివ, రూరల్ రెండో ఎస్సై కుమారస్వామి, పోలీసు సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా...

స్వతంత్ర తైవాన్‌కు మద్దతివ్వం: బైడెన్

వాషింగ్టన్: తైవాన్ స్వాతంత్య్రానికి అమెరికా మద్దతు ఇవ్వదని అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టం చేశారు. ఇటీవలి ఎన్నికల్లో స్వతంత్ర తైవాన్ విధానాన్ని సమర్థించే డెమోక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీకి అక్కడి ప్రజలు అధికారం కట్టబెట్టిన విషయం తెలిసిందే. తైవాన్ ఎన్నికల ఫలితాలపై జో బైడెన్ స్పందించారు. అమెరికా ప్రభుత్వం తైవాన్ స్థానంలో చైనాకు 1979 నుంచి దౌత్యపరమైన గుర్తింపునిచ్చింది. తైవాన్ స్వాతంత్య్ర ప్రకటనకు మద్దతివ్వబోమని అప్పటి నుంచి అధికారికంగా చెబుతూ వస్తోంది. అనధికారికంగా గట్టి మద్దతుదారుగా ఉంటూ తైవాన్‌తో సంబంధాలను కొనసాగిస్తోంది. అవసరమైతే బలప్రయోగం జరిపైనా తైవాన్‌ను కలిపేసుకుంటామంటూ చైనా పలుమార్లు స్పష్టం చేసింది. అయితే, తాజాగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న లాయ్ తైవాన్‌ను రిపబ్లిక్‌గా ప్రకటించే అవకాశాలున్నాయంటున్నారు. ఆయన మాత్రం అలాంటి దేమీ లేదని కొట్టిపారేస్తున్నారు. లాయ్ ఎన్నిక నేపథ్యంలో బీజింగ్‌తో సంబంధాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలున్నట్లు అమెరికా ఆందోళన చెందుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో బైడెన్ తాజా వ్యాఖ్యలు చైనాకు భరోసా ఇచ్చేందుకు చేసిన ప్రయత్నంగా పరిశీలకులు భావిస్తున్నారు.

బీజేపీ ఎంపీ హెగ్డేపై విద్వేష వ్యాఖ్యల కేసు

బెంగళూరు: బాబ్రీ మసీదు మాదిరిగానే భట్కల్ మసీదు కూడా ధ్వంసమవుతుందంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఉత్తర కన్నడ బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డేపై కర్ణాటక పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. విద్వేష ప్రసంగం, జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారంటూ ఆయనపై కేసు నమోదు చేసినట్లు కర్వార్ ఎస్పీ విష్ణువర్ధన్ చెప్పారు. దర్యాప్తు జరుపుతున్నామన్నారు. 1992లో కరసేవకులు బాబ్రీ మసీదును ధ్వంసం చేసినట్లుగానే భట్కల్ మసీదు కూడా ధ్వంసం అవడం ఖాయమని ఉత్తర కన్నడ జిల్లాలో శనివారం ఒక కార్యక్రమంలో హెగ్డే అన్నారు. ఇది హిందూ సమాజం నిర్ణయమన్నారు.

కోవిడ్ కొత్త కేసులు 375

న్యూఢిల్లీ: దేశంలో 24 గంటల వ్యవధిలో కొత్తగా 375 కోవిడ్ కేసులు బయటపడినట్లు ఆదివారం కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. అదే సమయంలో, యాక్టివ్ కేసుల సంఖ్య 3,075కు తగ్గినట్లు పేర్కొంది. కర్ణాటకలో కోవిడ్ బాధితులు ఇద్దరు చనిపోయారని తెలిపింది. జేఎన్.1 సబ్ వేరియంట్ వల్లే కేసుల్లో పెరుగుదల కనిపిస్తున్నట్లు తెలిపింది.

'ఏక్ భారత్...'కు ప్రతిబింబం పొంగల్: మోదీ


పొంగల్ సందర్భంగా ఆదివారం ఢిల్లీలో మోదీ పూజలు

పొంగల్ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని

చెన్నై/ఢిల్లీ: జాతీయ స్ఫూర్తి అయిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌కు పొంగల్ పర్వదినం ప్రతిరూపమని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ ఇంట్లో పొంగల్ వేడుకకు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడారు. '' తమిళనాడు ప్రజలకు పొంగల్ పర్వదిన శుభాకాంక్షలు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తికి పొంగల్ ప్రతిబింబం. ఇదే భావన కాశీ-తమిళ్, సౌరాష్ట్ర-తమిళ్ సంగమం సంస్కృతిలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. బియ్యం పిండితో వేసే కోలమ్ రంగవల్లికలు దేశంలోని భిన్న ప్రాంతాల మధ్య ఉన్న భావోద్వేగాలను కలుపుతున్నాయి. దేశం సత్తా ఇలా కొత్త తరహాలో గోచరిస్తోంది. ఇలాంటి ఐక్యతా భావనే 2047కల్లా వికసిత భారత్ నిర్మాణానికి అతిపెద్ద చోదకశక్తిలా పనిచేస్తోంది. ఎర్ర కోట మీద నుంచి నేను ప్రబోధించిన పంచప్రాణాల్లో ముఖ్యమైనది ఇదే. దేశ ఐక్యతను మరింత శక్తివంతం చేయండి, తద్వారా ఐక్యతను మరింత బలోపేతం చేయండి. తమిళ కవి తిరువళ్లువర్ ప్రవచించినట్లుగా జాతి నిర్మాణంలో విద్యావంతులైన పౌరులు, నిజాయతీ గల వ్యాపారులు, మంచి పంటలది కీలక భూమిక'' అని మోదీ వ్యాఖ్యానించారు. '' కొత్త పంటను దైవానికి నైవేద్యంగా వండి రైతన్నలు అన్నదాతలుగా మారే చక్కటి శుభ సమయమే పొంగల్ పర్వదినం. దేశంలోని ప్రతి పండుగలో పల్లెపట్టులు, పంటలు, రైతులతో ముడిపడి ఉంటాయి'' అన్నారు. ''తమిళ సాంప్రదాయాలకు తృణధాన్యాలకు అవినాభావ సంబంధం ఉంది. పౌష్టిక శ్రీ అన్న(తృణధాన్యం) గురించి యువతలో కొత్త అవగాహన ఏర్పడింది. దీంతో మిల్లెట్స్ రంగంలో అంకుర సంస్థల స్థాపనకూ యువత ముందుకొస్తోంది. మూడు కోట్లకుపైగా రైతులు తృణధాన్యాలను పండించి చక్కని దిగుబడి ద్వారా లబ్ధి పొందుతున్నారు. పొంగల్ సందర్భంగా దేశ సమైక్యత కోసం కొత్త తీర్మానాలు చేసుకుని దేశం కోసం పునరంకితమవుదాం'' అని మోదీ పిలుపునిచ్చారు.


మకర సంక్రాంతి సందర్భంగా ఆదివారం అహ్మదాబాద్‌లో పతంగి ఎగరేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

అన్యాయాన్ని ప్రశ్నించేందుకే...

భారత్ జోడో న్యాయ్ యాత్రపై రాహుల్ | మణిపూర్ నుంచి శ్రీకారం

- మణిపూరీల కన్నీళ్లు తుడిచేందుకు మోదీ రాకపోవడం సిగ్గుచేటు
- ప్రధానిపై రాహుల్ మండిపాటు
- రాష్ట్రానికి శాంతి, సామరస్యం తెస్తాం




ఆదివారం మణిపూర్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభం సందర్భంగా రాహుల్ గాంధీ. యాత్రకు తరలివచ్చిన అభిమానులు

థౌబాల్/ఇంఫాల్: జాతుల ఘర్షణలతో అట్టుడికిపోతున్న కల్లోల మణిపూర్ రాష్ట్రానికి శాంతి, సామరస్యం తిరిగి తీసుకొస్తామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. మణిపూర్‌లోని థౌబాల్ నుంచి 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'కు ఆదివారం ఆయన శ్రీకారం చుట్టారు. తొలుత ఖోంగ్‌జామ్ యుద్ధ స్మారకం వద్ద నివాళులర్పించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. ఘర్షణలతో రాష్ట్రంలో లక్షలాది మంది అమాయకులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కన్నీళ్లు తుడిచేందుకు, చేయూతనిచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికీ రాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మోదీ, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దృష్టిలో మణిపూర్ రాష్ట్రం భారతదేశంలో అంతర్భాగం కాకపోవచ్చని ఆక్షేపించారు. ''మీ బాధను వారి బాధగా భావించడం లేదు. కానీ మీ దుఃఖాన్ని, మీకు తగిలిన గాయాలు, మీరెదుర్కొంటున్న విచారాన్ని మేం అర్థం చేసుకున్నాం'' అని చెప్పారు. బాధితులు ఆప్యాయతను కోరుకుంటున్నారని రాహుల్ అన్నారు.

ప్రజల 'మన్ కీ బాత్' వింటాం

దేశంలో అన్యాయ కాలం కొనసాగుతున్నందు వల్లే న్యాయ యాత్ర చేపట్టాల్సి వచ్చిందని రాహుల్ పేర్కొన్నారు. ప్రజలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్యాయాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలను ఏకం చేయాలన్నదే ఈ యాత్ర ఉద్దేశమని వివరించారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, సామరస్యంతో కూడిన 'న్యూ విజన్ ఆఫ్ ఇండియా'ను సాధించడం ధ్యేయమని స్పష్టం చేశారు. ''ఈ యాత్రలో ప్రజల 'మన్ కీ బాత్' వింటాం. ప్రజలను నేరుగా కలుసుకొని, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటాం'' అని వెల్లడించారు. బీజేపీ క్షుద్ర రాజకీయాల వల్ల మణిపూర్‌లో శాంతి, సామరస్యం కనుమరుగు అయ్యాయని రాహుల్ ధ్వజమెత్తారు. సమాజంలో విద్వేషం, హింస, అరాచకత్వానికి స్థానం ఉండకూడదని చెప్పారు. దేశ సంపద కొందరి జేబుల్లోకి వెళ్తోందని రాహుల్ ఆరోపించారు. ఒకరిద్దరు వ్యాపారవేత్తలు మొత్తం ఆర్థిక వ్యవస్థపై గుత్తాధిపత్యం సాధిస్తున్నారని మండిపడ్డారు. అన్ని వ్యాపారాల్లోకి వారు ప్రవేశిస్తున్నారని, ఫలితంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాలు మూతపడుతున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని గుర్తుచేశారు. దేశ జనాభాలో అధిక భాగం ఉన్న కింది కులాలు, దళితులు, గిరిజనులకు రాజకీయ వ్యవస్థలో, ప్రభుత్వ పాలనా వ్యవస్థలో భాగస్వామ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలన్నింటినీ యాత్రలో లేవనెత్తుతామని తెలిపారు.

రాహుల్ యాత్రలో బీఎస్పీ బహిష్కృత ఎంపీ డానిష్ అలీ

ఇటీవల బీఎస్పీ నుంచి బహిష్కరణకు గురైన లోక్‌సభ సభ్యుడు డానిష్ అలీ రాహుల్‌తో పాటు యాత్రలో పాల్గొన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరతారని తెలుస్తోంది. రాహుల్ యాత్రపై మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ మండిపడ్డారు. ''రాష్ట్రంలో ఘర్షణలింకా ఆగలేదు. ఇలాంటప్పుడు యాత్ర పేరుతో పరిస్థితిని దిగజార్చడానికి వచ్చారా?'' అంటూ మండిపడ్డారు.

రాజకీయ లబ్ధికి మతాన్ని వాడుతున్నారు

ప్రధాని మోదీపై ఖర్గే మండిపాటు

థౌబాల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి విరుచుకుపడ్డారు. మత విశ్వాసాన్ని కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. ఓటర్లను వంచించడం దారుణమని అన్నారు. ఆదివారం మణిపూర్‌లోని థౌబాల్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఖర్గే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో ఓట్ల కోసం మణిపూర్ వచ్చిన ప్రధాని మోదీ ఇప్పుడు ప్రజల కష్టాల్లో ఉంటే రావడం లేదని విమర్శించారు. ఇటీవల సముద్ర తీరంలో కుర్చీలో కూర్చొని రామ నామం జపిస్తూ మోదీ కనిపించారని చెప్పారు. ఒక వైపు రామ నామం జపిస్తూ మరోవైపు ప్రజలను మోసం చేయడం తగదని మోదీకి హితవు పలికారు. దేవుడి పట్ల అందరికీ నమ్మకం ఉందని పేర్కొన్నారు. కానీ, ఓట్ల కోసం మతాన్ని వాడుకోవడం సరైంది కాదని చెప్పారు. లౌకికవాదం, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం తాము పోరాడుతున్నామని స్పష్టం చేశారు. కానీ, బీజేపీ నాయకులు మాత్రం మతాన్ని, రాజకీయాలను మిళితం చేసి, జనాన్ని దగా చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలో నిరంకుశత్వం రాజ్యమేలుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతోనే రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రారంభించారని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న రాజు ఫ్రెడరిక్ దంపతులు

డెన్మార్క్ రాజుగా పదో ఫ్రెడరిక్

కోపెన్‌హెగెన్: డెన్మార్క్ రాజ సింహాసనాన్ని పదో ఫ్రెడరిక్ ఆదివారం అధిష్టించారు. రాణి రెండో మార్గరెట్ (83) అనారోగ్య కారణాలతో సింహాసనం వీడుతున్నట్లు కొత్త సంవత్సరం మొదటి రోజే ప్రకటించారు. 900 ఏళ్ల డెన్మార్క్ రాచరిక చరిత్రలో రాజు స్వచ్ఛందంగా సింహాసనం వీడటం ఇదే తొలిసారి. రాజధాని కోపెన్‌హెగెన్‌లోని జరిగిన కేబినెట్ సమావేశంలో సింహాసనం నుంచి వైదొలుగుతున్నట్లు తెలిపే పత్రంపై రాణి సంతకం చేశారు. తర్వాత ప్రధాని మెట్టి ఫ్రెడెరిక్సన్ రాజభవనం బాల్కనీ నుంచి పదో ఫ్రెడరిక్‌ను రాజుగా ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు రాజభవనం వెలుపల వేలాది మంది గుమికూడారు. 'గావ్ సేవ్ ది కింగ్' అని చెబుతూ రాణి అక్కడి నుంచి నిష్క్రమించారు. రెండో మార్గరెట్‌తో పాటు ఆస్ట్రేలియా మూలాలున్న ఫ్రెడరిక్ భార్య క్వీన్ మేరీ రూపంలో డెన్మార్క్‌కు ఇద్దరు రాణులుంటారు. ఫ్రెడరిక్, మేరీల పెద్ద కుమారుడు క్రిస్టియన్ (18) యువరాజు హోదాతో సింహాసనానికి వారసుడయ్యారు. డెన్మార్క్ రాజరికం యూరప్‌లోనే అత్యంత పురాతనమైంది. 10వ శతాబ్దంలో వైకింగ్ రాజు గోర్మ్ ది ఓల్డ్ కాలం నుంచి అప్రతిహతంగా కొనసాగుతోంది. 1146లో అప్పటి డెన్మార్క్ రాజు మూడో ఎరిక్ లామ్ స్వచ్ఛందంగా సింహాసనం నుంచి వైదొలిగి, సన్యాసం తీసుకున్నారు. డెన్మార్క్ రాజుగా తొమ్మిదో ఫ్రెడరిక్ 1947 నుంచి 1972వరకు కొనసాగారు. ఆయన అకస్మాత్తుగా చనిపోవడంతో ఆయన కుమార్తె రెండో మార్గరెట్ సింహాసనం అధిష్ఠించారు. దాదాపు 52 ఏళ్ల పాటు రాణిగా కొనసాగారు.

కాంగ్రెస్‌కు మిలింద్ రాజీనామా

శివసేన (షిండే)లో చేరిక

ముంబై: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి మిలింద్ దేవ్‌రా ఆ పార్టీకి ఆదివారం రాజీనామా చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. దీంతో కాంగ్రెస్–దేవ్‌రా కుటుంబం మధ్య 55 ఏళ్ల అనుబంధం తెగిపోయింది. రాహుల్ గాంధీ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' ప్రారంభించిన రోజే దేవ్‌రా కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పడం విశేషం. పారిశ్రామికవేత్తలను, వ్యాపారవేత్తలను కాంగ్రెస్ ఇష్టానుసారంగా దూషిస్తోందని ఈ సందర్భంగా దేవ్‌రా ఆక్షేపించారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎంతో శ్రమిస్తున్నారన్నారు.

దక్షిణ ముంబై స్థానం కోసమేనా?

దక్షిణ ముంబై లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికే దేవ్‌రా శివసేనలో చేరారని కాంగ్రెస్ ఆరోపించింది. ఎవరూ వెళ్లిపోయినా కాంగ్రెస్‌కు నష్టమేమీ ఉండదని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. దేవ్‌రాను కీలుబొమ్మను చేసి మోదీ ఆడిస్తున్నారన్నారు. దక్షిణ ముంబై సీటును తాము వదులుకొనే ప్రసక్తే లేదని శివసేన(ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ చెప్పారు. మిలింద్ దేవ్‌రా. దివంగత కాంగ్రెస్ అగ్రనేత మురళీ దేవ్‌రా కుమారుడు. ఆయన ఇటీవలే ఏఐసీసీ సంయుక్త కోశాధికారిగా నియమితులయ్యారు. గతంలో దక్షిణ ముంబై స్థానం నుంచి ఎంపీగా గెలిచారు. యూపీఏ హయాంలో కేంద్ర మంత్రిగా చేశారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ మిత్రపక్షమైన శివసేన(ఉద్ధవ్) రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా దక్షిణ ముంబై స్థానాన్ని కోరుతోంది. అందుకే దేవ్‌రా కాంగ్రెస్‌ను వీడినట్లు తెలుస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో దక్షిణ ముంబై నియోజకవర్గంలో శివసేన నేత(ఇప్పుడు ఉద్ధవ్ వర్గం) అరవింద్ సావంత్ చేతిలో మిలింద్ ఓడిపోయారు.


ఆదివారం శివసేనలో చేరిన సందర్భంగా మహారాష్ట్ర సీఎం షిండేతో మిలింద్ దేవ్‌రా

వాయుకాలుష్యం గుప్పిట హస్తిన

న్యూఢిల్లీ: దేశరాజధాని మళ్లీ తీవ్ర వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. ఆదివారం ఉదయం ఢిల్లీలో వాయు నాణ్యతా సూచీ(ఏక్యూఐ) దారుణంగా 458కు పెరిగింది. దీంతో అత్యవసరంకాని నిర్మాణ పనులను తక్షణం ఆపేయాలని కేంద్ర ప్రభుత్వం ఒక ఉత్తర్వు జారీచేసింది. బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ నాలుగు చక్రాల వాహనాల రాకపోకలను ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో నిషేధిస్తూ ఉత్తర్వులిచ్చింది. వాయు నాణ్యత దారుణంగా పడిపోవడంతో గ్రాప్ స్టేజ్-3 కట్టడి చర్యలను కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ తీసుకుంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో వాయు కాలుష్య నియంత్రణ, కట్టడి చర్యల బాధ్యతలు ఈ కమిషన్‌కే ప్రభుత్వం అప్పజెప్పింది. జాతీయ భద్రత, రక్షణ, ఆరోగ్యం, రైల్వే, మెట్రో రైల్, విద్యుత్ సరఫరా, పైప్‌లైన్, మురుగునీటి నిర్వహణ వంటి అత్యవసర సేవల సంబంధ పనులను మాత్రం అనుమతిస్తారు. చలికాలంలో ఢిల్లీలో కేంద్రం వాయు కాలుష్య నియంత్రణ ప్రణాళికను అమలు చేస్తూ వస్తోంది. ఏక్యూఐ సూచీ 300లోపు ఉంటే స్టేజ్1గా, 400 లోపు ఉంటే స్టేజ్2గా, 450లోపు ఉంటే స్టేజ్3గా, 450 పైన ఉంటే స్టేజ్4 వాయు కాలుష్యంగా లెక్కిస్తారు.

శ్రీలంక అదుపులో 12 మంది మత్స్యకారులు

కొలంబో: తమ ప్రాదేశిక జలాల్లో వేట సాగిస్తున్నారనే ఆరోపణలతో 12 మంది భారతీయ మత్స్యకారులు, వారి ట్రాలర్లను శ్రీలంక నేవీ అదుపులోకి తీసుకుంది. ఉత్తర జాఫ్నాలోని కరైనగర్ తీరంలో శనివారం మూడు ట్రాలర్లు సహా మత్స్యకారులను అరెస్ట్ చేసినట్లు నేవీ ఆదివారం తెలిపింది. వీరందరినీ కంకేశతురై హార్బర్‌కు తరలించామని తెలిపింది. తమిళనాడు, శ్రీలంకలను విడదీసే ఇరుకైన పాక్ జలసంధి వద్ద చేపల వేట వివాదాస్పదమవుతోంది. గతేడాది శ్రీలంక 240 మంది భారతీయ మత్స్యకారులను అదుపులోకి తీసుకుంది.

ఉత్తర కొరియా మరో క్షిపణి ప్రయోగం

సియోల్: ఉత్తరకొరియా ఆదివారం సముద్ర జలాలపైకి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. దక్షిణ కొరియా, జపాన్ దీన్ని ధ్రువీకరించాయి. డిసెంబర్ 18న కూడా అమెరికా ప్రధాన భూభాగంపై సైతం దాడి చేయగల సామర్థ్యమున్న ఘన ఇంధన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి హ్వాసంగ్-18ని ఉత్తర కొరియా ప్రయోగించింది. ఏప్రిల్‌లో దక్షిణకొరియాలో, నవంబర్‌లో అమెరికాలో జరగనున్న అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసేందుకే ఉత్తరకొరియా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్లు భావిస్తున్నారు.

మార్చి 15 కల్లా సైన్యాన్ని ఉపసంహరించుకోండి

భారత్‌కు మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు గడువు

మాలె: భారత్ తమ దేశంలోని సైన్యాన్ని మార్చి 15వ తేదీకల్లా ఉపసంహరించుకోవాలని మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు కోరారు. ప్రస్తుతం మాల్దీవుల్లో 88 మంది భారత సైనికులున్నారు. ఈ పరిణామంపై కేంద్రం ఎటువంటి వ్యాఖ్యా చేయలేదు. గత నవంబర్ 17న మాల్దీవుల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ముయిజ్జుకు చైనా అనుకూల నేతగా పేరుంది. ప్రజాభీష్టం మేరకు భారత సేనలు తమ దేశం నుంచి వెళ్లిపోవాలని ఆయన అప్పట్లోనే ప్రకటించారు. భారత ప్రధానిపై మాల్దీవుల మంత్రులు అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, వారిని ప్రభుత్వం తొలగించడం తెలిసిందే. ఈ పరిణామం రెండు దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసింది.

ట్రాన్స్ జెండర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. యూట్యూబర్‌కు రూ.50 లక్షల జరిమానా

చెన్నై: ట్రాన్స్‌జెండర్ వ్యాపారవేత్త, ఏఐఏడీఎంకే అధికారి ప్రతినిధి అప్సరా రెడ్డిని అప్రతిష్టపాలు చేసిన ఓ యూట్యూబర్‌కు మద్రాస్ హైకోర్టు రూ.50 లక్షల జరిమానా విధించింది! ఆమె ప్రావోగ్ మేగజీన్‌లో పని చేసిన రోజుల్లో మైకేల్ ప్రవీణ్ అనే సహోద్యోగితో విభేదాలొచ్చాయి. దాంతో అతను అప్సరను కించపరుస్తూ 10 వీడియోలను యూట్యూబ్‌లో పోస్ట్ చేశాడు. ప్రవీణ్ నుంచి రూ.1.25 కోట్లు పరిహారం కోరుతూ కోర్టులో పిటిషన్ వేశారు. ఆమెకు రూ.50 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ''సోషల్ మీడియాలో పోస్టులతో ఇతరుల గోప్యతకు భంగం కలిగించొద్దు. ఏ హక్కయినా పరిమితులకు లోబడి ఉంటుంది'' అని పేర్కొంది.

రామస్వామిపై డొనాల్డ్ ట్రంప్ విసుర్లు

వాషింగ్టన్: రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ఉన్న భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామిపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకు పడ్డారు. ఆయన మోసపూరిత ప్రచార జిమ్మిక్కులకు పాల్పడుతున్నారన్నారు. వివేక్ అనుచరులు 'సేవ్ ట్రంప్, ఓట్ వివేక్' అన్న షర్టులు ధరించడం, అవి వైరలవడం ట్రంప్‌కు ఆగ్రహం తెప్పించింది. తనకు మద్దతిస్తున్నట్లు కనిపిస్తూనే మోసపూరిత ప్రచార ట్రిక్కులు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. వివేక్ మాయలో పడకుండా తనకే ఓటేయాలన్నారు. వివేక్‌పై ట్రంప్ నేరుగా విమర్శలు చేయడం ఇదే తొలిసారి.

త్రుటిలో తప్పిన మరో విమాన ప్రమాదం

టోక్యో: అమెరికాలో విమానం మార్గమధ్యంలో కిటికీ ఊడిపడి ప్రయాణికులు నరకం చూసిన ఘటన మరువకముందే దాదాపు అలాంటి ఘటనే జపాన్‌లో జరిగింది. కాక్‌పిట్ కిటికీకి పగుళ్లు రావడంతో అప్రమత్తమైన విమాన పైలెట్లు వెంటనే విమానాన్ని వెనక్కి మళ్లించి ఎమర్జెన్సీ ల్యాండింగ్‌చేశారు. జపాన్‌లోని సప్పోరో నగరంలోని న్యూ చిటోసే ఎయిర్‌పోర్ట్‌లో శనివారం జరిగిన ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. 59 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో ఆల్ నిప్పన్ ఎయిర్‌వేస్‌కు చెందిన దేశీయ బోయింగ్ 737-800 రకం విమానం సప్పోరో నుంచి టొయామాకు బయల్దేరింది. మార్గమధ్యంలో కాక్‌పిట్ కిటికీలో పగుళ్లను గుర్తించారు. పైలెట్లు వెంటనే అప్రమత్తమై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారం ఇచ్చారు. వారి అనుమతితో మళ్లీ అదే ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయడంతో పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది.

యుద్ధజ్వాలలకు... 100 రోజులు

రావణకాష్టంగా గాజా ● ఇజ్రాయెల్ దాడులు తీవ్రతరం



క్రైస్తవ, ముస్లిం, యూదు మతాల పవిత్ర స్థలాలకు నెలవైన జెరూసలేంలోని అల్–అక్సా మసీదు ప్రాంతంలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ దళాల దాడులతో రాజుకున్న వివాదం చివరకు హమాస్–ఇజ్రాయెల్ యుద్ధంగా తీవ్రరూపం దాల్చి ఆదివారంతో 100 రోజులు పూర్తిచేసుకుంది. అక్టోబర్ ఏడున ఇజ్రాయెల్ సరిహద్దు గ్రామాలపై హమాస్ మిలిటెంట్ల మెరుపు దాడులు, 1,200 మంది ఇజ్రాయెల్ పౌరుల హతం, 200 మందికిపైగా అపహరణతో మొదలైన ఈ ఘర్షణ ఆ తర్వాత ఇజ్రాయెల్ భూతల, గగనతల భీకర దాడులతో తీవ్ర మానవీయ సంక్షోభంగా తయారైంది. వందల కొద్దీ బాంబు, క్షిపణి దాడుల ధాటికి లక్షలాది మంది పాలస్తీనియన్లు ప్రాణభయంతో పారిపోయారు. దాడుల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా లక్షలాది మంది నిరాశ్రయులై తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు లేక, కనీసం తాగు నీరు లేక జీవచ్ఛవాల్లా బతుకీడుస్తున్నారు. ఈ యుద్ధం 23 వేలకుపైగా ప్రాణాలను బలితీసుకోగా పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులను మరింత పెంచింది. ఐక్యరాజ్య సమితి మానవీయ సాయం డిమాండ్లు, తీర్మానాలతో కాలం వెళ్లదీస్తోంది.

మృత్యు నగరాలు

ఇజ్రాయెల్ దాడులతో గాజా స్ట్రిప్‌లోని ప్రతి పట్టణం దాదాపు శ్మశానంగా తయారైంది. మొత్తం 23 లక్షల జనాభాలో 85 శాతం మంది వలసపోయారు. ఉత్తర గాజాపై, ఆ తర్వాత దక్షిణ గాజాపై దాడుల ఉధృతి పెరగడంతో జనం ఈజిప్ట్ చిట్టచివరి సరిహద్దు ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలెంట్లు, యెమెన్‌లోని హౌతీల దాడులతో యుద్ధజ్వాలలు పశ్చిమాసియాకు పాకుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటించేదాకా బందీలను వదిలిపెట్టబోమని, దాడులను ఆపబోమని హమాస్, దాన్ని హమాస్‌ను కూకటివేళ్లతో పెకలించేదాకా యుద్ధం ఆపేది లేదని ఇజ్రాయెల్ అంటున్నాయి!

- సాక్షి, నేషనల్ డెస్క్

ఫలించని దౌత్యం

ఖతార్, అమెరికా దౌత్యం తొలుత సఫలమైనట్లే కనిపించింది. ఇజ్రాయెల్, పాలస్తీనా పరస్పరం బందీలను విడుదల చేశాయి. కానీ ఆ వెంటనే మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఈ వంద రోజుల్లో లక్షలాది ఇళ్లు, వేలాది ప్రాణాలు మట్టిలో కలిసిపోయాయి. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు, మహిళలు ఉండటం అత్యంత విషాదకరం.

రోగాల పుట్టలుగా శరణార్థి శిబిరాలు

గాజాలో శరణార్థి శిబిరాలు కిటకిటలాడుతున్నాయి. జనం రోగాలబారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది. ఆహార, సరకులు, ఔషధ సాయం అందకుండా ఇజ్రాయెల్ దాడులకు దిగుతుండటంతో అక్కడ ఎటు చూసినా భయానక పరిస్థితులు రాజ్యమేలుతున్నాయి.



మలేసియా టౌన్‌షిప్‌లో భోగి మంటలు, గంగిరెద్దుల కోలాహలం

పట్నమొచ్చిన పల్లె!

మదిలో నిండుగా తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు

భోగి మంటలతో షురువైన సంక్రాంతి సంబరాలు

- చాలా వరకు ఊళ్లకు పయనమైనా తగ్గని సందడి
- ముత్యాల ముగ్గులతో కళకళలాడిన ముంగిళ్లు
- పతంగులు ఎగురవేసి కేరింతలు కొట్టిన యువత
- గ్రామ సీమలను తలపించిన మాదాపూర్, ఉప్పల్ శిల్పారామాలు
- ఆకట్టుకున్న డూడూ బసవన్నలు, హరిదాసుల కీర్తనలు
- నగరమంతటా వెల్లివిరిసిన ఆనంద సరాగాలు



సాక్షి హైదరాబాద్ 7

సోమవారం। 15। జనవరి। 2024







వయ్యారి గాలిపటం.. ఎంతెంత దూరం





సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ వేదికగా నిర్వహిస్తున్న స్వీట్ అండ్ కైట్ ఫెస్టివల్ రెండో రోజూ సందర్శకులతో నిండుదనాన్ని సంతరించుకుంది. స్టాళ్లలో విదేశీయులు, వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఏర్పాటు చేసిన విభిన్న రుచులు నగరవాసుల నోరూరించాయి. పలు రకాల వంటకాల మధురిమలను ఆస్వాదించారు. సుమారు 750 స్టాళ్లను ఏర్పాటు చేయగా.. వీటిలో 10 విదేశాలకు చెందిన స్టాళ్లు భిన్నమైన రుచులకు వేదికలుగా నిలిచాయి. సంక్రాంతికి పల్లెటూర్లకు వెళ్లని వారంతా స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొని అరుదైన రుచులను చవిచూశారు. మరోవైపు కైట్ ఫెస్టివల్‌లో భాగంగా విభిన్న ఆకృతుల పతంగులను ఎగురవేసి చూపరులను ఆకట్టుకున్నారు.



వి'హంగామా'.. అదే మధురిమ..!





స్వీట్ ఫెస్టివల్‌లో రుచులను ఆస్వాదిస్తున్న సందర్శకులు



గాలిపటం ఎగురవేస్తున్న మాజీ మంత్రి తలసాని



నిర్మానుష్యంగా తెలుగుతల్లి ఫ్లై ఓవర్



పీపుల్స్ ప్లాజా వద్ద పతంగులు ఎగురవేస్తున్న ఎంపీ లక్ష్మణ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

భోగి రోజూ రద్దీ

- పెద్ద ఎత్తున సొంత ఊళ్లకు తరలిన నగరవాసులు
- ఆర్టీసీ బస్సులకు ప్రజల బ్రహ్మారథం: సజ్జనార్

సాక్షి, సిటీబ్యూరో: భోగి పర్వదినమైన ఆదివారం కూడా నగరవాసులు పెద్ద ఎత్తున సొంత ఊళ్లకు తరలివెళ్లారు. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లు, బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. సొంత వాహనాల్లో సైతం పెద్ద ఎత్తున బయలుదేరారు. ఉప్పల్, ఎల్‌బీనగర్, ఆరాంఘర్ తదితర బస్టాండ్ల వద్ద ప్రయాణికుల రద్దీ నెలకొంది. మరోవైపు సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీ బస్సులకు బ్రహ్మారథం పడుతున్నారని, భారీ ఎత్తున సొంత ఊళ్లకు వెళ్తున్నారని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్ వేదికగా తెలిపారు.

ఒక్కరోజే 1,861 ప్రత్యేక బస్సులు

గతంలో ఎన్నడూ లేని విధంగా శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 1861 ప్రత్యేక బస్సులను వివిధ ప్రాంతాలకు నడిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బస్సుల్లో 1,127 హైదరాబాద్ సిటీ బస్సులను ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న కరీంనగర్, వరంగల్, విజయవాడ, ఖమ్మం, తదితర రూట్లలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శనివారం వరకు మొత్తం 6,261 ప్రత్యేక బస్సులను నడిపినట్లు ఎండీ తెలిపారు. ఆదివారం కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో 652 ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మరోవైపు శనివారం ఒక్క రోజే 52.78 లక్షల మంది టీఎస్ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నట్లు వెల్లడించారు. వీరిలో సగానికిపైగా మహిళా ప్రయాణికులే ఉండడం గమనార్హం. . .

కమాండ్ కంట్రోల్ సెంటర్...

మరోవైపు బస్సుల నిర్వహణ కోసం ఈ ఏడాది మొట్టమొదటిసారి బస్‌భవన్ లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేశారు.ఏయే రూట్లలో ప్రయాణికుల రద్దీ ఉందనే వివరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అందుకనుగుణంగా ప్రత్యేక బస్సులను ప్రయాణికులు అందుబాటులో ఉంచారు. ముందస్తు ప్రణాళికతో పాటు సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల సంక్రాంతికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బస్సులను ఏర్పాటు చేశారు. ప్రశాంతంగా ప్రజలను సొంతూళ్లకు చేర్చడంలో పాలుపంచుకున్న ఆర్టీసీ సిబ్బందికి, అధికారులకు ఎండీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



హరిలో రంగ హరి.. రావమ్మ మహాలక్ష్మి రావమ్మా.. సంకురాత్రి సంబరాలు.. ముంగిళ్లన్నీ ముత్యాల ముగ్గులు.. లోగిళ్లన్నీ ఆనందాల సందళ్లతో నగరమంతా మురిసిపోయింది. చిక్కటి శీతాకాలంలో భోగి మంటలతో చలి కాచుకుంది. సంక్రాంతి సంబురాలకు ఆహ్వానం పలికింది. సిటీజనులు తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తారని మరోసారి నిరూపించుకున్నారు. ఆదివారం భోగి మంటలు.. దూడూ బసవన్నల విన్యాసాలు.. హరిదాసుల కీర్తనలు.. ముత్యాల ముగ్గులతో సంకాంత్రి శోభ వెల్లివిరిసింది. కళాధామమైన శిల్పారామంలో భోగి వైభోగాలను కళ్లకు కట్టారు. ప్రత్యేకంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నగర వాకిళ్లు రంగు రంగుల ముగ్గులతో హరివిల్లును తలపించాయి. చిన్నారుల కోలాహలం మధ్య యువత గాలిపటాలను ఎగురవేసి ఆనంద సాగరాల్లో మునిగితేలింది. కుటుంబ సమేతంగా ఎంజాయ్ చేశారు. నుమాయిష్ ఎగ్జిబిషన్ సందర్శకులతో కిటకిటలాడింది. మొత్తంగా నగరం సోమవారం జరుపుకొనే సంక్రాంతికి సంబరంగా స్వాగతం పలికింది.

– సాక్షి, సిటీబ్యూరో



కేబీఆర్ పార్కులో భోగి మంటలు

'హస్తం'లోకి వస్తాం!

అధికార కాంగ్రెస్ వైపు పాత కాపుల చూపులు

- సొంత గూటికి వచ్చేందుకు కొందరు నేతల ప్రయత్నాలు
- మంత్రులు, ముఖ్య నేతలతో మంతనాలు
- లోక్‌సభ ఎన్నికలకు ముందే చేరికల వ్యూహం

సాక్షి, సిటీబ్యూరో: అధికార కాంగ్రెస్‌లో చేరేందుకు పాత కాపులు ప్రయత్నాలు ప్రారంభించారు. రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడంతో పాత పరిచయాలతో ఒక్కొక్కరుగా మంత్రులు, ముఖ్య నేతల టచ్‌లోకి వెళ్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో గ్రేటర్ పరిధిలోని పలువురు కాంగ్రెస్ ముఖ్యనేతలు తమ రాజకీయ భవిష్యత్ దృష్ట్యా ఆ పార్టీని వీడారు. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తిరిగి సొంత గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీరిలో కొందరు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతోపాటు మాజీ మేయర్, కొందరు ముఖ్యనేతలు కూడా ఉన్నట్లు సమాచారం.

లైన్‌లో జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు

రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల్లో అవిశ్వాస తీర్మానాలకు తెర లేచిన నేపథ్యంలో జీహెచ్ఎంసీపై కూడా కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దీంతో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన కొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్ నేతల టచ్‌లో ఉన్నట్లు సమాచారం. రాజకీయ భవిష్యత్ దృష్ట్యా మంత్రులు, ముఖ్య నేతలతో సైతం వీరు భేటీ అయినట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు ముందే వారిని పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్ కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే బల్దియా ఎన్నికల నాటికి నగరంలో పార్టీని బలోపేతం చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావించడం ఇందుకు బలం చేకూరుస్తోంది.

గతంలో పరిస్థితి ఇలా..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరాజయం పాలు కాగా.. అప్పట్లో గ్రేటర్ నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు పార్టీని వీడి అధికార పక్షంలో చేరారు. గత ఐదేళ్ల క్రితం జరిగిన శాసన సభ ఎన్నికల అనంతరం కూడా అదే పరిస్థితి పునరావృతమైంది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి కేవలం ఉనికికే పరిమితమైంది. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో జరిగిన ఎన్నికల్లో పోటీ 52 స్థానాలను గెలిచి మజ్లిస్ సహకారంతో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్.. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక 2016, 2021లలో జరిగిన బల్దియా ఎన్నికల్లో కేవలం రెండు స్థానాలకు పరిమితమైంది. అంతకుముందు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, దానం నాగేందర్, కూన శ్రీశైలం, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, ఆయన కుమారుడు రవికుమార్, జయసుధ, మాజీ మేయర్ కార్తీకరెడ్డి, దివంగత మాజీ మంత్రి కుమారుడు విక్రమ్ గౌడ్‌లతోపాటు పలువురు పార్టీ ముఖ్య నేతలు సైతం పార్టీకి గుడ్‌బై చెప్పారు. తాజాగా ఇందులో కొందరు తిరిగి సొంత గూటికి వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం.

జోన్లు మారేనా?

- తెరపైకి నియోజకవర్గాల పునర్విభజన
- ఉమ్మడి రాష్ట్రంలో 5 జోన్లు
- తెలంగాణ ఏర్పాటు తర్వాత 6
- కొత్తగా పెంచుతారా.. తగ్గిస్తారా?

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోని జిల్లాలను పునర్విభజన చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించడంతో పాటు ఆ దిశగా కసరత్తు కూడా ప్రారంభమైన నేపథ్యంలో జీహెచ్ఎంసీ జోన్లు, సర్కిళ్లలోనూ మార్పు చేర్పులు ఉంటాయా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. జీహెచ్ఎంసీలో గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఐదు జోన్లు (ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్, సెంట్రల్) ఉండేవి. వాటిలో 18 సర్కిళ్లు ఉండేవి. 18 సర్కిళ్లను తొలుత 24 సర్కిళ్లుగా మార్చారు. తర్వాత వాటిని 30 సర్కిళ్లుగా చేశారు. ఐదు జోన్లను ఆరు జోన్లుగా మార్చారు. ఆరు జోన్లకు చార్మినార్, ఎల్‌బీనగర్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, సికింద్రాబాద్ జోన్లుగా పేర్లు పెట్టారు.

12 జోన్లు.. 48 సర్కిళ్లు..

పరిపాలన సౌలభ్యం కోసమంటూ గత ప్రభుత్వం జిల్లాల సంఖ్యను పెంచినట్లే జీహెచ్ఎంసీ జోన్లను సైతం 12 జోన్లుగా చేయాలని.. ఒక్కో జోన్‌లో నాలుగు సర్కిళ్ల వంతున 48 సర్కిళ్లను ఏర్పాటు చేయాలని భావించింది. ఆమేరకు జీఓ కూడా వెలువడింది. కానీ.. ఎందుకనో అది కార్యరూపం దాల్చలేదు. జోన్లను పదికి, సర్కిళ్లను యాభైకి పెంచాలని 2018లో స్టాండింగ్ కమిటీ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించగా, 12 జోన్లు.. 48 సర్కిళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం జీఓ వెలువరించింది. కానీ అంతకుముందే ఏర్పాటైన ఆరు జోన్లే కొనసాగుతున్నాయి.

- ప్రస్తుతం జిల్లాల పునర్విభజన తెర్లపైకి రావడంతో జీహెచ్ఎంసీలోనూ జోన్లు, సర్కిళ్లు మారతాయా అనేది జీహెచ్ఎంసీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికీ ప్రస్తుతమున్న సర్కిళ్లు, జోన్లలో సమస్యలున్నాయి. ఖైరతాబాద్ జోన్ షేక్‌పేట దాకా విస్తరించి ఉంది. శేరిలింగంపల్లి ఒకే జిల్లా పరిధిలో లేదు. ఇలా వివిధ అంశాల్లో వ్యత్యాసాలున్నాయి.



గతంలో ఇలా..

జీహెచ్ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా వాటిని 12 జోన్ల పరిధిలోకి తేవాలని భావించారు. ఒక్కో జోన్‌లో రెండు నియోజకవర్గాలు, నాలుగు సర్కిళ్లు ఉండేలా పునర్వ్యవస్థీకరించాల్సిందిగా జీవో జారీ చేశారు. ఆమేరకు కమిషనర్‌ను ఆదేశించారు. కానీ ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలోనూ మార్పుచేర్పులు జరగవచ్చననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కలెక్టర్ బాధ్యతలు కమిషనర్‌కు..

జీహెచ్ఎంసీ పరిధిలో నాలుగు జిల్లాలున్నాయి. అన్ని జిల్లాల్లో ఎన్నికల నిర్వహణ కలెక్టర్లది కాగా హైదరాబాద్ జిల్లాది మాత్రం కమిషనర్‌కు అప్పగించారు. దీంతో ఎన్నికలొచ్చిన ప్రతిసారీ జీహెచ్ఎంసీలో పనులు నిలిచిపోతున్నాయి. కోటిమందికి పైగా సేవలందించే జీహెచ్ఎంసీ కమిషనర్‌కు జిల్లా ఎన్నికల అధికారి బాధ్యతలున్నాయి. గ్రేటర్ పరిధిలోనే ఉన్న ఒక జిల్లాలో ఐదు నియోజకవర్గాలుంటే, ఒక జిల్లాలో 15 నియోజకవర్గాలున్నాయి. ఒక ఎమ్మెల్యే పరిధిలో తక్కువ వార్డులుంటే.. మరో ఎమ్మెల్యే పరిధిలో ఎక్కువ వార్డులున్నాయి. ఇలా వివిధ అంశాల్లో వ్యత్యాసాలున్నాయి. దీంతో నియోజకవర్గాలతో పాటే జీహెచ్ఎంసీ జోన్లు, సర్కిళ్లు, వార్డుల్లోనూ మార్పుచేర్పులుంటాయా ? అనేది చర్చనీయాంశంగా మారింది.

ఉద్యమకారుల సంక్షేమబోర్డు ఏర్పాటు కావాలి

ప్రొఫెసర్ కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

కుషాయిగూడ: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం సంక్షేమబోర్డు ఏర్పాటు అవసరమని ప్రొఫెసర్ కోదండరాం అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారుల సంక్షేమానికి చేసిన కృషిని హర్షిస్తూ ఆదివారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని రౌండ్ బిల్డింగ్‌లో నిర్వహించిన కృతజ్ఞత సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమబోర్డు ఏర్పాటుకు సుముఖత చూపితే తమవంతు పూర్తి సహకారం అందజేస్తామన్నారు. నాడు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న వారంతా తమ గుర్తింపులకు తగిన పత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎఫ్ఐఆర్ కాపీలు, పేపర్ కట్టింగ్‌లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్, ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, నల్లా రాధాకృష్ణ, సురేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, రాములు, సీతారాంరెడ్డి, విద్యాసాగర్, అనంతలక్ష్మి, గగన్ కుమార్, ఆంజనేయులు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉద్యమ నాయకులు..

బోగస్ వివరాలతో ఆధార్ కార్డులు!

- వీటి ఆధారంగా బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు
- సైబర్ నేరగాళ్లకు అందిస్తున్న ఇద్దరు యువకులు
- ఒక్కో అకౌంట్‌కు రూ.25 వేల చొప్పున వసూలు
- బాధితుల నుంచి నగదు గుంజడానికి ఇవి వినియోగం
- ఇద్దరిని అరెస్టు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలుగా ఎర వేసి, బాధితుల నుంచి అందినకాడికి దండుకునే సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు చాలా కీలకం. వీటిని తమ పేర్లు, వివరాలతో తీసుకుంటే పోలీసులకు చిక్కే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో సూత్రధారులు ఈ ఖాతాలను తెరిచి ఇవ్వడానికి ఉత్తరాదిలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారు. బోగస్ వివరాలతో తెరిచిన ఒక్కో బ్యాంక్ ఖాతాను రూ.25 వేలకు విక్రయిస్తున్న ఇద్దరు ఫరీదాబాద్ వాసులను హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ఢిల్లీ వాసి కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు సంయుక్త సీపీ ఏవీ రంగనాథ్ ఆదివారం వెల్లడించారు.

ఉద్యోగాల పేరుతో ప్రకటనలిచ్చి...

ఢిల్లీకి చెందిన ఘరానా సైబర్ నేరగాడు దేవేందర్ పంచాల్ దేశ వ్యాప్తంగా అనేక మంది నుంచి భారీ మొత్తం దండుకున్నాడు. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇవ్వడం, ఆకర్షితులై స్పందించిన వారితో సంప్రదింపులు జరపడం చేస్తుంటాడు. ఆపై ఉద్యోగానికి ముందు తమ వద్ద కొంత మొత్తం పెట్టుబడి పెట్టాలంటూ నమ్మించి అందినకాడికి దండుకుంటారు. ఇలా నగరంలోని అమీర్‌పేట ప్రాంతానికి చెందిన ఓ బాధితుడి నుంచి రూ.4.75 లక్షలు కాజేశాడు. ఈయన ఫిర్యాదు మేరకు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్జీ శివ మారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు దీన్ని దర్యాప్తు చేశారు. బాధితుడు ఓ బ్యాంకు ఖాతాలో డబ్బు డిపాజిట్/ట్రాన్స్‌ఫర్ చేయగా... అది ఢిల్లీలోని రిచిక ఇన్ఫోసిస్టమ్స్ పేరుతో ఉన్న కరెంట్ ఖాతాలోకి బదిలీ అయినట్లు గుర్తించారు. ఇందులో మొత్తం రూ.2.5 కోట్లు డిపాజిట్ కాగా... ఖాతాలో ఉన్న రూ.6 లక్షలు ఫ్రీజ్ చేశారు. ఈ కరెంట్ అకౌంట్‌ను పంకజ్ చాహు అనే వ్యక్తి తెరిచినట్లు గుర్తించిన దర్యాప్తు అధికారులు మూలాలు కనుక్కోవడంపై దృష్టి పెట్టారు.

ఐదు కార్డులు రూపొందించి..

ఫరీదాబాద్‌కు చెందిన ప్రవీణ్ ఓ బ్యాంకులో పని చేస్తూ, ఆధార్ కార్డు ప్రాసెసింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. దేవేందర్ సూచనల మేరకు ప్రవీణ్ తన స్నేహితుడైన హిమాన్షు ఫొటో, వేలిముద్రలు, ఐరిష్ ఆధారంగా పంకజ్ చాహు పేరుతో ఆధార్ కార్డు ప్రాసెస్ చేశాడు. ఇలా ఇతడి ఫొటోతో, వేర్వేరు తప్పుడు వివరాలు, పేర్లతో మొత్తం ఐదు కార్డులు రూపొందించాడు. ఇవి దాఖలు చేయడం ద్వారా పాన్‌కార్డులు తీసుకుని... ఒక్కో కార్డు ఆధారంగా నాలుగు చొప్పున వేర్వేరు బ్యాంకుల్లో కరెంట్ ఖాతాలు తెరిచాడు. ఒక్కో ఖాతాను రూ.25 వేలకు దేవేందర్‌కు విక్రయించాడు. బ్యాంకు ఖాతాకు సంబంధించిన పాస్ బుక్, చెక్కుబుక్, డెబిట్ కార్డులతో పాటు దాంతో లింకై ఉన్న ఫోన్ నెంబర్‌ను అతడికి అందించాడు. ఇలాంటి వాటిలో రిచిన ఇన్ఫోసిస్టమ్స్ ఖాతా కూడా ఒకటి. ఈ వివరాలు గుర్తించిన సైబర్ క్రైమ్ అధికారులు దేవేందర్‌తో పాటు హిమాన్షు, ప్రవీణ్‌లను పట్టుకోవడానికి ఢిల్లీ, ఫరీదాబాద్‌లకు ప్రత్యేక బృందాలను పంపారు.

ఇద్దరి అరెస్ట్.. దేవేందర్ పరార్

ఢిల్లీలోని రోహిణి ఠాణాలో నమోదైన కేసులోనూ దేవేందర్ ప్రమేయం ఉంది. దీంతో కొన్ని రోజుల క్రితం ఆ పోలీసులు ఇతడి కోసం ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న దేవేందర్ పూర్తి అజ్ఞాతంలోకి వెళ్ళిపోవడంతో సిటీ పోలీసులకు చిక్కలేదు. ఫరీదాబాద్‌లో గాలించిన బృందం మిగిలిన ఇద్దరినీ అరెస్టు చేసి తీసుకువచ్చింది. వీరి నుంచి ఫోన్లు, సిమ్‌కార్డులు తదితరాలు స్వాధీనం చేసుకుని దేవేందర్ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆధార్ అధికారులకు ఈ వ్యవహారం తెల్పగా ఐదు కార్డులను రద్దు చేయడంతోపాటు సెంటర్ లైసెన్స్‌నూ రద్దు చేశారు.

ఎగ్జిబిషన్‌కు పోటెత్తిన సందర్శకులు

తరలివచ్చిన లక్ష మంది



సందర్శకులతో కిక్కిరిసిన ఎగ్జిబిషన్

అబిడ్స్: ఎగ్జిబిషన్ సందర్శకులతో కిక్కిరిసింది.అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన శాల (నుమాయిష్) ఆదివారం సంక్రాంతి భోగి వేడుకల సందర్భంగా పెద్ద ఎత్తున సందర్శకులు తరలి వచ్చారు. దాదాపు లక్ష మంది ఎగ్జిబిషన్‌కు తరలి రావడంతో ఎగ్జిబిషన్ పరిసర ప్రాంతాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఎగ్జిబిషన్‌లో బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా నిఘా చేపట్టారు. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా సొసైటీ ఆధ్వర్యంలో సకల ఏర్పాట్లు చేశామని సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావులు తెలిపారు.

కోలాహలంగా లోహ్రీ మేళా



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని ఎస్వీటీ ఆడిటోరియంలో పంజాబీలు కోలాహలంగా లోహ్రీ మేళాను జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం పంజాబీ సేవా సమితి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరంలోని పంజాబీలో పెద్ద ఎత్తున హాజరై ఉత్సాహంగా వేడుకలు చేసికున్నారు. భోగి మంటలు, అందమైన రంగవల్లులు, లైవ్ సంగీతంతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల గేమ్స్‌తో కుటుంబాలన్నీ కలిసి ఆహ్లాదకరంగా జరుపుకున్నారు. సంస్థ కన్వీనర్ సునిల్ పురి, మాజీ అధ్యక్షులు వినీత్ అరోరా, ప్రతినిధులు ఉమేష్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఫ్యాషన్ కిడ్స్



రాంగోపాల్‌పేట్: గుజరాతీ ఏక్తా మహోత్సవ్-24లో భాగంగా సికింద్రాబాద్ ఆర్పీ రోడ్‌లోని గుజరాతీ స్కూల్‌లో ప్రదర్శించిన చిన్నారుల ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఏప్రిల్‌లో జరిగే గ్రాండ్ ఫినాలే జరిగే ఆడిషన్స్‌లో సుమారు 200 మంది చిన్నారులు హాజరై తమ ప్రతిభతో అదుర్స్ అనిపించారు. తెలంగాణ గుజరాతీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంప్రదాయ, సమకాలీన దుస్తులు ధరించి చిన్నారులు ర్యాంప్‌పై చేసిన క్యాట్ వాక్‌కు అందరు ముగ్ధులయ్యారు. సమాజ్ అధ్యక్షులు ప్రేమల్ పరేఖ్, ఉపాధ్యక్షులు మన్సుఖ్ పటేల్, ప్రధాన కార్యదర్శి మినాల్ విఖారియా, కోశాధికారి కృష్ణకాంత్, ట్రస్టీలు చేతన్‌భోగాని, చైర్మన్ జస్మత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పెరిగిన ఉష్ణోగ్రతలు

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో పగటి, రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గాలులు ఆగ్నేయం దిశ నుంచి వీస్తుండటంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. గత మూడు రోజులుగా ఉష్ణోగ్రతల్లో మార్పు వచ్చింది. ఆదివారం నగరంలో సగటున గరిష్ట ఉష్ణోగ్రత 33.2, కనిష్ట ఉష్ణోగ్రతలు 18.7 డిగ్రీలుగా నమోదయ్యాయి. సాధారణ ఉష్ణోగ్రత కంటే 3.7 డిగ్రీలు, కనిష్టం కంటే 3.2 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. గత నాలుగు దశాబ్దాల క్రితం నమోదైన ఉష్ణోగ్రత కంటే ఒక డిగ్రీ అధికంగా రికార్డు నమోదైనట్లు తెలుస్తోంది. రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది.

రూ.10 లక్షల విలువైన చైనా మాంజా సీజ్

18పై కేసులు నమోదు

అబిడ్స్: నిషేధిత నైలాన్ సింథటిక్ మాంజా (చైనా మాంజా)ను విక్రయిస్తున్న వారిపై నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు మంగళ్‌హాట్ పోలీసులు దాడులు నిర్వహించారు. నిషేధిత మాంజాను విక్రయిస్తున్న ధూల్‌పేట్ పరిస ప్రాంతాల్లోని 18 మాంజా దుకాణాలపై పోలీసులు 18 కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి నిషేధిత మాంజాను స్వాధీన పరచుకున్నారు. రూ.10 లక్షల విలువైన 1000 చెరాక్‌ల నిషేధిత మాంజాను సీజ్ చేశామని పోలీసులు తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు.. వ్యక్తి అరెస్ట్

కుషాయిగూడ: మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఓ కామాంధుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఈ సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. డీఐ సాయిప్రకాశ్‌గౌడ్ తెలిపిన మేరకు.. హెచ్‌బీకాలనీ,భక్షిగూడకు చెందిన విజయ్‌కుమార్ (32) సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అతడికి ఇంకా వివాహం కాలేదు. ఇంట్లో ఒంటరిగా ఉండే విజయ్‌కుమార్ పక్కింట్లో ఉండే సుమారు 10 సంవత్సరాల వయసు కలిగిన బాలికకు పండ్లు, చాకెట్లు ఆశ చూపి ఇంట్లోకి పిలుచుకుని లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన తల్లిదండ్రులు పోలీసులకు అప్పగించారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు కామాంధుడిని రిమాండ్‌కు తరలించారు.

ప్రయాణికురాలి ఆభరణాలు చోరీ

కాచిగూడ: గుంతకల్లు రైలులో ఓ ప్రయాణికురాలి బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన మేరకు.. వికారాబాద్‌లోని కుల్కచర్ల ప్రాంతానికి చెందిన కృష్ణయ్య భార్య విజయలక్ష్మి (28) మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో భోదన్-గుంతకలు రైలు ఎక్కి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో కాచిగూడ రైల్వే స్టేషన్‌లో తన బ్యాగును చూసుకునే సరికి అందులో ఉన్న 2.50 తులాల బంగారు ఆభరణాలు కన్పించలేదు. ఆదివారం విజయలక్ష్మీ కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భూమి ఇప్పిస్తానంటూ యువతికి టోకరా

- మోసం చేసిన రియల్ వ్యాపారి, అతని స్నేహితులు
- బాధితురాలి ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు

వెంగళరావునగర్: భూమి కొనుగోలు చేయిస్తానని యువతిని వద్ద లక్షలాది రూపాయలు తీసుకుని రియల్ వ్యాపారులు మోసం చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లో నివసించే కూన సరస్వతి అనే యువతి స్థానికంగా టెక్స్‌టైల్స్ వ్యాపారం నిర్వహిస్తోంది. ఆమెకు తెలిసిన అశోక్‌రెడ్డి, సాయికుమార్‌ముని అనే ఇద్దరు గత ఏడాది సుబ్బరామిరెడ్డి అనే వ్యక్తిని సరస్వతికి పరిచయం చేశారు. దుర్గాప్రసాద్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని ఆమెకు తెలియజేసి యాదగిరిగుట్ట వద్ద ప్రభుత్వ స్థలం కాంప్లికేట్‌గా ఉందని, దానిని తక్కువరేటుకు ఇప్పిస్తానని చెప్పారు. దాంతో సరస్వతి అక్టోబర్‌లో ఇరువురు స్నేహితుల సమక్షంలోనే దుర్గాప్రసాద్ రెడ్డికి రూ. 34 లక్షలు ఇచ్చింది. వాటిని తీసుకుని వారంలో రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పిన వారు అనంతరం ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదు. నెలరోజుల తర్వాత ఆమెకు అనుమానం వచ్చి ల్యాండ్ చెప్పిన ప్రాంతానికి వెళ్లి చూడగా అక్కడ ఖాళీ ప్రభుత్వ జాగా కనిపించలేదు. దాంతో మోసపోయానని గ్రహించి వారికి ఫోన్ చేసి నిలదీసింది. తనకు ల్యాండ్ వద్దని తన నగదు తనకు వెనక్కు ఇవ్వాలని అడిగింది.

అయితే వారు ఇదిగో అదిగో అంటూ ఆమెను తిప్పుతున్నారు తప్ప డబ్బులు ఇవ్వడంలేదు. విసిగిపోయిన సరస్వతి సీసీఎస్‌లో ఫిర్యాదు చేసింది. సీసీఎస్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేసి ఆదివారం మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు పంపారు. వాస్తవాలు విచారించిన మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితురాలి కారులోని బంగారు ఆభరణాల చోరీ

ఇదిలా ఉండగా కూన సరస్వతి మధురానగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో కారు ఆపి పోలీసులకు ఫిర్యాదు చేసి తిరిగి వచ్చింది. గమనించగా కారు అద్దాలు కిందికి దించి ఉన్నాయి. కారులో తన బ్యాగ్‌ను తీసుకుని పరిశీలించగా అందులో ఉండాల్సిన చేతి ఉంగరాలు, యాపిల్ ఎయిర్ పాడ్స్ కనిపించలేదు. యువతి తిరిగి పోలీస్ స్టేషన్‌కు వచ్చి దొంగతనం జరిగిందంటూ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రహరీని ఢీకొన్న కారు..

మద్యం మత్తులో కారు నడిపిన యువకుడు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బంజారాహిల్స్: మద్యం మత్తులో అదుపుతప్పిన వేగంతో దూసుకెళ్తూ బీఎండబ్ల్యూ కారు ప్రహరీ ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న యువకుడు అదృష్టవశాత్తూ బతికి బయటపడ్డాడు. వివరాలు.. సికింద్రాబాద్ పద్మారావునగర్‌కు చెందిన శ్రీకాంత్‌గౌడ్ (26) అనే యువకుడు శనివారం రాత్రి తన స్నేహితులతో కలిసి హెచ్ఐసీసీ నొవోటెల్‌లో పార్టీ చేసుకున్నాడు. ఆదివారం ఉదయం మద్యం మత్తులో తన స్నేహితులను పంజగుట్టలో వదిలేందుకు తన బీఎండబ్ల్యూ కారులో వెళ్లి పంజగుట్టలో వదిలేసి తిరిగి బంజారాహిల్స్ వైపు వేగంగా దూసుకెళ్తున్నాడు. మజీద్ వద్ద కారు అదుపుతప్పి గోడను ఢీకొట్టింది. బెలూన్ ఓపెన్ కావడంతో శ్రీకాంత్‌గౌడ్ ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శ్రీకాంత్‌గౌడ్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించగా 126 బీఏసీగా నమోదైంది. మద్యం మత్తులో కారు నడిపిన శ్రీకాంత్‌గౌడ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్ నుంచి పడి ప్రయాణికుడు మృతి



ఉప్పల్: ఆర్టీసీ బస్ ఫుట్ బోర్డుపై నుంచి కింద పడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఈ నెల 10వన గుర్తు తెలియని వ్యక్తి (40) ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ఆర్టీసి బస్ ఎక్కాడు. ఫుట్ బోర్డుపైనే నిలుచోవడంతో కండక్టర్ వచ్చి టికెట్ అడిగాడు. టికెట్ కోసం డబ్బులు తీస్తున్న సమయంలో రాజ్యలక్ష్మీ థియేటర్ వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడటంతో అతన్ని 108 సహాయంతో చికిత్స నిమిత్తం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

బాలుడిని కిడ్నాప్ చేసిన సొంత మేనమామ

ఎట్టకేలకు ఇంటికి సురక్షితంగా చేరిన బాలుడు

అల్వాల్: భోగి పండుగ వేళ గాలిపటంతో ఓ బాలుడు ఇంటి నుండి బయటకు వెళ్లి కిడ్నాప్ అయిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ సూర్యనగర్‌లో నివసించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుమారుడు (12) ఆదివారం ఉదయం గాలిపటంతో పాటు సెల్‌ఫోన్ పట్టుకొని ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో తండ్రి కాలనీవాసులకు సమాచారం ఇచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే బాలుడు కనిపించకుండా పోయిన కొద్దిసేపటికి బాలుడు తీసుకెళ్లిన సెల్‌ఫోన్ నుండి తాము బాలుడిని కిడ్నాప్ చేశామంటూ, రూ.20 లక్షలు ఇస్తేనే బాలుడిని వదిలిపెడతామంటూ గుర్తు తెలియని వ్యక్తులు తండ్రికి ఫోన్ చేసి బెదిరించారు. కాలనీవాసులు, పోలీసులు సంఘటనకు సంబంధించి సీసీ కెమెరాలను పరిశీలించగా మారుతీ సెలిరియో కారులో బాలుడి మేనమామే ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కాగా అంతకుముందే కిడ్నాప్ చేసిన బాలుడిని అతని ఇంటి వద్దనే అతని మేనమామ వదిలిపెట్టాడు. కిడ్నాప్ చేసిన బాలుడి మేనమామను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సందిగ్ధంలో ఎన్నికలు

- పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన !
- నెలాఖరుతో ముగియనున్న జీపీ పాలకవర్గం పదవీకాలం
- నగర శివారుల్లోని మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 619 పంచాయతీలు
- ఇప్పట్లో ఎన్నికలు లేనట్టే?

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనున్న నేపథ్యంలోనే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నాయి. అయితే పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం వెల్లడించకపోవటంతో వాయిదా పడతాయేమోనని పంచాయతీ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే జరిగితే...గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి రాగలదని పేర్కొంటున్నారు.

నగర శివారుల్లో 619 పంచాయతీలు

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 619 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామ పంచాయతీల పరిధిలోని 606 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు 800 పోలింగ్‌స్టేషన్లు, 1000 బ్యాలెట్ బాక్సులు, 2 వేల మంది సిబ్బంది.. అలాగే, రంగారెడ్డి జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు 3 వేల పోలింగ్ స్టేషన్లు, 3,500 మంది సిబ్బందిపై అంచనాతో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

రిజర్వేషన్లపై తర్జన భర్జన..

కొత్త ప్రభుత్వం కొలువు దీరిన నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్లపై తర్జనభర్జన జరుగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పంచాయతీ రాజ్ చట్టం - 2019 ప్రకారం పంచాయతీల్లో రిజర్వేషన్లు పదేళ్ల పాటు వర్తిస్తాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తుందా? లేక ఏమైనా మార్పులు చేస్తుందా? అనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. ఒకవేళ చట్టంలో మార్పులు చేస్తే జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించే అవకాశముంటోంది. ఇందుకోసం ప్రస్తుత చట్టాన్ని మార్చాల్సి ఉంది. ఇది జరగాలంటే మరో కొత్త చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలి. ఆపై ఆమోదం పొందాలి. ఇంత ప్రక్రియ జరగాలంటే మరింత సమయం పడుతుంది. ఇప్పుడు అంత సమయం లేదు. ఈ నేపథ్యంలోనే పంచాయతీ ఎన్నికలు సకాలంలో జరగకపోవచ్చు! అనే అభిప్రాయాన్ని అధికార వర్గాలతోపాటు రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది.

'బ్యాలెట్ పోరు'..ప్రహసనం

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితానే ప్రామాణికంగా తీసుకుంటారు. అయితే. దాన్ని పంచాయతీలు, వార్డుల వారీగా విభజించాల్సి ఉంటోంది. కొత్తగా అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన జరిపి తుది జాబితా వెల్లడించడం తప్పనిసరి చేయాల్సి ఉంది. ఎన్నికలు నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు సేకరించాలి. బ్యాలెట్ పత్రాలను ముద్రించాల్సి ఉంది. ఇదంతా జరగాలంటే ఇప్పుడున్న సమయం ఏమాత్రం సరిపోదన్న అభిప్రాయం ఎన్నికల అధికారుల్లో వ్యక్తమవుతోంది. ఈ విషయంలో ఎటు చూసినా ఎన్నికల నిర్వహణ సాధ్యమా? అనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి రావడం ఖాయమని తెలుస్తోంది.

జీపీల్లో రాజకీయ వేడి..

ఈ ఏడాదిలో పంచాయతీ ఎన్నికలు జరగనుండటంతో గ్రామాల్లో రాజకీయ వేడి మొదలైంది. పార్లమెంటు, పంచాయతీ, మండల, జిల్లా ప్రాదేశిక స్థానాలకు ఎన్నికలు వరుసగా జరిగే అవకాశముంది. దీంతో ఏడాదంతా నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్నికల పండుగ వాతావరణం నెలకొననుంది. తొలుత జరిగే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ఇప్పటి నుంచే గ్రామాల్లో ప్రచార కసరత్తుకు సన్నాహాలు చేస్తున్నారు. పార్టీల నాయకులు కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిసారిస్తున్నారు. ఎన్నికలు పార్టీల గుర్తులపై జరగకున్నా... క్షేత్రస్థాయిలో మాత్రం ప్రధాన పార్టీల అండదండలతోనే అభ్యర్థులు బరిలో నిల్చుంటారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల్లో తాము పడిన కష్టానికి ప్రతిఫలంగా తగిన సహకారాన్ని అందించాలని ఆశావహులు నాయకులపై ఒత్తిడి తెస్తున్నారు.

దైవ సన్నిధానంలో అయోధ్య నామస్మరణ


పూజల్లో పాల్గొన్న ఫిలింనగర్ దైవ సన్నిధానం పాలకమండలి సభ్యులు

బంజారాహిల్స్: అయోధ్యలో శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకొని ఫిలింనగర్ దైవ సన్నిధానంలో కొలువుదీరిన శ్రీకోదండ రామస్వామికి ఆదివారం నుంచి విశేష పూజలు చేశారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 22వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం శ్రీసీతారామస్వామి ఉత్సవ మూర్తులకు విశేష స్నపన తిరుమంజరం, అర్చన, మంగళహారతి, రామనామ సంకీర్తన, రామాయణ బాలకాండం ప్రవచనం, విశేష హారతులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ప్రముఖ సినీ మాటల రచయిత పరుచూరి గోపాలకృష్ణ దంపతులు, దైవ సన్నిధానం కోశాధికారి కాజా సూర్యనారాయణ దంపతులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేశారు. అయోధ్య రామనామ స్మరణతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి

జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ యాదవ్


మాట్లాడుతున్న రాజేశ్వర్ యాదవ్

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, బీసీలకు 50 శాతం కేటాయించాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్ యాదవ్ డిమాండ్ చేసారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. అణగారిన వర్గాలకు రాజకీయంగా అవకాశాలు కల్పించాలని సోనియా గాంధీ, ఖర్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు విజ్ఞప్తి చేశారు. బీసీలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి తగిన న్యాయం చేయాలని రాజేశ్వర్ యాదవ్ కోరారు.

నేత్రపర్వంగా అమ్మవారి కల్యాణం


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

వెంకటేశ్వరకాలనీ: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీనగర్ కాలనీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి అమ్మవారి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్చరణలు, డప్పుచప్పుల వాయిద్యాల నడుమ జరిగిన ఈ కల్యాణ క్రతువును వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేశారు. గోదాదేవి అమ్మవారి కల్యాణం నేపథ్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేడుకల్లో భాగంగా ఉదయం ఆలయంలో ఆరాధన, తిరుప్పావై సేవాకాలం అనంతరం ఆరగింపు తీర్థప్రసాద గోష్టి, అర్చన, ఆలయ ద్వార బంధనం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కమనీయం.. గోదా కల్యాణం




పూజల్లో పాల్గొన్న విజయారెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని శ్రీసీతారామస్వామి ఆలయంలో శ్రీగోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణ ఘట్టం కమనీయంగా జరిగింది. జూబ్లీహిల్స్ పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గోదా రంగనాథుల కల్యాణాన్ని వీక్షించి తరించారు.

నారాయణగూడలో...

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని భూలక్ష్మి ఆలయంలో జరిగిన గోదాదేవి కల్యాణ మహోత్సవంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, వేద ఆశీర్వాదం తీసుకున్నారు.

అజహరుద్దీన్ తీరుపై కాంగ్రెస్ శ్రేణుల నిరసన


నిరసన తెలుపుతున్న రహమత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు

రహమత్‌నగర్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మహమ్మద్ అజహరుద్దీన్ పార్టీ కార్యక్రమాలకు తమ నాయకుడు భవానీశంకర్‌కు సమాచారం ఇవ్వక పోవడాన్ని ఆ పార్టీ నాయకులు తప్పుపట్టారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జె.పి.జ్ఞానేశ్వర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గ్యార నాగరాజు, సుందర్ మాట్లాడుతూ... ఆదివారం ఎస్పీఆర్ హిల్స్‌లో నిర్వహించిన గాలి పటాల పంపిణీ కార్యక్రమానికి నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీశంకర్‌ను పిలువక పోవడాన్ని వారు ఖండించారు. శాసనసభ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ అభ్యర్థి అజహరుద్దీన్ తరుపున భవానీశంకర్ విస్తృత ప్రచారం నిర్వహించారని గుర్తు చేశారు. పాతిక సంవత్సరాలు రహమత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ పార్టీ శ్రేణులకు అండగా నిలిచిన భవానీశంకర్‌ను అజహరుద్దీన్ పార్టీ కార్యక్రమాలకు పిలువక పోవడాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని వారు చెప్పారు. కార్యక్రమాలకు పిలువక పోవడం అతన్ని అవమానపర్చినట్లేనని స్పష్టం చేశారు. దీనిపై అజహరుద్దీన్ పార్టీ శ్రేణులకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు రాంబాబు, యాదగిరి, ఆండాళు, మేఘన పద్మ, అరుణ్‌గౌడ్, మాలాకీ, శివ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ

ఖైరతాబాద్: మున్నూరు కాపు సంఘం ఖైరతాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. మున్నూరు కాపు సంఘం సభ్యులు శ్యాంరావు, శివకుమార్, ప్రవీణ్, రమేష్, శ్రీనివాస్, రాజేష్, ఆంజనేయులు, నర్సింహ, సాయిబాబా, వంశీ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో...

ఖైరతాబాద్ యాదవ సంఘం రూపొందించిన నూతన సవంత్సర కేలండర్‌ను ఆదివారం మహంకాళీ అమ్మవారి రాలయంలో ఆవిష్కరించారు. యాదవ సంఘం అధ్యక్షుడు బాలయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి రామయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్ యాదవ్, సలహాదారులు మహేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, సురేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మున్నూరు కాపు సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు


యాదవ సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు


నందినగర్‌లో భోగి మంటలు

నగరానికి సంక్రాంతి శోభ

వాడవాడలా అంబరాన్నంటిన సంబురాలు ● భోగిమంటలతో సందడిచేసిన నగరవాసులు


సోమాజిగూడ కాంతి శిఖర అపార్ట్‌మెంట్స్‌లో..




గౌరీశంకర్ కాలనీలో ముగ్గులు వేస్తున్న మహిళలు

బంజారాహిల్స్: సంక్రాంతి పండుగ సందర్భంగా కాలనీలు, బస్తీలు అన్న తేడాల లేకుండా ఏ వీధిలో చూసినా ముచ్చటగొలిపే రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలే దర్శనమిచ్చాయి. ఆదివారం భోగి పండుగ సందర్భంగా వేకువజామునే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, ఖైరతాబాద్, వెంకటేశ్వరకాలనీ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భోగి వేడుకలను నిర్వహించారు. ముఖ్యంగా కాలనీ, అపార్ట్‌మెంట్ వాసులు భోగిమంటల వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పండుగ వేళ టీటీడీ జూబ్లీహిల్స్ శ్రీవారి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

భారత్ జాగృతి ఆధ్వర్యంలో..

బంజారాహిల్స్: భారత్ జాగృతి ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద తెల్లవారుజామున భోగి పండుగ వేడుకలను వైభవంగా నిర్వహించారు. జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో నగర వ్యాప్తంగా ఉన్న జాగృతి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే పార్కు వద్ద రంగుల రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో సందడి చేశారు. అనంతరం భోగిమంటలను వెలిగించారు. అందరికీ సంక్రాంతి శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, కువైట్ అధ్యక్షుడు ఉదయ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, శ్రీకాంత్, సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, తేజ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 50, పచ్చ కాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 23, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 18, చామగడ్డ 55, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 13, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మహిళలకు చీరల పంపిణీ



లిబర్టీ: ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ కోరారు. లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సంక్రాంతి వేడుకలు నిర్వహించి పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంక్రాంతి పర్వదినం ప్రతి ఒక్కరిలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ సేవాదళ్ విభాగం తెలంగాణ అధ్యక్షురాలు పుష్పాంజలి, డాక్టర్ లక్ష్మీదేవసేన, నవీన్, నంది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పెయింట్ వేస్తూ జారిపడి కూలీకి గాయాలు

వెంగళరావునగర్: పెయింటింగ్ వేస్తున్న కూలీ జారిపడటంతో గాయాలైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీరామ్‌నగర్‌కు చెందిన మహ్మద్ హసన్ అలీ పెయింటర్. ఇటీవల జవహర్‌నగర్‌కు చెందిన సతీష్ అనే వ్యక్తి తన ఇంటికి పెయింటింగ్ వేయడానికి శంకర్, హసన్‌అలీలకు కాంట్రాక్ట్ ఇచ్చాడు. ఆదివారం డాబా పైన అంతస్తుకు హసన్‌అలీ పెయింటింగ్ చేస్తుండగా అతను కిందకు పడకుండా తోటి పెయింటర్ శంకర్ తాడును పట్టుకుని ఉన్నాడు. కొద్దిసేపటికి తాడు బరువు ఎక్కువగా ఉండటంతో శంకర్ పొరబాటుగా తాడు విడిచిపెట్టాడు. దాంతో పై అంతస్తు నుంచి హసన్‌అలీ కింద పడటంతో అతనికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎన్‌యూలో అడ్మిషన్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంతో పాటు పలు చోట్ల తరగతులు నిర్వహిస్తున్న నీట్ విశ్వవిద్యాలయం (ఎన్‌యూ), రానున్న విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లను అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. సైబర్ సెక్యూరిటీలో బీటెక్, ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ వంటి కొత్త కోర్సులతో పాటు కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్‌లో బీటెక్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో బీటెక్, బయోటెక్నాలజీలో బీటెక్, 3, బీబీఏ 4 సంవత్సరాల ఎంబీఎల కోసం అడ్మిషన్లు అందిస్తున్నామన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి


స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ని భారతీయ మజ్దూర్ సంఘ్ ఆటో విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ కలిశారు. ఆదివారం ఆయనను కలిసి అభినందనలు తెలిపి ఆత్మీయ సత్కారం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా శాసనసభలో సమయం కేటాయించాలని విన్నవించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ. 12 వేలు అందేలా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆటో డ్రైవర్లకు రుణాలు ఇప్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు విషయంలో ఆటో డ్రైవర్లకు ప్రాధన్యాత ఇవ్వాలని కోరారు.

సంక్రాంతి ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నింపాలి

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజహరుద్దీన్


స్పీఆర్ హిల్స్‌లో పతంగులను అందజేస్తున్న అజహరుద్దీన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: సంక్రాంతి పండగ ప్రజల జీవితాల్లో సుఖశాంతులను నింపాలని, టీం ఇండియా మాజీ సారథి, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజహరుద్దీన్ ఆకాంక్షించారు. రహమత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎస్పీఆర్ హిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు గాలి పటాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అజహరుద్దీన్ మాట్లాడుతూ... తెలుగు ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనే సంక్రాంతి పండగ మూడు రోజులు పాటు వైభవంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ నాయకులు మన్సూర్, లింగమూర్తి, షరీఫ్, ఎక్బాల్, సుల్తాన్, భాస్కర్, ముబీన్, ఓర్సు అడవయ్య, షేక్ సాబేర్, అహ్మద్, శ్రీనివాస్, సంజీవ్‌రావు, ఇబ్రహీం, యాదగిరి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు రోడ్డు

బోసిపోయిన రహదారులు

పెద్ద పండగ సంక్రాంతికి నగరవాసులంతా పెద్ద ఎత్తున వారి వారి స్వగ్రామాలకు తరలి వెళ్లడంతో నిత్యం ఎంతో రద్దీగా కనిపించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, సోమాజిగూడ రహదారులన్నీ బోసిపోయి కనిపించాయి. ఏ కూడలిలో చూసినా క్షణం కూడా ఆగకుండా వాహనాలు ముందుకు కదిలాయి.

– బంజారాహిల్స్


బంజారాహిల్స్ రోడ్ నెం. 2లో...


పంజగుట్ట ప్రధాన రహదారిలా...

1969 ఉద్యమకారులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి


దుశర్ల సుదర్శన్‌రావు

బంజారాహిల్స్: 1969 తెలంగాణ ఉద్యమకారుల తరపున గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి అంకితభావంతో పనిచేస్తున్న తనకు ఈ దఫా తెలంగాణ ఉద్యమకారుల తరుపున ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమకారుల సమితి సెక్రటరీ జనరల్ దుశర్ల సుదర్శన్‌రావు ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీని కలిసి విజ్ఞప్తి చేశారు. తాము ఎన్నో కష్టనష్టాలకోర్చి పోలీసులతో దెబ్బలుతిని పోలీసు కేసులు నమోదైనా తెలంగాణ కోసం పోరాడామని, 1969 తెలంగాణ ఉద్యమకారులకు ఎప్పుడూ అన్యాయమే జరుగుతుందని, కనీసం ఈ సారైనా న్యాయం చేయాలని ఆయన కోరారు. తాను 1967 నుంచి కాంగ్రెస్ పార్టీకి పనిచేస్తున్నానని, సంజయ్‌గాంధీ, రాజీవ్‌గాంధీలతో మంచి అనుబంధం ఉండేదని, తెలంగాణలో కాంగ్రెస్ ఉన్నా లేకున్నా ఆ పార్టీకి నిబద్ధతతో పనిచేశానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేయడం జరిగిందన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రులతో పనిచేశానని, గాంధీభవన్‌కు ఎప్పుడూ కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. ఈ సారి ఎమ్మెల్సీ అవకాశం తనకు కల్పించడం ద్వారా తెలంగాణ ఉద్యమకారులను గౌరవించినట్లవుతుందని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.

రోహిత్ వేముల వర్ధంతిని దేశవ్యాప్తంగా నిర్వహించాలి

హిమాయత్‌నగర్: దళిత బహుజన విద్యార్థి మేధావి రోహిత్ వేముల చక్రవర్తి 8వ వర్ధంతి సభలను జనవరి 17న దేశ వ్యాప్తంగా నిర్వహించాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) కేంద్రంగా ప్రజాస్వామ్యం, సెక్యూలర్, రిపబ్లిక్, సోషలిస్ట్ భావజాల వాతావరణాన్ని కాపాడుకోవడం కోసం అంబేడ్కర్ ఆశయాలు సాధన కోసం ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, ఏబీవీపీ దోపిడీ రాజకీయాల పైన తిరుగుబాటు చేసిన గొప్ప మేధావి అని, రోహిత్ వేముల త్యాగాలను,స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతకు ట్రోఫీ ప్రదానం



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ సీఎల్పీ నాయకులు దివంగత పి.జనార్ధన్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ డివిజన్‌లో రెండు రోజులుగా నిర్వహించిన పీజేఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నీలో జంట నగరాల నుంచి 60 జట్లు పోటీ పడ్డాయి. విజేతగా నిల్చిన శాఖ స్ట్రైకర్స్ (ఖైరతాబాద్) టీంకు ఫౌండేషన్ చైర్మన్, కార్పొరేటర్ విజయారెడ్డి ట్రోఫీతోపాటు రూ. 25 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. రన్నరప్‌గా నిల్చిన ఇమ్రాన్ సీసీ టీంకు ట్రోఫీతో పాటు రూ. 10 వేల ప్రోత్సాహక బహుమతిని ప్రదానం చేశారు.

వేడుకగా మల్లన్న జాతర

ముషీరాబాద్: భోలక్‌పూర్ బాకారంలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి (మల్లన్న) జాతర మహోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేష్ ముదిరాజ్, పూస గోరఖ్‌నాథ్, జెల్లా భిక్షపతి తదితరులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగతెప్ప ఊరేగింపు, గొలుసులు తెంపుట తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి అతిథులను సన్మానించారు. బీజేపీ నాయకులు ఆర్.విశ్వం, కృష్ణ, భాస్కర్‌గౌడ్, నందగిరి నర్సింహ, రామానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.పార్థసారథి ఆధ్వర్యంలో భోగి సందర్భంగా బాగ్‌లింగంపల్లి చౌరస్తా ముగ్గుల పోటీలను సందడిగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభచాటారు. బీజేపీ రాష్ట్ర నాయకులు నైషదం సత్యనారాయణమూర్తి, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్, గోకమంగళ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందని మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు.

అలరించిన త్యాగరాజ కీర్తనలు


త్యాగరాజ స్వామి కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

చిక్కడపల్లి: నిత్యం సినీ పాటలతో హోరెత్తే త్యాగరాయ గాన సభ ఆదివారం రాత్రి మహా మహా శాస్త్రీయ సంగీతజ్ఞులు ప్రవర్ధమాన బాల గాయకుల గాన మాధుర్యంతో పులకరించింది. సుస్వర సంగీత వేదిక సారథ్యంలో ప్రముఖ వాగ్గేయ కారుడు త్యాగరాజ స్వామి విరచిత కీర్తనలు పలువురు గానం చేశారు. త్యాగరాజ కీర్తనలతో గానసభ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. త్యాగరాజ పంచరత్న కీర్తనలు బృంద గానం చేయగా మరికొందరు వ్యక్తిగతంగా ఆలపించారు. సంస్థాపకురాలు లలిత చంద్రశేఖర కుమారస్వామి తమ లక్ష్యాలను తెలుపుతూ దేశ సంస్కృతి సంగీతాన్ని ఆసియాఖండంలో వ్యాప్తికి ఎంతో మందిని శాస్త్రీయ సంగీతంవైపు ఆకర్షింపచేయడం తమ ధ్యేయని పేర్కొన్నారు. జగదానంద కారక, దుడుకు గల నన్నే దొర కొడుకు బ్రోచురా, సమయానికి తగు మాటలాడునే తదితర పంచరత్న కీర్తనలు ఆలపించారు. ఈ గోష్టి గానం సమ్మోహన పరిచింది. డాక్టర్ మంగళంపల్లి స్వర్ణ విజయలక్ష్మి, రేణుకాదేవి, మాధవి, కళ్యాణి, వాణిశ్రీ, చావలి విజయలక్ష్మి, సుధన్య, శ్రీవర్ధన్, గోష్టి గానంలో పాల్గొన్నారు. వీరస్వామి వశిష్ట కె.ఎల్.ఎస్.మూర్తి, రాయప్రోలు సుధాకర్ వాద్య సహకారం అందించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న గాయకులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు.

వైభవంగా అక్షింతల ఊరేగింపు

సనత్‌నగర్: రామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ సరఫరా చేసిన అయోధ్య రాముడి అక్షింతల వితరణ కార్యక్రమం ఆదివారం బేగంపేట మోతీలాల్ నెహ్రూనగర్‌లో వైభవంగా జరిగింది. ముందుగా కాలనీ పార్కు నుంచి ప్రారంభమైన ఊరేగింపు మహోత్సవం అన్నీ వీధుల్లో కొనసాగింది. ఊరేగింపు పొడవునా జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగగా కాలనీ పరిసరాలు ఆధ్యాత్మిక సంద్రంలో మునిగితేలాయి. భక్తులు భక్తిప్రపత్తులతో హారతులు పట్టి అక్షింతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సంజయ్ చల్లా, కోశాధికారి చంద్రశేఖర్, విశాల్ సూదం, నరేష్‌భట్ పాల్గొన్నారు.

ఇసుక బకాసురుడు చంద్రబాబు | తవ్వుకో.. తినుకో!

ఇసుక ఉచితమంటూ ఊడ్చేశారు • పచ్చ ముఠా లూటీ రూ.10 వేల కోట్లు

- గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు బేఖాతర్
- ఆర్థిక శాఖ ఆమోదం, మంత్రి మండలి తీర్మానం లేదు
- 'ప్రత్యేక మెమో'ముసుగులో యథేచ్ఛగా దోపిడీ
- ఏ1 పీతల సుజాత, ఏ 2 చంద్రబాబు, ఏ 3 చింతమనేని, ఏ 4 దేవినేని ఉమా
- నేడు పారదర్శక విధానాలతో ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం



సాక్షి, అమరావతి: ఇసుక నుంచి తైలం పిండటంలో నిజమెంత ఉందో తెలియదుగానీ ఇసుక నుంచి వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టవచ్చని చంద్రబాబు నిరూపించారు. అది కూడా ఇసుక ఉచితం అని బురిడీ కొట్టించి దోపిడీకి పాల్పడటం ఆయనకే సాధ్యమైంది. తాను అక్రమంగా నివాసం ఉంటున్న కరకట్ట ఇంటి వెనుకే వేల కొద్దీ లారీల్లో ఇసుక తరలిపోతున్నా గుడ్లప్పగించి చూశారు. టీడీపీ హయాంలో 'ఉచిత ఇసుక విధానం'ముసుగులో పచ్చ ముఠా సాగించిన దోపిడీని సీఐడీ పూర్తి ఆధారాలతో సహా బట్టబయలు చేసింది. కేంద్ర చట్టాలు, గ్రీన్ ట్రిబ్యునల్ విధివిధానాలను ఉల్లంఘించి కేబినెట్ ఆమోదం కూడా లేకుండా 'ప్రత్యేక మెమో'ద్వారా చంద్రబాబు చేసిన లూటీ ఆధారాలతో బహిర్గతమైంది. 2016 నుంచి 2019 వరకు ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా చంద్రబాబు ముఠా ఏకంగా రూ.10 వేల కోట్ల విలువైన ఇసుక దోపిడీకి పాల్పడిందన్నది నిగ్గు తేలింది.

అంతులేని ధన దాహం

2014లో టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు కన్ను ఇసుక రీచ్‌లపై పడింది. అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడినా ఆయన సంతృప్తి చెందలేదు. దీంతో ఇసుక విధానాన్ని పునఃసమీక్షించాలని కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. కొత్త ఇసుక విధానాన్ని నిర్ణయిస్తూ 2016 జనవరి 15న రెండు జీవోలు (జీవో నంబర్లు 19, 20) జారీ చేశారు. అయినప్పటికీ చంద్రబాబు ఇసుక దాహం తీరలేదు. బరితెగించి ఇసుక దోపిడీకి పాల్పడేందుకు మరో విధానాన్ని తీసుకురావాలని భావించారు. 'ఇసుకను ప్రభుత్వం అమ్మదు.. ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు అవసరం లేదు.. ఎవరికి వారు ఇసుక రీచ్‌లకు వెళ్లి ఇసుక తవ్వుకోవచ్చు.. అమ్ముకోవచ్చు.. ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు, ఆంక్షలు విధించదు'అని చెబుతూ 2016 మార్చి 4న ఉచిత ఇసుక విధానాన్ని తెచ్చి దొరికిన చోట దొరికినట్లు దోచుకున్నారు. ఇసుక రీచ్‌లు అన్నింటినీ చంద్రబాబు తన చేతిలోకి, మంత్రివర్గ సభ్యులు, టీడీపీ ఎమ్మెల్యేల ఆధీనంలోకి తీసుకొచ్చారు.

ఏ1: పీతల సుజాత
(టీడీపీ ప్రభుత్వంలో గనుల శాఖ మంత్రి)
ఏ2: నారా చంద్రబాబు
(టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి)
ఏ3: చింతమనేని ప్రభాకర్
(టీడీపీ మాజీ ఎమ్మెల్యే)
ఏ4: దేవినేని ఉమామహేశ్వరరావు
(టీడీపీ ప్రభుత్వంలో జల వనరుల శాఖ మంత్రి)

ప్రధాన సెక్షన్లు ఇవీ...

చంద్రబాబు, ఇతర నిందితులపై నమోదు చేసిన సెక్షన్లు..
ఐపీసీ సెక్షన్లు 120 బి, 409 రెడ్ విత్ 34, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13 (1) (డి) రెడ్‌విత్ 13 (2)

మూడు మార్గాలు బేఖాతర్..

భారీ ఇసుక దోపిడీ కోసం చంద్రబాబు అన్ని నిబంధనలను ఉల్లంఘించారు. ఒక 'మెమో'తో ఇసుక దోపిడీకి పన్నాగం పన్నారు. కేంద్ర ప్రభుత్వ చట్టానికి లోబడే ఇసుక తవ్వకాల కోసం విధానాలు రూపొందించాలి. అందుకు నిర్దేశించిన మూడు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఒకటి ఎంపిక చేసుకోవాలి. ఇసుక తవ్వకాల కోసం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ రూపొందించిన బిజినెస్ రూల్స్ (మార్గదర్శకాలు) అనుసరించాలి. అంతకంటే మెరుగైన విధానం రూపొందించామని రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తే ఆమేరకు ఆర్థిక శాఖ ఆమోదం పొందాలి. ఓ విధానాన్ని రూపొందించి అందుకు కేబినెట్ ఆమోదం పొందాలి. చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా తెచ్చిన 'ఉచిత ఇసుక విధానం'కోసం ఈ మూడింటిలో ఏ ఒక్కటీ పాటించలేదు.

మెమో 3066తో కనికట్టు

'ఉచిత ఇసుక విధానం'విధానాన్ని తెస్తూ టీడీపీ ప్రభుత్వం 2016 మార్చి 4న ప్రత్యేకంగా 'మెమో 3066'జారీ చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లన్నీ చంద్రబాబు, ఆయన మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు హస్తగతం చేసుకున్నారు. సహజ వనరులు, రాష్ట్ర ఖజానాకు కీలకమైన ఆర్థిక వనరుకు సంబంధించి కేబినెట్ ఆమోదం లేకుండానే అడ్డగోలుగా కేవలం ఒక మెమోను సాకుగా చూపి రంగంలోకి దిగారు. ఈ మెమో ద్వారా 2016 నుంచి 2019 వరకు అడ్డూ అదుపు లేకుండా ఇసుకను కొల్లగొట్టారు. రేట్లపై, తవ్వకాలపై నియంత్రణ లేదు. జిల్లాల వారీగా ఇసుక రీచ్‌లలో ఎవరెవరు తవ్వుకోవాలో చంద్రబాబు స్వయంగా తన బినామీలు, సన్నిహితులు, టీడీపీ ఎమ్మెల్యేలకు అప్పగించారు. ఒక్కసారిగా భారీ యంత్రాలను ఇసుక తవ్వకాల కోసం తెచ్చారు. ఇతరులు ఎవరూ ఆ ఇసుక రీచ్‌ల వైపు కన్నెత్తి కూడా చూడకుండా కట్టడి చేశారు. చంద్రబాబు ముఠా రోజూ వేల లారీల్లో లక్షల టన్నుల ఇసుకను తవ్వేసి అమ్ముకుంది. రాష్ట్రంలో నదుల్లో అందుబాటులో ఉన్న ఇసుక ఎంత..? రోజుకు ఎంత తవ్వుతున్నారు? ఎంతకు అమ్ముతున్నారు? ఎన్ని వేల లారీల ఇసుక రోజూ రాష్ట్రం దాటుతోంది? అనేదానికి అంతూపొంతూ లేకుండా పోయింది.

అడ్డుకున్న మహిళా అధికారి వనజాక్షిపై దాడి..

ఇసుక దోపిడీ కుట్రకు చంద్రబాబు సూత్రధారి కాగా అప్పటి గనుల శాఖ మంత్రి పీతల సుజాత, నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు మరికొందరు ప్రధాన పాత్రధారులుగా వ్యవహరించారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. అక్రమ ఇసుక తవ్వకాలను ప్రశ్నించినందుకు తహశీల్దార్ వనజాక్షిని టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జుత్తు పట్టుకుని మరీ దాడికి పాల్పడ్డారు. తహశీల్దార్‌పై దాడికి పాల్పడిన తన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను నాటి సీఎం చంద్రబాబు సమర్థించడం విస్మయ పరిచింది. తమ ఇసుక దోపిడీకి అడ్డు వస్తే ఎవరికైనా అదే గతి పడుతుందని సందేశం ఇచ్చేందుకే చంద్రబాబు అలా వ్యవహరించారు.

ఆ ఆదాయం ఏమైంది?

గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం ఇసుక తవ్వకాల ద్వారా ఖజానాకు నాలుగు రకాల ఆదాయం రావాలి. సీనరేజీ, కన్సిడరేషన్ చార్జీలు, డిస్ట్రిక్ట్ మైన్స్ ఫండ్, మెరిట్ ఫీజు చెల్లించాలి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను పాటిస్తూ కొత్త ఇసుక విధానాన్ని తెచ్చింది. దూరాన్ని బట్టి ఏ రీచ్ నుంచి ఎంత చార్జీ అనే అంశాన్ని నిర్ణయించి పారదర్శకంగా ప్రకటిస్తోంది. దీంతో రాష్ట్ర ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ ప్రకారం టీడీపీ హయాంలో 2016 నుంచి 2019 వరకు కనీసం రూ.వెయ్యి కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకు రావాల్సి ఉంటుందని గనుల శాఖ అంచనా వేసింది. చంద్రబాబు 'ఉచిత ఇసుక'అనే మోసపూరిత విధానంతో ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల గండిపడింది. ఇక రాష్ట్రంలో యథేచ్ఛగా తవ్విన ఇసుక ఎంతనే అంచనాలు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. 2016 నుంచి 2019 వరకు చంద్రబాబు ముఠా రాష్ట్రంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఇసుకను తవ్వి అమ్మేసుకుందన్నది విస్మయం కలిగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పక్కా ఆధారాలతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో సీఐడీ తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రాజ్యసభలో టీడీపీ అడ్రస్ గల్లంతే..

ఏప్రిల్ 2తో పూర్తికానున్న టీడీపీ సభ్యుడు 'కనకమేడల' పదవీకాలం

- వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి, బీజేపీ సభ్యుడు సీఎం రమేష్‌ల పదవీకాలం ముగిసేదీ అప్పుడే
- రాష్ట్ర కోటాలో ఖాళీ అయ్యే ఈ మూడు స్థానాలకు ఫిబ్రవరి ఆఖరు లేదా మార్చిలో ఎన్నికలు
- అసెంబ్లీలో సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే
- దీంతో రాష్ట్ర కోటాలోని 11 స్థానాలు వైఎస్సార్‌సీపీ పరం



సాక్షి, అమరావతి: రాజ్యసభలో తెలుగుదేశం పార్టీ అడ్రస్ వచ్చే మార్చి తర్వాత గల్లంతు కానుంది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ అంటే గత 41 ఏళ్లలో రాజ్యసభలో ఆ పార్టీకి సభ్యులు లేకపోవడం ఇదే తొలిసారి అవుతుంది. నిజానికి.. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు ఆ పార్టీని చేజిక్కించుకున్న తర్వాత తెలుగుదేశం క్రమంగా ప్రాభవం కోల్పోతూ వస్తోంది. ఈ నేపథ్యంలో.. త్వరలో ఖాళీకానున్న మూడు రాజ్యసభ స్థానాలూ అసెంబ్లీలో సంఖ్యా బలం ద్వారా వైఎస్సార్‌సీపీనే కైవసం చేసుకుంటుంది. దీంతో రాజ్యసభలో టీడీపీ తొలిసారిగా కనుమరుగు కావడం ఖాయం.

రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 250 లోపు ఉండాలి. ప్రస్తుతమున్న సభ్యుల సంఖ్య 245. ఇందులో 233 మందిని ఆయా రాష్ట్రాల శాసనసభ్యులు ఎన్నుకుంటారు. మిగతా 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యుల సంఖ్య 11. ఇక రాజ్యసభలో 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి ఇద్దరు.. టీడీపీకి 9 మంది సభ్యులు ఉండేవారు. రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 151 శాసనసభ స్థానాల్లో ఘనవిజయం సాధించగా.. టీడీపీ 23 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని మచ్చిక చేసుకుని కేసుల నుంచి బయటపడేందుకు టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సుజనా చౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేశ్‌లను బీజేపీలోకి ఫిరాయించేలా చంద్రబాబు పావులు కదిపారు. ఇక రాష్ట్ర కోటాలో ఎన్నికైన రాజ్యసభ సభ్యుల్లో 2020లో నలుగురు (టీడీపీ), 2022లో నలుగురు (ముగ్గురు టీడీపీ, ఒకరు వైఎస్సార్‌సీపీ) పదవీకాలం పూర్తవడంతో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. నాడు అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ఎనిమిది రాజ్యసభ స్థానాలు ఆ పార్టీకే దక్కాయి. ఇందులో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి సామాజిక న్యాయమంటే ఇదీ అని సీఎం వైఎస్ జగన్ దేశానికి చాటిచెప్పారు.

ఆ మూడూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే..

ఇదిలా ఉంటే.. ఏప్రిల్ 2 నాటికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వైఎస్సార్‌సీపీ), సీఎం రమేష్ (బీజేపీ), కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ)ల పదవీకాలం పూర్తికానుంది. ఖాళీ అయ్యే ఈ మూడు స్థానాలకు ఫిబ్రవరి ఆఖరు లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేయనుంది. రాజ్యసభకు ఎన్నికకు కావాలంటే 44 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. ప్రస్తుతం శాసనసభలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే.. ఈ మూడు స్థానాలు ఆ పార్టీ ఖాతాలో చేరడం ఖాయం. దీంతో రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ బలం 11కు చేరనుంది. అంటే రాష్ట్ర కోటాలో సీట్లన్నీ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే చేరుతాయి. టీడీపీ ఉనికే లేకుండాపోతుంది.

రేపు శ్రీవారి పార్వేట ఉత్సవం

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి పార్వేట ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. అదేరోజు గోదాపరిణయోత్సవం విశేషంగా జరుగనుంది. గోదాపరిణయోత్సవం సందర్భంగా ఉదయం తొమ్మిది గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్ద జీయ్యర్‌స్వామి మఠం నుంచి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకు వెళ్లి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు శ్రీ మలయప్పస్వామివారు, శ్రీ కృష్ణస్వామివారు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానం, పార్వేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారు ఆలయానికి చేరుకుంటారు. కాగా, పార్వేట ఉత్సవం కారణంగా ఈ నెల 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

నగర వార్తలు

ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసిన లక్ష్మణ్



దేవాలయ ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: లోక కల్యాణార్థం ఉపవాస దీక్ష చేపట్టి అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగస్వాములు కాబోతున్న ప్రధాని నరేంద్రమోదీ కారణజన్ముడని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా బీజేపీ జాతీయ కార్యవర్గం పిలుపుమేరకు ఆదివారం గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్‌లోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణాన్ని ఆయన శుభ్రపరిచారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ భవ్యమైన రామమందిర నిర్మాణానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉందని అందరికీ ఆ రాముడే శ్రీరామరక్షని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.పావని, నేతలు ఎ.వినయ్‌కుమార్, రమేష్‌రామ్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఆకుల సురేందర్, స్వామిరెడ్డి, ఎండీ మహమూద్, నర్సింహా, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లీనెస్ట్ సిటీ విభాగంలో మేడ్చల్‌కు ద్వితీయ స్థానం




మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం

మేడ్చల్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మేడ్చల్ పట్టణం దక్షిణ భారతదేశంలో క్లీనెస్ట్ సిటీ విభాగంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్థానాలలో మేడ్చల్ రెండవ స్థానంలో నిలిచిందని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. 25,000 నుండి 50,000 జనాభా గల పట్టణాల కేటగిరీలో మేడ్చల్ కు ఈ అవార్డు లభించిందన్నారు. మేడ్చల్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించిన పట్టణ ప్రజలకు మున్సిపల్ సిబ్బందికి మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహ్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ వైర్లకు పతంగుల షాక్

- వైర్ల మధ్య చిక్కుకుంటున్న గాలిపటాలు
- షార్ట్‌సర్క్యూట్‌లు.. సరఫరాకు అంతరాయం
- ప్రమాదాల బారిన పిల్లలు, పక్షులు, వాహనదారులు



సాక్షి, సిటీబ్యూరో: కరెంట్ వైర్లకు పతంగ్‌లు షాక్ కొడుతున్నాయి. పిల్లలు సరదాగా ఎగరేస్తున్న ఈ గాలిపటాలు తీరా విద్యుత్ వైర్ల మధ్య చిక్కుకుంటున్నాయి. వాటిని కిందకి బలంగా లాగడంతో ఒక దానికొక వైరు తగిలి షార్ట్‌సర్క్యూట్‌లు తలెత్తుతున్నాయి. ఫీడర్లు ట్రిప్పవుతూ ఆ పరిధిలో ఉన్న గృహ, వాణిజ్య సంస్థలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. సంక్రాంతి నేపథ్యంలో చిన్న పెద్దలంతా కలిసి ఇంటిపై నిలబడి పతంగ్‌లు ఎగరవేయడం తెలిసిందే. కొంత ఎత్తుకు ఎగిరిన తర్వాత వీటిలో కొన్ని దారం తెగి కింద పడుతుండగా, మరికొన్ని గాలి వేగానికి కిందికి వాలుతున్నాయి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వీధుల్లో ఉన్న లైన్ల మధ్య ఈ పతంగ్‌లు చిక్కుతూ సరఫరాలో అంతరాయానికి కారణమవుతున్నాయి. గత రెండు రోజులుగా గ్రేటర్‌లో వెలుగు చూస్తున్న విద్యుత్ అంతరాయాలకు ఈ పతంగ్‌లే కారణమని ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. పతంగ్‌ల కారణంగా ఆదివారం హైదరాబాద్ సౌత్, సెంట్రల్, బంజారాహిల్స్, సరూర్‌నగర్, రాజేంద్రనగర్, సైబర్‌సిటీ, సికింద్రాబాద్, హబ్సిగూడ, మేడ్చల్ సర్కిళ్ల పరిధిలో కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సబ్‌స్టేషన్‌లోని ఒక ఫీడర్ ఆన్ చేసిన వెంటనే మరో ఫీడర్ పడిపోతూ సెంట్రల్ బ్రేక్ డౌన్ బృందాలకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి.

తాజాగా మరో ఇద్దరు మృతి

ఇంటిపై నిలబడి పతంగ్‌లు ఎగరవేస్తూ ప్రమాదవశాత్తూ పలువురు చిన్నారులు కాలుజారి కింద పడుతున్నారు. కొంత మంది తీవ్ర, గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుంటే...మరికొంత మందైతే ఏకంగా మృత్యువాత పడుతున్నారు. ఇంటి ముందు నుంచి వెళ్తున్న లైన్ల మధ్య చిక్కుకున్న పతంగ్‌లనే కాదు...డిస్ట్రిబ్యూషన్ సబ్‌స్టేషన్ వైర్ల మధ్య చిక్కుకున్న పతంగ్‌లను తీసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురవుతున్నారు. శనివారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని నాగోల్‌లో ఇంటిపై నిలబడి పతంగ్‌లు ఎగరేస్తూ ప్రమాదవశాత్తూ శివకుమార్ (13) మృతి చెందగా, రాజేంద్రనగర్ పరిధిలోని లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్‌పై అదే ప్రాంతానికి చెందిన తనిష్క్(11) గాలిపటం ఎగరేస్తూ ప్రమాదవశాత్తూ సమీపంలో ఉన్న ఏసీ బాక్స్‌కు తగిలి కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. తాజాగా ఆదివారం లంగర్‌హౌస్ ఫ్లై ఓవర్‌పై ప్రయాణిస్తున్న ఆర్మీ ఉద్యోగి కోటేశ్వర్‌రావుకు చైనా మాంజా తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. పతంగ్‌లను ఎగరేసేందుకు ప్రమాదకరమైన చైనా మాంజాను వాడుతుండటం, ఆకాశంలో ఎగిరే పక్షులు, రోడ్డుపై వాహనాలపై వెళ్లే ప్రయాణికులు ఈ చైనా మాంజా ఉచ్చుకు చిక్కుకుని ప్రమాదాల బారినపడుతున్నారు. నిజానికి చైనా మాంజా వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినప్పటికీ...మార్కెట్లో విచ్చలవిడిగా అమ్మకాలు జరు గుతూనే ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీటిని గుర్తించి, విక్రయ దారులను అదుపులోకి తీసుకుంటున్నా..అమ్మకాలు మాత్రం ఆగడం లేదు. ఫలితంగా వీటి ఉచ్చుకు చిక్కుకుని పక్షులే కాదు..టూ వీలర్‌పై వెళ్లే ప్రయాణికులు మృత్యువాతపడాల్సి వస్తుంది.ఇదిలా ఉండగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా, బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు.

కరెంట్ సమస్యలపై అత్యవసర సమావేశం

కరెంట్ కోతలపై డిస్కం సీఎండీ సంబంధిత అధికారులతో ఆదివారం అత్యవసర సమావేశం అయ్యారు. పతంగ్‌ల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. అధికారులంతా వినియో గదారులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కరెంట్ సరఫరాలో హెచ్చు తగ్గులు, షార్ట్‌సర్క్యూట్, ఇతర ప్రమాదాలపై సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్కిళ్ల వారిగా సీబీడీ గ్యాంగ్‌లను అందుబాటులో ఉంచుతున్నట్లు ప్రకటించారు. సర్కిళ్ల వారిగా ఫోన్ నంబర్లు ప్రకటించారు.

- హైదరాబాద్ సెంట్రల్ (హైదర్‌గూడ, హిమాయత్‌నగర్, రెడ్‌హిల్స్, చిక్కడపల్లి, విద్యానగర్, మెహిదీపట్నం, ఏసీగార్డ్స్, మోతిమహల్, రేతిబౌలి, నాంపల్లి, నారాయణగూడ) 9491629047.
- హైదరాబాద్ సౌత్(బేగంబజార్, తూర్పుబజార్, అబిడ్స్, కోఠి, కిల్వాత్, ఫలక్‌నుమా, చంచల్‌గూడ, మలక్‌పేట) 9491628269.
- సికింద్రాబాద్ సర్కిల్(పార్యడైజ్, ఐడీపీఎల్, ప్రాగాటూల్స్, బోయన్‌పల్లి, బన్సిలాల్‌పేట్, అల్వాల్, మచ్చబొల్లారం. నెహ్రూనగర్, బేగంపేట్, బాలానగర్, సీతాఫల్‌మండీ, చిలకలగూడ)9491629380.
- బంజారాహిల్స్ సర్కిల్(జూబ్లిహిల్స్, ఎర్రగడ్డ, గ్రీన్‌లాండ్స్, మోతినగర్, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట్, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట్, సనత్‌నగర్, బోరబండ, మాదాపూర్, ఫిలింనగర్, యూసూఫ్‌గూడ, కళ్యాణ్‌నగర్, శ్రీనగర్‌కాలనీ) 9491633294.
- సైబర్‌సిటీ సర్కిల్(గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, మణికొండ, మాదాపూర్, కొండాపూర్, కేపీహెచ్‌బీ, చందానగర్, వసంతనగర్, ఇబ్రహీంబాగ్) 9493193149.
- రాజేంద్రనగర్ సర్కిల్(కాటేదాన్, శివరాంపల్లి, మైలార్‌దేవులపల్లి, అత్తాపూర్, జల్‌పల్లి, బాలాపూర్, పహడిషరీఫ్)7382100322.
- సరూర్‌నగర్ సర్కిల్(చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డి, బడంగ్‌పేట్, మీర్‌పేట్, ఎల్బీనగర్, కొత్తపేట్, ఆటోనగర్, తుర్కయాంజాల్, ఇంజాపూర్) 7901679095.
- హబ్సిగూడ సర్కిల్(సైనిక్‌పురి, నాచారం, బోడుప్పల్, ఉప్పల్, మల్లాపూర్, రామంతాపూర్, మల్కాజ్‌గిరి, మౌలాలి, యాప్రాల్) 9491039018.
- మేడ్చల్ సర్కిల్(కూకట్‌పల్లి, మియాపూర్, నిజాంపేట్, జీడిమెట్ల, డీపీపల్లి, కొంపల్లి, గాజులరామారం)7382618971.

సంక్రాంతి వేళ గోల్కొండకు పర్యాటకుల శోభ



గోల్కొండ: సంక్రాంతి పండుగ పూట చారిత్రకత్మక ప్రాంతమైన గోల్కొండ కోట పర్యాటక శోభ సంతరించుకుంది. ఆదివారం కోటకు వేల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో ఉదయం 7 గంటల నుంచే పెద్ద సంఖ్యలో పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కోట మెయిన్‌గేట్ తెరుచుకునేంత వరకు రోడ్డుపైనే పర్యాటకులు బారులు తీరారు. కోటలోని క్లాపింగ్ పోర్టికో వద్ద పర్యాటకులు గుంపులుగుంపులుగా అక్కడ ఉన్న భారీ ఫిరంగీలతో పాటు పైన ఉన్న క్లాపింగ్ పోర్టికోను చూస్తూ సుమారు గంట పాటు అక్కడే ఉన్నారు. ఫిరంగి వద్ద సెల్ఫీలు తీసుకోవడానికి ఒకరికొకరు పోటీలు పడ్డారు. క్లాపింగ్ పోర్టికో ఎదురుగా ఉన్న ఆయుధాగారంలో భద్రపరచిన కుతుబ్‌షాహిరాజుల నాటి ఆయుధాలను ఆసక్తిగా తిలకించారు. నగినాబాగ్‌లోని అక్కన్నమాదన్న కార్యాలయాన్ని సైతం ఎంతో ఆశ్చర్యంగా తిలరించారు. పక్కనే ఉన్న నాగదేవత పుట్టకు పూజలు నిర్వహించిన పర్యాటకులు మెట్ల భాగాన గోల్కొండ కోటపైకి ఎక్కడం ప్రారంభించారు. మెట్ల పక్కన ఉన్న రామదాసు చరసాలను సందర్శించి భక్త రామదాసును బందీగా ఉంచిన చరసాల ఇదేనా అంటూ అక్కడ ఉన్న గైడ్‌లను ప్రశ్నించారు.

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యాత్రమంలో 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో వేసిన చిత్రాలను ఆర్ట్ ఎగ్జిబిషన్ పేరుతో పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శన ఉపాధ్యాయులను, ఆహుతులను, సహచర విద్యార్థులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచనాత్మక పెయింటింగ్స్‌తో ఆకట్టుకున్న విద్యార్థులకు ప్రశంసలు లభించాయి. నీటిని, విద్యుత్‌ను సంరక్షించుకునే తీరుతో విద్యార్థులు ఆలోచనాత్మక పెయింటింగ్స్ వేశారు. అలాగే కాలుష్య నివారణ, పర్యావరణ



పరిరక్షణపై వేసిన పెయింటింగ్స్ ఇట్టే కట్టిపడేశాయి. దేవుళ్లపై వేసిన పెయింటింగ్స్ కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి. అలాగే విలువలు పెంపొందించుకునే రీతిలో కొంతమంది విద్యార్థులు తమదైన శైలిలో పెయింటింగ్స్ వేశారు. ఇక శ్రీరామ శ్రీరామ అంటూ రామకోటి రాసుకునే రీతిలో తొమ్మిదో తరగతి విద్యార్థిని శ్రీక్షేత్ర చాగర్లమూడి రాముడు హనుమంతుణ్ణి హత్తుకునేవిధంగా రామకోటితో వేసిన బొమ్మ అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఈ విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను స్కూల్ చైర్మన్ గోపాలకృష్ణన్, ప్రిన్సిపాల్ అరుణశ్రీ తిలకించి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు.

తెలంగాణ సంస్కృతిని చాటేందుకు కృషి



వేడుకలను ప్రారంభిస్తున్న వనం సత్యేందర్, హన్మంతరావు, ఏనుగుల రాజేందర్ కుమార్

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతిని చాటేందుకు నిరంతరం కృషి చేస్తామని సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు, కోశాధికారి ఏనుగుల రాజేందర్‌కుమార్ పేర్కొన్నారు. 46 రోజుల పాటు కొనసాగే నుమాయిష్‌లో పలు విధాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు చాటుతున్నామన్నారు. ఆదివారం భోగి వేడుకల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలు ప్రారంభించిన వనం సత్యేందర్, హన్మంతరావు, ఏనుగుల రాజేందర్‌కుమార్‌లు మాట్లాడుతూ.... తమ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ నలుమూలలా మహిళా అభివృద్ధి కోసం, మహిళా ప్రగతి కోసం పలు విద్యాసంస్థలను కొనసాగిస్తున్నామన్నారు. సామాజిక దృక్పథంతో ఎగ్జిబిషన్ సొసైటీ ముందుకు కొనసాగుతుందన్నారు. సంక్రాంతి సంబరాలు, రంగోళి వేడుకు, విద్యార్థులకు పలు విభాగాల పోటీలు, గజల్స్ కార్యక్రమాలతో పాటు క్రీడలు కూడా నిర్వహించి క్రీడాకారులను కూడా ప్రోత్సహిస్తున్నామని వారన్నారు. ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకులకు ఎలాంటి వైద్య సౌకర్యాలు కావాలన్నా డాక్టర్ల బృందం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సందర్శకులను అహ్లాదపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రజిత్ సింగ్‌తో పాటు వినయ్‌కుమార్ ముధిరాజ్, అశ్వక్‌హైదర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 15-1-2024

సన్నిధి



సంక్రాంతి వైభవాన్ని కనుమా!

భారతీయులు అందులోనూ దాక్షిణాత్యులు, ముఖ్యంగా తెలుగువారు సంక్రాంతిని ఎంతో వైభవోపేతంగా చేసుకుంటారు. ఆడపడుచులు, అల్లుళ్లతో సహా సంక్రాంతికి మాత్రం తమ స్వగ్రామాలకి చేరుకుంటారు అందరు. సంక్రాంతి వైభవం అంతా పల్లెలలో చూడాలి.

సంక్రాంతి పండుగ సమయానికి పంటలు ఇంటికి వచ్చి రైతులు, వ్యవసాయ కూలీలు గ్రామంలో ఉన్న అందరు కూడా పచ్చగా ఉంటారు. ప్రకృతి కూడా పచ్చగా కంటికి ఇంపుగా ఆహ్లాదకరంగా ఉంటుంది. పొలం పనులు పూర్తి అయి కాస్త విశ్రాంతి తీసుకునే వీలుండటంతో సందడి, సంబరాలు. తమకి ఇంతటి భద్రత కలగటానికి మూలమైన భూమిని, రైతులను, కూలీలను, పాలేర్లను, పశువులను, పక్షులను అన్నింటికి కృతజ్ఞతను తెలియచేయటం, తమ సంపదను సాటివారితో బంధుమిత్రులతో పంచుకోవటం ఈ వేడుకల్లో కనపడుతుంది.

భారతీయులు చాంద్రమానంతో పాటు కొన్ని సందర్భాలలో సూర్యమానాన్ని కూడా అనుసరిస్తారు. అటువంటి వాటిల్లో ప్రధానమైనది మకరసంక్రమణం. మకరసంక్రమణంతో సూర్యుడి గమనం దిశ మారుతుంది. అప్పటి వరకు దక్షిణదిశగా నడచిన నడక ఉత్తర దిక్కుగా మళ్ళుతుంది. అందుకే ఆ రోజు నుండి ఆరునెలలు ఉత్తరాయణం అంటారు. అప్పటికి ఆరునెలలనుండి దక్షిణాయనం. ఈ పుణ్య సమయంలో చేయవలసిన విధులు కూడా ఉన్నాయి. వాటన్నింటిని సంక్రాంతి సంబరాల్లో మేళవించటం జరిగింది.

■ **విధులు**

అంతరిక్షంలో జరిగే ఖగోళవిశేషాల ననుసరించి ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగుణంగా మనుషులు చేయవలసిన పనులను పండుగ విధులుగా చెప్పటం మన ఋషుల ఘనత. అవి మనిషి వ్యక్తిగత, కుటుంబపరమైన, సామాజిక క్షేమాలని కలిగించేవిగాను ఖగోళ, ఆయుర్వేద, ఆర్థిక మొదలైన శాస్త్రవిజ్ఞాన్ని అందించేవిగా ఉంటాయి. ఆధ్యాత్మికంగా ఉన్నతస్థాయికి ఎదగటానికి సహాయం చేసేవిగా ఉంటాయి. మన పండుగలు బహుళార్థసాధక ప్రణాళికలు. అన్నింటిని సమీకరించి ఎప్పుడేం చెయ్యాలో చక్కగా చెప్పారు.

■ **పెద్దపండగ**

సంక్రాతిని పెద్దపండగ అంటారు. చాలా పెద్ద ఎత్తున చేసుకోవటంతో పాటు ఎక్కువ రోజులు చేసుకుంటారు. సంక్రమణం జరిగే రోజు పండుగ, ముందురోజు భోగి, మూడవ రోజు కనుము. నాలుగవ రోజు ముక్కనుము. నిజానికి పండుగ వాతావరణం నెలరోజుల ముందు నుండే నెలకొంటుంది.

■ **నెల పట్టటం**

సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించినప్పటి నుండి ధనుర్మాసం అంటారు. అది డిసెంబరు 15వ తేదీ కాని, 16 వ తేదీ కాని అవుతుంది. అప్పటి నుండి మకర సంక్రమణం వరకు అంటే జనవరి 14వ తేదీ వరకు కాని, 15 వ తేదీ వరకు కాని ఉండే ధనుర్మాసం అంతా ప్రత్యేకం



గానే కనపడుతుంది. దీనిని 'నెలపట్టటం' అని అంటారు. అంటే ఈ నెల అంతా ఒక ప్రత్యేక మైన పద్ధతిని పాటిస్తామని చెప్పటం. ఇళ్ల ముందు ఆవుపేడ కళ్ళాపిలో అందంగా తీర్చి దిద్దిన రంగవల్లికలు, ఆకాశంలో నుండి క్రిందికి దిగి వచ్చినట్టు కనపడే చుక్కల ముగ్గుల మధ్యలో కంటికింపుగా దర్శనమిచ్చే గొబ్బెమ్మలు, గొబ్బెమ్మల పైన అలంకరించ బడి పలకరించే బంతి, చేమంతి, గుమ్మడిపూలు, వాటిని తొక్క కుండా 'హరిలో రంగ హరి' అంటు అందరిని తన మధురగానంతో మేలుకొలుపుతున్న హరిదాసులు, వారు వెళ్ళగానే 'అయ్యగారికీ దండం పెట్టు, అమ్మగారికీ దండం పెట్టు' అంటు గంగిరెద్దుల నాడించే వారు, జంగంవారు, బుడబుక్కలవారు ...... తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించే ఎంతోమంది జానపద కళాకారులు - అదొక కలకలం, అదొక కళావిలాసం.



ఈ నెల అంతా విశిష్టాద్వైత సంప్రదాయాన్ననుసరించే వారు తిరుప్పావై లేక శ్రీవ్రతం లేక స్నానవ్రతం అనే దాన్ని ఆచరిస్తారు.ద్వాపరయుగం చివరలో గోపికలు ఆచరించిన ఈ వ్రతాన్ని గోదాదేవి ఆచరించి శ్రీరంగనాథుని వివాహం చేసుకుని ఆయనలో సశరీరంగా లీనమయింది. వైష్ణవ దేవాలయాల్లో తెల్లవారుజామునే కృష్ణుని అర్చించి బాలభోగంగా నివేదించిన ప్రసాదాన్ని తెల్లవారక ముందే పంచి పెడతారు. ప్రకృతిలో భాగమైన సర్వజీవులు స్త్రీలు. వారు పరమపురుషుని చేరుకోవటం కోసం చేసే సాధన మధురభక్తి మార్గం. దానికి ప్రతీక అయిన గోదాదేవి చేసిన వ్రతాన్ని ఈ నెలరోజులు సాధకులు, భక్తులు అందరు ఆచరిస్తారు. ఆండాళు తల్లి ఆ రోజుల్లో గోపికలుగా భావించుకున్న తన చెలులను వ్రతం చెయ్యటానికి స్నానం చేద్దాం రమ్మని మేలు కొలుపుతుంది. ఇప్పుడు ఆపని హరిదాసులు చేస్తున్నారు.

■ **సంక్రాంతి**

అసలు ప్రధానమైనది సంక్రాంతి, అంటే సంక్రమణం జరిగే రోజు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే రోజు. ఈ పుణ్యకాలంలో దానాలు, తర్పణాలు ప్రాధాన్యం వహిస్తాయి. ఈ సమయంలో చేసే దానాలకి ఎన్నో రెట్లు ఎక్కువ ఫలితం ఉంటుంది.



దానికి కారణం ఈ మూడురోజులు పాతాళం నుండి వచ్చి భూమిని పరిపాలించమని శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తికి వరం ఇచ్చాడు. కనుక బలి తనకి ఇష్టమైన దానాలు చేస్తే సంతోషిస్తాడు. అందులోనూ గుమ్మడికాయను దానం చేయటం మరీ శ్రేష్ఠం. గుమ్మడిని దానం ఇస్తే భూగోళాన్ని దానం ఇచ్చినంత ఫలితం. మకరరాశిలో ఉండే శ్రవణా నక్షత్రానికి అధిపతి అయిన శని శాంతించటానికి నువ్వుల దానం చేయటం శ్రేయస్కరం. వస్త్రదానం, పెరుగుదానంతో పాటు, ఏ దానాలు చేసినా మంచిదే. భోగినాడు ఏ కారణంగానైనా పేరంటం చేయని వారు ఈ రోజు చేస్తారు. అసలు మూడు రోజులు పేరంటం చేసే వారున్నారు.





దక్షిణాయణం పూర్తి అయి పితృదేవతలు తమ స్థానాలకి వెడితే మళ్ళీ ఆరునెలల వరకు రారు కనుక వారికి కృతజ్ఞతా పూర్వకంగా తర్పణాలు ఇస్తారు. కొంతమంది కనుము నాడు తర్పణాలిస్తారు.

■ **కనుము**

తమ ఇంటికి పంట వచ్చి ఆనందంగా ఉండటానికి కారణభూతమైన భూదేవికి, రైతులకి, పాలేర్లకి, పశువులకి కూడా తమ కృతజ్ఞతలని తెలియ చేయటం ఈ పండుగలోని ప్రతి అంశంలోనూ కనపడుతుంది. కనుముని పశువుల పండగ అని కూడా అంటారు. ఈ రోజు పశువుల శాలలని శుభ్రం చేసి, పశువులని కడిగి, కొమ్ములకి రంగులు వేసి, పూలదండలని వేసి, ఊరేగిస్తారు. వాటికి పోటీలు పెడతారు. ఎడ్లకి పరుగు పందాలు, గొర్రెపొటేళ్ళ పోటీలు, కోడిపందాలు మొదలైనవి నిర్వహిస్తారు.

పాలేళ్ళకి ఈరోజు సెలవు. వాళ్ళని కూడా తలంటు పోసుకోమని కొత్తబట్టలిచ్చి పిండి వంటలతో భోజనాలు పెడతారు. సంవత్సరమంతా వ్యవసాయంలో తమకు సహాయం చేసిన వారి పట్ల కతజ్ఞత చూపటం నేర్పుతుంది ఈ సంప్రదాయం.

మాంసాహారులు ఈరోజు మాంసాహారాన్ని వండుకుంటారు. సాధారణంగా కోడిపందెంలో ఓడిపోయిన కోడినో, గొర్రెనో ఉపయోగించటం కనపడుతుంది. ఓడిపోయిన జంతువు పట్ల కూడా గౌరవ మర్యాదలని చూపటం అనే సంస్కారం ఇక్కడ కనపడుతుంది.

పక్షులు వచ్చి తమ పంట పాడుచేయకుండా ఉండేందుకు, పురుగులని తిని సహాయం చేసినందుకు వాటికి కూడా కృతజ్ఞతను ఆవిష్కరించేందుకు వరి కంకులను తెచ్చి చక్కని కుచ్చులుగా చేసి, ఇంటి ముందు వసారాలలో కడతారు. కొన్ని ప్రాంతాలలో ఇప్పటికీ కనుము నాడు గుడిలో వరికంకుల గుత్తులను కట్టే సంప్రదాయం కొనసాగుతోంది.

'కనుము నాడు కాకైనా కదలదు', 'కనుము నాడు కాకైనా మునుగుతుంది' అనే సామెతలు కనుముకి పితదేవతలకు ఉన్న సంబంధాన్ని సూచిస్తాయి.

■ **ముక్కనుము**

ముక్కనుము నాడు ప్రత్యేకంగా చేయవలసినవి పెద్దగా కనిపించవు. పండగలో అలిసిపోయిన వారి విశ్రాంతి కోసం కావచ్చు. కానీ, కొంతమంది కనుమునాడు కాక ఈ రోజుని మాంసాహారం తినటానికి కేటాయిస్తారు.

ఒక పండుగ, అందులోనూ ప్రధానమైన పండుగను చేసుకోవటంలో ఎన్ని అంశాలను మిళితం చేసి, వినోదాన్ని, విజ్ఞానాన్ని, వికాసాన్ని పెంపొందించే విధంగా ప్రయోజనాత్మకంగా రూపొందించారో మన పెద్దలు!

- డా. ఎస్.అనంతలక్ష్మి

సినిమా

సంక్రాంతి ప్రత్యేకం

'సంక్రాంతి పండగ అంటే ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి' అంటున్నారు పాయల్ రాజ్‌పుత్. 'సంక్రాంతికి ఫుల్ ఎనర్జీతో భోగి మంటలు వేస్తుంటాను' అన్నారు మానసా చౌదరి. 'సంక్రాంతికి గాలిపటాలు ఎగురవేయడమంటే చాలా ఇష్టం' అంటున్నారు మాళవికా శర్మ. ఇలా సంక్రాంతిని తాము ఎలా జరుపుకొంటామో అంటూ ఈ కథానాయికలు సాక్షితో పంచుకున్న విశేషాలు..

ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి - పాయల్ రాజ్‌పుత్

నన్ను అభిమానించే తెలుగు ప్రేక్షకులకు సంక్రాంతి శుభాకాంక్షలు. పంజాబీ ఆడియన్స్‌కు హ్యాపీ లోహ్రీ. సంక్రాంతి పండగ అంటే నాకు ఎన్నో జ్ఞాపకాలు గుర్తొస్తాయి. ప్రతి ఏడాది సంక్రాంతిని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాం. పూజలు చేస్తాం.. ఇష్టమైన వంటకాలు చేసుకుంటాం. చిన్నతనంలో సంక్రాంతి పండక్కి గాలిపటాలను ఎగరవేసే దాన్ని. కానీ, నా జీవితం ఇప్పుడు చాలా మారి పోయింది. కాబట్టి గాలిపటాలను ఎగరవేసే సమయంలో మనలో కలిగే ఆ ఆనందపు అనుభూతిని కొంతకాలంగా మిస్ అయ్యాను. ఈ సారి ఢిల్లీలో నా స్నేహితులతో కలిసి గాలిపటాలను ఎగర వేయాలని ప్లాన్ చేస్తున్నాను. నా సిబ్బందిలో కొంతమంది హైదరాబాదీలు ఉన్నారు. వారితో పాటు సంక్రాంతిని నేను సెలబ్రేట్ చేసుకున్న అనుభవాలు ఉన్నాయి. అయితే హైదరాబాద్ నా కర్మభూమి. ఎందుకంటే.. నేను ఇక్కడే మూవీస్ చేస్తున్నాను. నేను నటించిన గోపీచంద్‌గారి 'భీమా', సుధీర్‌బాబు గారి 'హరోంహర' సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. ఈ సినిమాల్లో నా పాత్ర చాలా ఎగ్జైటింగ్‌గా ఉంటుంది. ప్రేక్షకులకు నచ్చే సినిమాలే చేయాలనుకుంటున్నాను.



● పాయల్ రాజ్‌పుత్



● మాళవికా శర్మ

నేను భోజన ప్రియురాలిని. ప్యూర్ వెజిటేరియన్‌ని. మసాలా కిచిడీ, లడ్డు అంటే చాలా ఇష్టం. ఇలా మా అమ్మగారు పండక్కి చేసిన వంటకాలను ఇష్టంగా తింటాను. ఇక నేను నటించిన తాజా చిత్రం 'మంగళవారం' మంచి విజయం సాధించడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు బాగా ఆదరించారు.. నా అభిమానులకు కూడా థ్యాంక్స్. ఓ నటిగా మంచి కథలను ఎంచుకోవాలనుకుంటున్నాను.

గాలిపటాలు ఎగరవేయడం చాలా ఇష్టం - మాళవికా శర్మ

సంక్రాంతి అంటే ముఖ్యంగా రైతుల పండగ. వారు ఎంతోకష్టపడి పండించిన పంటలు ఈ సంక్రాంతికి వారి చేతికి వస్తాయి. సూర్యభగవానుడికి పూజలు చేయడంతో మా సంక్రాంతి మొదలవుతుంది. మా అమ్మమ్మ మాకు ప్రతి సంక్రాంతికి కొత్త దుస్తులు ఇస్తుంటారు. నువ్వుల లడ్డూలు ఇస్తారు. లక్కీగా మా అమ్మమ్మగారి బర్త్ డే కూడా సంక్రాంతి రోజునే. మేము కూడా స్వీట్స్‌ను పంచిపెడతాం. మేం చేయగలిగినంతలో పేదలకు సాయం చేస్తుంటాం. సంక్రాంతికి గాలిపటాలు ఎగరవేయడం ఎవరికి ఇష్టం ఉండదు చెప్పండి. అందరిలానే నాకు గాలిపటాలను ఎగరవేయడం చాలా ఇష్టం. ఆకాశంలో కనిపిస్తున్న రంగు రంగుల గాలి పటాలు.. భూమిపై రైతులు పండిస్తున్న వివిధ రకాల పంటలకు ప్రతీకగా నేను భావిస్తుంటాను. నాపై తెలుగు ప్రేక్షకుల ప్రేమ, అభిమానాలకు చాలా రుణపడి ఉంటాను. ముంబై నా జన్మభూమి

సంక్రాంతి నాకు చాలా ప్రత్యేకం - మానసా చౌదరి

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పుత్తూరు స్వగ్రామం. నాన్న మధుసూదన్ నాయుడు వ్యాపారం నిమిత్తం చెన్నైలో స్థిరపడ్డారు. మేము చెన్నైలో ఉన్నప్పటికీ ప్రతి ఏడాది సంక్రాంతికి కచ్చితంగా ఊరు వెళతాం. అక్కడ నాన్న, అమ్మ సుజాత, నేను, తమ్ముడు చేతన్ కలిసి మా బంధువులతో ఎంతో సంతోషంగా సంక్రాంతి జరుపుకుంటాం. కానీ, ఈ ఏడాది ఊరు వెళ్లలేకపోయాను. మా బంధువులు, కజిన్స్ ఫోన్ చేసి.. 'ఏంటి? హీరోయిన్ అయిపోయావని ఊరికి రావా?' అంటున్నారు. అయితే ఆదివారం భోగి పండగని చెన్నైలోనే జరుపుకొన్నాను. మేము ఉన్న వీధిలో ఎక్కువ మంది తెలుగువాళ్లు ఉంటారు.. సెలబ్రేట్ చేసుకుంటాం.

● సంక్రాంతి పండగలో తొలిరోజు వచ్చే భోగి అంటే మరీ ఇష్టం. తొలిరోజు కాబట్టి ఫుల్ ఎనర్జీతో ఉంటా. ఉదయాన్నే లేచి పెద్ద భోగిమంటలు వేసేవాళ్లం. ఆ తర్వాత ఆయిల్ బాత్ చేసి, కుటుంబమంతా కలిసి సరదాగా మాట్లాడుకునేవాళ్లం.. థియేటర్‌కి వెళ్లి సినిమాలు చూస్తాం. ఆ తర్వాత మకర సంక్రాంతిన పొంగల్ చేయడం ఇష్టం. నేను నాన్ వెజ్ బాగా తింటాను. ప్రత్యేకించి నాటుకోడి కూరతో రాగిసంకటి తినడం చాలా ఇష్టం. అలాగే మటన్ నా ఫేవరేట్. మా అమ్మ చాలా బాగా చేస్తుంది. ఎవరైనా గాలిపటాలు ఎగరవేస్తుంటే చూస్తుంటాను. కానీ నేను గాలిపటాలు ఎగరవేయలేదు. తెలుగులో 'బబుల్‌గమ్' సినిమాకి ముందే నాకు కొన్ని అవకాశాలు వచ్చాయి.. కానీ, చేయలేదు. 'బబుల్‌గమ్' తర్వాత కథలు వింటున్నాను. అయితే నటనకు మంచి అవకాశం ఉన్న పాత్రలే చేయాలనుకుంటున్నాను. ఈ ఏడాది కెరీర్‌లో ఫుల్ ఎనర్జీతో దూసుకెళ్లాలనుకుంటున్నాను.



● మానసా చౌదరి

వారి ఆనందం చూస్తుంటే తృప్తిగా ఉంది - నాగార్జున



● విజయ్ బిన్నీ, 'అల్లరి' నరేశ్, నాగార్జున, ఆషిక, శ్రీనివాస

''నా సామిరంగ' సినిమాని ఎంతగానో ఆదరించిన తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఈ చిత్రానికి ప్రేక్షకులు, నా అభిమానుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన, ఆనందం చూస్తుంటే నాకు చాలా ఆనందంగా, తృప్తిగా ఉంది'' అని హీరో నాగార్జున అన్నారు. ఆయన హీరోగా, ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించారు. 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, మిర్నా మీనన్, రుక్సార్ థిల్లాన్ కీలక పాత్రలు పోషించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్స్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా ఆదివారం విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'నా సామిరంగ' థ్యాంక్స్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ–''మా చిత్రం సంక్రాంతికి విడుదలవ్వాలి, పెద్ద విజయం సాధించాలనే సంకల్పం, ప్రేమతో యూనిట్ అంతా పని చేశారు.. అందుకే ఇప్పుడు ఫలితం కూడా అంత గొప్పగా వచ్చింది. విజయ్ బిన్నీకి గొప్ప భవిష్యత్ ఉంటుంది. శ్రీనివాసా చిట్టూరి, పవన్ కుమార్‌లు గొప్ప ప్రోత్సాహం అందించారు. ఆషికా రంగనాథ్‌కి తెలుగులో చాలా మంచి కెరీర్ ఉంటుందని భావిస్తున్నాను'' అన్నారు. ''నాకు ఇష్టమైన నటుడు నాగార్జునగారితో నా జీవితంలో గుర్తుండిపోయే పాత్రని ఇచ్చిన శ్రీనివాసా చిట్టూరి, పవన్‌గార్లకు ధన్యవాదాలు'' అన్నారు 'అల్లరి' నరేశ్. ''ఈ సినిమాలో వింటేజ్ నాగార్జునగారిని చూపిస్తానని మాటిచ్చాను.. ఆ మాట నిలబెట్టుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అని విజయ్ బిన్నీ అన్నారు. ఆషికా రంగనాథ్, కెమెరామేన్ దాశరథి శివేంద్ర మాట్లాడారు.

ముంబైలో మొదలు

ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించనున్న ఈ సినిమాలో నాగార్జున ఓ కీలక పాత్ర పోషించనున్నారు. కాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెలాఖరులో ప్రారంభం కానుంది. తొలుత ముంబైలో ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారట శేఖర్ కమ్ముల. ఇందుకు సంబంధించిన వర్క్స్‌ను ఆల్రెడీ ప్రారంభించారట చిత్రయూనిట్. ముందుగా ముంబై, ఆ తర్వాత కొచ్చి లొకేషన్స్‌లో షూటింగ్ జరపాలనుకుంటున్నారట. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ సినిమాను నిర్మించనున్నారు. పీరియాడిక్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.



● ధనుష్

భలే ఉన్నాడే!

రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తున్న తాజా సినిమాకు 'భలే ఉన్నాడే' అనే టైటిల్ ఖరారైంది. ఈ సినిమాతో మనీషా కంద్కూర్ కథానాయికగా పరిచయమవుతున్నారు. 'గీతా సుబ్రమణ్యం, పెళ్లి గోల 2' వంటి వెబ్‌సిరీస్‌లను తీసిన జె. శివసాయి వర్ధన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మారుతి టీమ్ ప్రొడక్ట్ సమర్పణలో ఎన్వీ కిరణ్ కుమార్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఈ సినిమా టైటిల్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. లెజెండరీ ఫిల్మ్ మేకర్ సింగీతం శ్రీనివాస రావు, అభిరామి, లీలా శాంసన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: నగేష్ బానెల్.



● రాజ్‌తరుణ్

బాలీవుడ్ ఎంట్రీ

హీరోయిన్ కీర్తీ సురేష్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఖరారైంది. వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు ఎ.కాళీశ్వరన్ ఓ సినిమా తెరకెక్కించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్స్‌గా కీర్తి సురేష్, వామికా గబ్బి నటించనున్నారు. కీర్తి సురేష్‌కు హిందీలో తొలి చిత్రం ఇదే కావడం విశేషం. తమిళ దర్శకుడు అట్లీ సమర్పణలో మురాద్ ఖేతని, ప్రియా అట్లీ, జ్యోతి దేశ్ పాండే ఈ సినిమాను నిర్మించనున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ సినిమాను ప్రకటించి, పూజా కార్యక్రమాల వీడియోను షేర్ చేసింది యూనిట్. ఇక దర్శకుడు అట్లీ తెరకెక్కించిన తమిళ చిత్రం విజయ్ 'తేరీ'కి హిందీ రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుందనే టాక్ వినిపిస్తోంది. మరోవైపు హిందీలో రాధికా ఆప్టేతో కలిసి ఓ స్పై థ్రిల్లర్ వెబ్‌సిరీస్‌కు కూడా కీర్తి సురేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.. ఆమె హిందీలో చేస్తున్న తొలి వెబ్‌సిరీస్ కూడా ఇదే.



● కీర్తీ సురేష్

రాజావారు వస్తున్నారు

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. సతీష్ వేగేశ్న దర్శకత్వంలో చింతపల్లి రామారావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా చింతపల్లి రామారావు మాట్లాడుతూ–''మంచి కమర్షియల్ అంశాలు ఉన్న సినిమా ఇది. ఈ నెలలో తొలి కాపీ సిద్ధం కాబోతోంది. ఏడాదికి మూడు సినిమాలు నిర్మించేలా ప్లాన్ చేస్తున్నా. తెలుగు, మరాఠీ, కన్నడ భాషల్లో చిత్రాలు నిర్మించాలనుంది'' అన్నారు.



● నార్నే నితిన్

కృష్ణ విజయం రెడీ

సూపర్‌స్టార్ కృష్ణ నటించిన చివరి చిత్రం 'కృష్ణ విజయం'. ఈ మూవీలో నాగబాబు, సుహాసిని, యశ్వంత్, అలీ, సూర్య, గీతాసింగ్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. అంబుజా మూవీస్ పతాకంపై మధుసూదన్ హవల్దార్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ''కృష్ణ విజయం' సినిమా తప్పకుండా హిట్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా కృష్ణ–మహేశ్ సేన అధ్యక్షుడు ఖాదర్ ఘోరి పాల్గొన్నారు.



● 'కృష్ణ విజయం' మూవీ పోస్టర్



ఫిన్ అలెన్ మెరుపులు... న్యూజిలాండ్ విజయం

పాకిస్తాన్ జట్టుతో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 21 పరుగులతో నెగ్గింది. ముందుగా న్యూజిలాండ్ 8 వికెట్లకు 194 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిన్ అలెన్ (41 బంతుల్లో 74; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరిశాడు. అనంతరం పాక్ 19.3 ఓవర్లలో 173 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్ (43 బంతుల్లో 66; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఫఖర్ జమాన్ (25 బంతుల్లో 50; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. కివీస్ బౌలర్లు మిల్నె (4/33), సౌతీ (2/31), సియర్స్ (2/28) రాణించారు.

భారత షూటర్ల పసిడి వేట



జకార్తాలో జరుగుతున్న ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నీలో భారత షూటర్లు తమ పతకాల వేటను కొనసాగిస్తూ ఆదివారం రెండు స్వర్ణ పతకాలు గెలిచారు. పురుషుల 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ యోగేశ్ సింగ్ (572 పాయింట్లు) పసిడి పతకం నెగ్గాడు. యోగేశ్, అమిత్, ఓం ప్రకాశ్‌లతో కూడిన భారత బృందం టీమ్ విభాగంలో 1690 పాయింట్లతో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది.

18 నుంచి టికెట్ల విక్రయం

ఈనెల 25 నుంచి ఉప్పల్ స్టేడియంలో భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు



హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

సాక్షి, హైదరాబాద్: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఈనెల 25 నుంచి 29 వరకు ఉప్పల్ స్టేడియంలో జరిగే తొలి టెస్టు మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను ఈనెల 18 నుంచి ఆన్‌లైన్‌లో విక్రయిస్తారు. పేటీఎం ఇన్‌సైడర్ యాప్‌లో, www.insider.in వెబ్‌సైట్‌లో రాత్రి 7 గంటల నుంచి టికెట్లు లభిస్తాయని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ఆదివారం ప్రకటించారు. మిగిలిన టికెట్లను ఈనెల 22 నుంచి ఆఫ్‌లైన్‌లో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో విక్రయిస్తామని ఆయన వివరించారు. టికెట్ల ధరలను ఒక్కో రోజుకు రూ. 200, రూ. 499, రూ. 750, రూ. 1250, రూ. 3000 (కార్పొరేట్ బాక్స్ నార్త్), రూ. 4000 (కార్పొరేట్ బాక్స్ సౌత్)గా నిర్ణయించారు. ఐదు రోజుల సీజన్ టికెట్ల ధరలను రూ. 600, రూ. 1500, రూ. 2250, రూ. 3750, రూ. 12000 (కార్పొరేట్ బాక్స్ నార్త్), రూ. 16000 (కార్పొరేట్ బాక్స్ సౌత్)లుగా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన వారు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును చూపించి 22వ తేదీ నుంచి జింఖానా మైదానంలో టికెట్లను రీడీమ్ చేసుకోవాలి.

ఓటమి దిశగా ఆంధ్ర

ముంబై: బ్యాటర్ల వైఫల్యంతో ఆంధ్ర జట్టు రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో తొలి ఓటమి దిశగా సాగుతోంది. ముంబైతో జరుగుతున్న గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు ఫాలోఆన్ రెండో ఇన్నింగ్స్‌లో 51 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు సాధించింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఆంధ్ర జట్టు మరో 45 పరుగులు సాధించాలి. షేక్ రషీద్ (52 బ్యాటింగ్; 6 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (22 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 98/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 72 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌటైంది. ప్రశాంత్ కుమార్ (73; 10 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 211 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన ముంబై జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించకుండా ఆంధ్ర జట్టుకు ఫాలోఆన్ ఇచ్చింది. ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 395 పరుగులకు ఆలౌటైంది.

ఆడుతూ పాడుతూ...

- 173 పరుగుల లక్ష్యాన్ని 15.4 ఓవర్లలో ఛేదించిన భారత్
- రెండో టి20లోనూ విజయం
- సిరీస్ 2–0తో టీమిండియా సొంతం
- యశస్వి, శివమ్ దూబే మెరుపులు
- ఆరు వికెట్లతో ఓడిన అఫ్గానిస్తాన్



అక్షర్ పటేల్

ఇండోర్: ముందుగా బౌలింగ్‌లో, ఆ తర్వాత బ్యాటింగ్‌లో చెలరేగిన భారత్ స్వదేశంలో మరో ద్వైపాక్షిక టి20 సిరీస్‌ను సొంతం చేసుకుంది. 2019 నుంచి సొంతగడ్డపై టి20 సిరీస్‌లలో ఓటమిలేని భారత్ అదే జోరును అఫ్గానిస్తాన్‌పై కూడా కొనసాగించింది. మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా అఫ్గానిస్తాన్‌తో ఆదివారం జరిగిన రెండో మ్యాచ్‌లో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సిరీస్‌ను దక్కించుకుంది. చివరిదైన మూడో టి20 మ్యాచ్ బుధవారం బెంగళూరులో జరుగుతుంది.

టాస్ గెలిచిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ సరిగ్గా 20 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. గుల్బదిన్ (35 బంతుల్లో 57; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో అర్‌‌ష్దీప్ సింగ్ 3 వికెట్లు తీయగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. 173 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 15.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించి గెలిచింది. యశస్వి జైస్వాల్ (34 బంతుల్లో 68; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), శివమ్ దూబే (32 బంతుల్లో 63 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అఫ్గాన్ బౌలర్ల భరతం పట్టి అర్ధ సెంచరీలు సాధించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (0) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 'డకౌట్'కాగా... 14 నెలల తర్వాత మళ్లీ టి20 మ్యాచ్ ఆడిన కోహ్లి (16 బంతుల్లో 29; 5 ఫోర్లు) క్రీజులో ఉన్నంతసేపు దూకుడుగా ఆడాడు.



యశస్వి జైస్వాల్



శివమ్ దూబే

150 అంతర్జాతీయ టి20ల్లో 150 మ్యాచ్‌లు ఆడిన తొలి ప్లేయర్‌గా రోహిత్ శర్మ గుర్తింపు పొందాడు.

12 అంతర్జాతీయ టి20ల్లో భారత్ తరఫున అత్యధికంగా 12 సార్లు 'డకౌట్' అయిన ప్లేయర్ రోహిత్ శర్మ. కేఎల్ రాహుల్ (5) రెండో స్థానంలో ఉన్నాడు.

15 స్వదేశంలో జరిగిన గత 15 ద్వైపాక్షిక టి20 సిరీస్‌లలో భారత్ అజేయంగా నిలిచింది. 2019 నుంచి భారత జట్టు 13 టి20 సిరీస్‌లను నెగ్గి, రెండింటిని 'డ్రా'గా ముగించింది.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) దూబే (బి) రవి బిష్ణోయ్ 14; ఇబ్రహీమ్ (బి) అక్షర్ పటేల్ 8; గుల్బదిన్ (సి) రోహిత్ శర్మ (బి) అక్షర్ పటేల్ 57; అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (బి) శివమ్ దూబే 2; మొహమ్మద్ నబీ (సి) రింకూ సింగ్ (బి) రవి బిష్ణోయ్ 14; నజీబుల్లా (బి) అర్‌‌ష్దీప్ 23; కరీమ్ (సి) అక్షర్ పటేల్ (బి) అర్‌‌ష్దీప్ 20; ముజీబ్ (రనౌట్) 21; నూర్ అహ్మద్ (సి) కోహ్లి (బి) అర్‌‌ష్దీప్ 1; నవీన్ ఉల్ హఖ్ (నాటౌట్) 1; ఫరూఖీ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 172. వికెట్ల పతనం: 1-20, 2-53, 3-60, 4-91, 5-104, 6-134, 7-164, 8-170, 9-171, 10-172. బౌలింగ్: అర్‌‌ష్దీప్ సింగ్ 4-0-32-3, ముకేశ్ కుమార్ 2-0-21-0, రవి బిష్ణోయ్ 4-0-39-2, అక్షర్ పటేల్ 4-0-17-2, శివమ్ దూబే 3-0-36-1, వాషింగ్టన్ సుందర్ 3-0-23-0.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) గుర్బాజ్ (బి) కరీమ్ 68; రోహిత్ శర్మ (బి) ఫరూఖీ 0; విరాట్ కోహ్లి (సి) ఇబ్రహీమ్ (బి) నవీన్ 29; శివమ్ దూబే (నాటౌట్) 63; జితేశ్ శర్మ (సి) నబీ (బి) కరీమ్ 0; రింకూ సింగ్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (15.4 ఓవర్లలో 4 వికెట్లకు) 173. వికెట్ల పతనం: 1-5, 2-62, 3-154, 4-156. బౌలింగ్: ఫరూఖీ 3.4-0-28-1, ముజీబ్ ఉర్ రెహ్మాన్ 2-0-32-0, నవీన్ ఉల్ హఖ్ 3-0-33-1, నూర్ అహ్మద్ 3-0-35-0, నబీ 2-0-30-0, కరీమ్ 2-0-13-2.

రన్నరప్ సాత్విక్–చిరాగ్ జోడీ

- మూడో గేమ్‌లో 10–3తో ఆధిక్యాన్ని వృథా చేసుకున్న భారత ద్వయం
- మలేసియా ఓపెన్ టోర్నీ

కౌలాలంపూర్: కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలని ఆశించిన భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టికి నిరాశ ఎదురైంది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ రెండో ర్యాంక్‌లో ఉన్న సాత్విక్–చిరాగ్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న లియాంగ్ వె కెంగ్–వాంగ్ చాంగ్ (చైనా) జంటతో ఆదివారం జరిగిన ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 21–9, 18–21, 17–21తో ఓడిపోయింది. 58 నిమిషాలపాటు జరిగిన ఈ తుది పోరులో నిర్ణాయక మూడో గేమ్‌లో సాత్విక్–చిరాగ్ 10–3తో ఏకంగా 7 పాయింట్ల ఆధిక్యంలో నిలిచారు. కానీ ఒత్తిడికిలోనై, అనవసర తప్పిదాలు చేసి భారత జంట చైనా జోడీకి పుంజుకునే అవకాశం ఇచ్చింది. రన్నరప్‌గా నిలిచిన సాత్విక్–చిరాగ్‌లకు 45,500 డాలర్ల (రూ. 37 లక్షల 71 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 10,200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



శ్రమించిన జొకోవిచ్

రెండో రౌండ్‌లోకి డిఫెండింగ్ చాంప్



మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా) రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. ఆదివారం మొదలైన ఈ టోర్నీలో తొలి రౌండ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 6–2, 6–7 (5/7), 6–3, 6–4తో ప్రపంచ 178వ ర్యాంకర్, క్వాలిఫయర్ డినో ప్రిజ్మిక్ (క్రొయేషియా)పై కష్టపడి గెలిచాడు. 4 గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 11 ఏస్‌లు సంధించాడు. 40 విన్నర్స్ కొట్టిన ఈ సెర్బియా స్టార్ 49 అనవసర తప్పిదాలు చేయడం గమనార్హం. ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేసిన జొకోవిచ్ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయాడు.

సబలెంకా సులువుగా...

మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా (బెలారస్) అలవోక విజయంతో రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. రెండో సీడ్ సబలెంకా 6–0, 6–1తో 53 నిమిషాల్లో ఇలా సెడెల్ (జర్మనీ)పై గెలిచింది. ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్), తొమ్మిదో సీడ్ క్రిచికోవా (చెక్ రిపబ్లిక్) కూడా రెండో రౌండ్‌కు చేరుకున్నారు.

గెలిచి నిలిచిన భారత్



రాంచీ: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలు సజీవంగా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత మహిళల హాకీ జట్టు సత్తా చాటుకుంది. ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా న్యూజిలాండ్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. భారత్ తరఫున సంగీత కుమారి (1వ ని.లో), ఉదిత (12వ ని.లో), డుంగ్‌డుంగ్ బ్యూటీ (14వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. న్యూజిలాండ్ జట్టుకు మేగన్ హల్ (9వ ని.లో) ఏకైక గోల్‌ను అందించింది. మరో మ్యాచ్‌లో అమెరికా 2–0తో ఇటలీ జట్టును ఓడించింది. ప్రస్తుతం అమెరికా 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... భారత్, న్యూజిలాండ్ 3 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి. మంగళవారం జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో అమెరికాతో న్యూజిలాండ్; ఇటలీతో భారత్ తలపడతాయి.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్‌లో 98 ట్రైనీ ఇంజనీర్, ట్రైనీ ఆఫీసర్ పోస్టులు

ఫరీదాబాద్(హర్యానా)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌పీసీ) ట్రైనీ ఇంజనీర్, ట్రైనీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» మొత్తం పోస్టుల సంఖ్య: 98
» పోస్టుల వివరాలు:ట్రైనీ ఇంజనీర్(సివిల్)-22, ట్రైనీ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-17, ట్రైనీ ఇంజనీర్(మెకానికల్)-50,ట్రైనీ ఆఫీసర్(ఫైనాన్స్)-09.
» అర్హత: సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ, బీటెక్, సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు గేట్, సీఏ/సీఎంఏ స్కోరు సాధించి ఉండాలి.
» వయసు: 22.01.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.50,000 నుంచి 1,60,000.
» ఎంపిక విధానం: గేట్, సీఏ/సీఎంఏ స్కోరు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.01.2024
» వెబ్‌సైట్: www.nhpcindia.com

హెచ్‌ఏఎల్, బెంగళూరులో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌లు

బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్).. అప్రెంటిస్ శిక్షణకు గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» విభాగాలు: ఏరోనాటికల్/ఏరోస్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, మెకానికల్/ఇండస్ట్రియల్/ప్రొడక్షన్/మెకాట్రానిక్స్, మెటలర్జీ అండ్ మెటీరియల్ సైన్స్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి-కమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్.
» అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» స్టైపెండ్: నెలకు రూ.9000.
» ఎంపిక విధానం: ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ బేసిస్, బీఈ, బీటెక్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» వాక్ ఇన్ సెలక్షన్స్ తేదీలు: 16, 17, 18, 19, 20/01/2024.
» వేదిక: టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, సురంజన్ దాస్ రోడ్, బెంగళూరు.
» వెబ్‌సైట్: https://hal-india.co.in

ఏపీ ఆర్‌జీయూకేటీలో 194 ఫ్యాకల్టీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ) పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» ఏపీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు: నూజివీడు (ఏలూరు జిల్లా),ఆర్కే వ్యాలీ (కడప జిల్లా),ఎచ్చెర్ల (శ్రీకాకుళం జిల్లా),ఒంగోలు(ప్రకాశం జిల్లా).
» మొత్తం పోస్టుల సంఖ్య: 194.
» పోస్టుల వివరాలు: లెక్చరర్-61, అసిస్టెంట్ ప్రొఫెసర్-133.
» లెక్చరర్: సబ్జెక్ట్‌లు: బయాలజీ, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, తెలుగు. అర్హత: కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టు/భాషలో ఎంఏ/ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» అసిస్టెంట్ ప్రొఫెసర్: సబ్జెక్ట్‌లు: బయాలజీ, సివిల్ ఇంజనీరింగ్, సీఎస్ఈ, ఈఈఈ, ఈసీఈ, ఇంగ్లిష్, మేనేజ్‌మెంట్, మ్యాథమేటిక్స్, మెకానికల్, ఎంఎంఈ. అర్హత: సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్, నెట్/సెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.01.2024
» వెబ్‌సైట్: www.rgukt.in

ఆర్‌పీఎన్ఎల్‌యూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ప్రయాగ్‌రాజ్(ఉత్తరప్రదేశ్)లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేషనల్ లా యూనివర్శిటీ (ఆర్‌పీఎన్ఎల్‌యూ).. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 06
» సబ్జెక్టులు: హిస్టరీ, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, లా, సోషియాలజీ.
» అర్హత: 55శాతం మార్కులతో సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, నెట్/స్లెట్/సెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు రూ.15,600 నుంచి 39,100.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ప్రెజెంటేషన్, మాక్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 20.01.2024.
» వెబ్‌సైట్: www.rpnlup.ac.in

కెరీర్ 'నిర్మాణం'.. నాటా!

» బీఆర్క్‌లో ప్రవేశానికి నాటా నోటిఫికేషన్
» కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో పరీక్ష
» ఈ ఏడాది పరీక్ష నిర్వహణలో మార్పులు

ఆర్కిటెక్చర్.. శతాబ్దాలుగా గుర్తింపు పొందుతున్న ఇంజనీరింగ్ విభాగం! ఎన్నో చారిత్రక కట్టడాల అద్భుత నిర్మాణ కౌశలానికి ఆర్కిటెక్చర్ నిపుణుల ప్రతిభే కారణం!! అలాంటి నైపుణ్యాలు అందించే కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్. ఈ కోర్సులో ప్రవేశాలకు మార్గం.. నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా). నాటా స్కోర్‌తో.. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ గుర్తింపు ఉన్న ఇన్‌స్టిట్యూట్స్‌లో బీఆర్క్‌లో ప్రవేశం పొందొచ్చు! తాజాగా నాటా-2024 షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. నాటా వివరాలు, పరీక్ష విధానం, బెస్ట్ స్కోర్‌కు ప్రిపరేషన్ తదితర వివరాలు..



దేశంలోని ఆర్కిటెక్చర్ కళాశాలలను పర్యవేక్షించే కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నేతృత్వంలో నాటా పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగానే నాటా గుర్తింపు పొందిన కళాశాలల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశం లభిస్తుంది. ప్రస్తుతం దేశంలో దాదాపు 650కు పైగా ఇన్‌స్టిట్యూట్‌లు సీఓఏ పరిధిలో ఉన్నాయి. వీటిలో అడుగుపెట్టాలంటే నాటా స్కోర్ తప్పనిసరి. జేఈఈ-మెయిన్ పేపర్-2 స్కోర్‌తో నిట్‌లు, జేఈఈ-అడ్వాన్స్‌డ్ తర్వాత నిర్వహించే ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్‌తో ఐఐటీలు బీఆర్క్‌లో అడ్మిషన్ కల్పిస్తున్నాయి. మిగతా అన్ని ఇన్‌స్టిట్యూట్‌ల్లో బీఆర్క్‌లో ప్రవేశాలకు నాటా స్కోర్ తప్పనిసరి.

అర్హతలు

ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్ లేదా మూడేళ్ల డిప్లొమాలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. 2024లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏప్రిల్-జూలై మధ్య

నాటాకు సంబంధించి ఈ ఏడాది కొన్ని మార్పులు జరిగాయి. నాటా-2024ను ఏప్రిల్ నుంచి జూలై వరకు.. ప్రతి శనివారం, ఆదివారాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్దిష్టమైన తేదీలను త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రస్తుతం తొలి పరీక్ష ఏప్రిల్ 6న జరగనుంది. మూడుసార్లు పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు మూడు అటెంప్ట్‌లకు హాజరైతే.. ఆ మూడు స్కోర్లలో బెస్ట్ స్కోర్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండేళ్ల గుర్తింపు

నాటా స్కోర్ కార్డ్‌కు రెండేళ్లపాటు గుర్తింపు ఉంటుంది. అంటే.. 2024లో స్కోర్ కార్డ్ సొంతం చేసుకుంటే 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో.. ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఫలితంగా.. ఈ విద్యా సంవత్సరంలో మెచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లో సీటు లభించని విద్యార్థులు.. వచ్చే విద్యా సంవత్సరంలో ఆ దిశగా ప్రయత్నించే అవకాశం లభిస్తుంది.

రెండు విభాగాలు.. 200 మార్కులు

- నాటా-2024ను రెండు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు.
- మొదటి విభాగం.. పార్ట్-ఎలో.. డ్రాయింగ్ అండ్ కంపోజిషన్ టెస్ట్(1 ప్రశ్న- 25 మార్కులు), స్కెచింగ్ అండ్ కంపోజిషన్-బ్లాక్ అండ్ వైట్ (1 ప్రశ్న-25 మార్కులు), 3డి కంపోజిషన్ (1 ప్రశ్న-30 మార్కులు) విభాగాలు ఉంటాయి.
- రెండో విభాగం.. పార్ట్-బిలో విజువల్ రీజనింగ్, లాజికల్ డెరివేషన్, జీకే అండ్ ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, లాంగ్వేజ్ ఇంటర్ ప్రిటేషన్, డిజైన్ సెన్సిటివిటీ, డిజైన్ థింకింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నల్లో 30 ప్రశ్నలకు 2 మార్కులు చొప్పున 60 మార్కులు, మరో 15 ప్రశ్నలకు 4 మార్కులు చొప్పున 60 మార్కులు కేటాయిస్తారు. ఇలా పార్ట్-ఎ, పార్ట్-బి రెండూ కలిపి 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. పార్ట్-ఎను ఆఫ్‌లైన్ టెస్ట్‌గా, పార్ట్-బిని ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. పార్ట్-ఎకు 90 నిమిషాలు, పార్ట్-బికి 90 నిమిషాలు చొప్పున మొత్తం మూడు గంటల సమయం ఇస్తారు. ప్రశ్నలు.. బహుళైచ్ఛిక ప్రశ్నలు (ఎంసీక్యూస్), మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్ (ఒకటి కంటె ఎక్కువ సమాధానాలు ఉండే ఆబ్జెక్టివ్ ప్రశ్నలు), న్యూమరికల్ టైప్ కొశ్చన్స్, ప్రిఫరెన్షియల్ ఛాయిస్, మ్యాచ్ ద ఫాలోయింగ్ తరహాలో ఉంటాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- మొదటి అటెంప్ట్ దరఖాస్తు తేదీలు: 2024 మార్చి/ఏప్రిల్‌లో
- మొదటి అటెంప్ట్ పరీక్ష తేది: 2024 ఏప్రిల్ 6.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nata.in

బెస్ట్ స్కోర్‌కు సన్నద్ధత ఇలా

డ్రాయింగ్ అండ్ కంపోజిషన్ టెస్ట్

పార్ట్-ఎగా నిర్వహించే ఈ విభాగంలో ఒక సందర్భాన్ని, సన్నివేశాన్ని ఊహించి విశ్లేషించి.. దాని గురించి అడిగిన ప్రశ్నకు అనుగుణంగా సరిపడే సమాధానాన్ని గుర్తించాల్సి ఉంటుంది. స్కెచ్ విజువలైజేషన్, క్రియేటివిటీ, స్కేల్ అండ్ ప్రపోర్షన్ ఆఫ్ ఆబ్జెక్ట్, జియోమెట్రిక్ కంపోజిషన్, బిల్డింగ్ ఫామ్స్, ఎలిమెంట్స్, కలర్ టెక్స్చర్, హార్మోనీ అండ్ కాంట్రాస్ట్, డ్రాయింగ్ ఆఫ్ ప్యాట్రన్, ఫామ్ ట్రాన్స్‌ఫర్మేషన్స్, ఇన్ 2డీ, 3డీ, సబ్‌స్ట్రాక్షన్, రొటేషన్, సర్ఫేసెస్ అండ్ వాల్యూమ్స్, జేనరేటింగ్ వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

న్యూమరికల్ రీజనింగ్

పార్ట్-బిలో.. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, కాలిక్యులస్, ఇంటీజర్స్ వంటి మ్యాథమెటిక్స్ అంశాలపై దృష్టి పెట్టాలి. ఇక ఫిజిక్స్‌కు సంబంధించి ఎలక్ట్రోస్టాటిస్టిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, రే ఆప్టిక్స్, రేడియేషన్, ఆటమ్స్ అండ్ న్యూక్లియస్ తదితర ముఖ్యాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

కంపోజిషన్ ఆఫ్ కలర్

ఇందులో ఆయా సందర్భాలు, సన్నివేశాలకు అనుగుణంగా.. ఊహా చిత్రాలను రూపొందించేందుకు.. ఆకర్షణీయమైన కలర్ కాంబినేషన్స్‌ను వినియోగించే నైపుణ్యాలను పరీక్షిస్తారు.

స్కెచింగ్, కంపోజిషన్

ఈ విభాగంలో అభ్యర్థులకు నిర్దిష్టంగా ఒక సందర్భం, సన్నివేశాన్ని తెలియజేస్తారు. దీనికి అనుగుణంగా.. అభ్యర్థులు.. ఆయా భవనాల ఊహా చిత్రాలను గీయాల్సి ఉంటుంది. అభ్యర్థులు స్కేల్, ప్రపోర్షన్స్, టెక్స్చర్స్, షాడోస్, షేడ్స్ వంటి వాటిని విశ్లేషించాల్సి ఉంటుంది.

సిట్యుయేషనల్ రీజనింగ్

అభ్యర్థుల్లోని ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ఈ విభాగంలో ప్రశ్నలను అడుగుతారు. ఏదైనా ఒక అంశాన్ని లేదా దృశ్యాన్ని చూపించి.. అందులోని లోటుపాట్లు.. వాటికి పరిష్కారం చూపే విధంగా సమాధానాల్ని గుర్తించాల్సి ఉంటుంది.

అబ్‌స్ట్రాక్ట్ రీజనింగ్

ఈ విభాగంలో జనరల్ నాలెడ్జ్‌తోపాటు వర్తమాన అంశాలు, లేదా ఏదైనా ఒక అంశానికి సంబంధించి తాజా పరిస్థితులపై అవగాహనను తెలుసుకునే విధంగా ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు స్టాక్ జీకే, కరెంట్ అఫైర్స్, ఆర్కిటెక్చర్ విభాగంలోని తాజా పరిణామాల గురించి తెలుసుకోవాలి. స్టాక్ జీకేలో ప్రధానంగా.. అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కట్టడాలు, రూపకర్తలు, కరెంట్ అఫైర్స్ అంశాలపై దృష్టి పెట్టాలి.

ఉమ్మడి కౌన్సెలింగ్

నాటా స్కోర్ సొంతం చేసుకున్న అభ్యర్థులు మలి దశలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు చేస్తారు. ఇంటర్మీడియెట్‌లో పొందిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇచ్చే విధానం అమలవుతోంది. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ దరఖాస్తు సమయంలో అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న కళాశాలల ప్రాథమ్యాలను పేర్కొనాల్సి ఉంటుంది.

విస్తృత అవకాశాలు

అయిదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సు ఉత్తీర్ణులకు ప్రైవేట్ రంగంలో, అదే విధంగా ప్రభుత్వ విభాగాల్లోనూ ఉద్యోగాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ విభాగాల్లో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రైల్వే, పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్, నేషనల్ బిల్డింగ్, ఆర్గనైజేషన్స్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్.. ఇలా చాలా ప్రభుత్వ, అనుబంధ రంగాల్లో కొలువులు లభిస్తాయి. అదే విధంగా ప్రైవేట్ రంగంలో గ్రాఫిక్, ఇంటీరియర్ డిజైన్, ఫర్నిచర్ డిజైన్ వంటి సంస్థల్లో, నిర్మాణ రంగంలోని కార్పొరేట్ సంస్థల్లో సగటున రూ. అయిదు లక్షల వేతనంతో కొలువు సొంతం చేసుకోవచ్చు.

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	847	72,568
నిఫ్టీ ▲	247	21,895

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	14,973	▲	3
డోజోన్స్	37,593	▼	118
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,625	▲	48
డాక్స్	16,705	▲	158
షాంఘై	2,882	▼	5
నికాయ్	35,557	▲	525

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.68	83.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.01	107.59
€	యూరో	ఎస్‌బీఐ	92.38	92.56
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.74	58.04
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.69	56.81
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.69	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.64
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.59	23.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	23.36



రుణ పడొద్దు!

సొంత కారు, అందమైన భవంతి, ఇంట్లో అన్ని రకాల సాధనాలు (మెషీన్లు).. ఎందులోనూ రాజీపడేది లేదన్నట్టుగా ఉంది నేటి యువతరం ధోరణి. ముందు పొదుపు, తర్వాతే ఖర్చు.. గతంలో మన పెద్దలు అనుసరించిన ధోరణి. ముందు ఖర్చు.. మిగిలితేనే పొదుపు అన్నట్టుగా ఉంది నేటి తీరు. ఏ అవసరం వచ్చినా 'తగ్గేదే లే' అన్న ధోరణి కనిపిస్తోంది. కొనుగోళ్ల నుంచి వైద్య చికిత్సల వరకు అన్నింటికీ రుణబాట పడుతున్నారు. తీర్చే సామర్థ్యం ఉంటేనే రుణం తీసుకోవాలి. ప్రాధాన్యత లేని వాటికి సైతం రుణాలను ఆశ్రయిస్తే తీర్చే విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. కారణం ఏదైనా సకాలంలో రుణం వాయిదా చెల్లించలేకపోతే, ఎదుర్కోవాల్సిన పరిణామాలు చాలానే ఉంటాయి. చివరికి ఉద్యోగ అన్వేషణకు సైతం దూరం కావాల్సి రావచ్చు.

బకాయిలు సకాలంలో చెల్లించాలి

- లేదంటే క్రెడిట్ స్కోర్‌కు విఘాతం
- క్రెడిట్ రిపోర్ట్‌లో మచ్చ
- చట్టపరమైన చర్యలను ఎదుర్కొనే పరిస్థితి
- అనవసర చార్జీల భారం
- బ్యాంకుతో సంప్రదింపుల ద్వారా పరిష్కారం
- రుణంపై స్వల్పకాలం పాటు మారటోరియం
- గడువు పెంపుతో తగ్గే ఈఎంఐ



గతంలో బ్యాంకుల రుణ వృద్ధిలో కార్పొరేట్ రుణాలదే పైచేయిగా ఉండేది. మొదటిసారి 2020 (కరోనా విపత్తు కాలంలో) నవంబర్‌లో బ్యాంకుల రుణాల్లో కార్పొరేట్‌లను కాదని రిటైల్ రుణాలు ముందుకు వచ్చేశాయి. అప్పటి నుంచి 2023 నవంబర్ 17 నాటికి చూస్తే రిటైల్ రుణాలు 79 శాతం పెరగ్గా.. కార్పొరేట్ రుణాల్లో వృద్ధి 28 శాతానికి పరిమితమైంది. 2023లో రెండో త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లోనూ రిటైల్ రుణాల్లో వృద్ధి 15 శాతంగా నమోదైంది. రిటైల్ రుణాల్లో కన్స్యూమర్ ఉత్పత్తుల కొనుగోళ్ల కోసం తీసుకునేవి (విలువ పరంగా) 20 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహన రుణాలు 18 శాతం వృద్ధి చెందాయి. వ్యక్తిగత అవసరాల కోసం తీసుకునే రుణాలు 12 శాతం పెరిగాయి. ఆటో రుణాలు 13 శాతం పెరిగితే, ఇంటి రుణాలు విలువ పరంగా మైనస్ 6 శాతంగా ఉన్నాయి. వినియోగ రుణాలు ఎక్కువగా ఉంటున్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, అదే సమయంలో రుణ ఎగవేతల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డ్ రుణాల్లో ఒత్తిడి ఎక్కువగా ఉంది. 2023 జులై నాటికి క్రెడిట్ కార్డ్ రుణాలు రూ.2.13 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏడాది క్రితం కంటే 31 శాతం పెరిగాయి. రిటైల్ రుణాలన్నీ కూడా అన్‌సెక్యూర్డ్. రుణ గ్రహీత చేతులు ఎత్తేస్తే అది బ్యాంకింగ్ వ్యవస్థపై భారాన్ని మోపుతుంది. అందుకే రిజర్వ్ బ్యాంక్ వ్యక్తిగత, అన్ సెక్యూర్డ్, క్రెడిట్ కార్డ్ రుణాలకు రిస్క్ వెయిటేజీ పెంచుతూ, వీటికి బ్యాంకులు మరిన్ని నిధులను పక్కన పెట్టేలా గత నవంబర్‌లో ఆదేశాలు తీసుకొచ్చింది.

తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించలేకపోయినా, రుణాన్ని ఎగవేసినా అది క్రెడిట్ స్కోర్‌ను గణనీయంగా తగ్గించేస్తుంది. కరోనా అనంతరం రిటైల్ రుణాలు తీసుకోవడం గణనీయంగా పెరిగిపోగా, అదే సమయంలో అంతకుముందు తీసుకున్న రుణాలకు సంబంధించి ఎగవేతలు కూడా పెద్ద మొత్తంలోనే నమోదయ్యాయి. దీంతో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు పెద్ద

క్రెడిట్ స్కోర్‌కు విఘాతం



మొత్తాల్లో కేటాయింపులు చేయాల్సి వచ్చింది. ఈ పరిణామాలతో చాలా మంది రుణ గ్రహీతల క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడింది. నేడు ప్రతి రుణానికి సంబంధించి చెల్లింపుల చరిత్రతో క్రెడిట్ బ్యూరోలు రికార్డులను నిర్వహిస్తున్నాయి. రుణం సకాలంలో చెల్లించకపోయినా, ఎగ్గొట్టినా, సెటిల్‌మెంట్ చేసుకున్నా, రుణం కావాలంటూ విచారణలు చేసినా, అవన్నీ సంబంధిత వ్యక్తి పేరిట రికార్డుగా నమోదవుతాయి. వీటి ఆధారంగానే క్రెడిట్ బ్యూరోలు స్కోర్‌ను కేటాయిస్తుంటాయి. 750, అంతకుమించి క్రెడిట్ స్కోర్ ఉంటే అది మెరుగైనది. రుణం సులభంగా వస్తుంది. మెరుగైన రేటుకు వస్తుంది. 750కంటే తక్కువ ఉంటే రుణం పొందడం కష్టమవుతుంది. ఒకవేళ రుణం లభించినా, అది అధిక వడ్డీ రేటుపై తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకని ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ వాయిదాలను సకాలంలో చెల్లించాలి. నేడు దాదాపు అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు క్రెడిట్ స్కోర్ ఆధారంగానే అన్‌సెక్యూర్డ్ రుణాలు మంజూరు చేస్తున్నాయి.

తదుపరి పరిణామాలు..

బకాయి చెల్లించాలంటూ రుణగ్రహీతను రుణం ఇచ్చిన సంస్థలు కోరతాయి. గడువు తీరిన 30 రోజులకూ చెల్లింపులు చేయకపోతే అప్పుడు ఆయా రుణగ్రహీతల సమాచారాన్ని క్రెడిట్ బ్యూరోలకు పంపిస్తుంటాయి. 30-60 రోజుల పాటు చెల్లింపులు చేయకపోతే అది క్రెడిట్ స్కోరును దెబ్బతీస్తుంది. ఇక రుణ వాయిదా 60 రోజులు దాటినా చెల్లించలేని వారి క్రెడిట్ స్కోర్ మరింత తగ్గిపోతుంది. తక్కువ క్రెడిట్ స్కోర్ వల్ల భవిష్యత్తులో రుణానికి ద్వారాలు మూసుకుపోతాయి. అత్యవసరంలో రుణం కావాల్సి వస్తే నిరాకరణ ఎదురుకావచ్చు. డిజిటల్‌గా రుణాలు ఇచ్చే సంస్థలు కనీసం ఒక్క రోజు ఆలస్యం చేసినా,ఎగవేతదారుల జాబితాలో చేరాల్సి వస్తోంది. 650-750 మధ్య స్కోర్ ఉన్న వారికి గృహ రుణం కావాలంటే, మెరుగైన స్కోర్ ఉన్న వారితో పోలిస్తే 2 శాతం అధిక రేటు చెల్లించాల్సి వస్తుంది. రూ.50 లక్షల రుణం 20 ఏళ్ల కాలవ్యవధికి కావాలంటే, తక్కువ స్కోర్ కారణంగా వడ్డీ రూపంలో అదనంగా రూ.12 లక్షల వరకు భారాన్ని మోయాల్సి రావచ్చు. సెక్యూర్డ్, అన్‌సెక్యూర్డ్ రుణాల మధ్య ఈ రేటు వ్యత్యాసం మారుతుంది.

రుణం ఎగ్గొట్టడం సివిల్ నేరం కిందకు వస్తుంది. రుణ గ్రహీత ఇచ్చిన చెక్కుల ద్వారా వసూలు చేసుకునే చర్యలను ఆర్థిక సంస్థలు ప్రారంభిస్తాయి. గడువు ముగిసిన 90 రోజుల్లోపు కూడా రుణ గ్రహీత చెల్లించకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, నోటీసు వస్తుంది. 180 రోజులు (ఆరు నెలలు) ముగిసినా ఎలాంటి ఫలితం లేకపోతే అప్పుడు నెగోషియబుల్ ఇనుస్ట్రుమెంట్ యాక్ట్, 1881లోని సెక్షన్ 138 కింద రుణం ఇచ్చిన సంస్థ కేసు దాఖలు చేస్తుంది. చెల్లించే సామర్థ్యం ఉన్నా, చెల్లించకపోతే ఉద్దేశపూర్వక ఎగవేతదారు అనే ముద్ర పడుతుంది. సరైన కారణంతో రుణం చెల్లించలేని పరిస్థితుల్లో ఉంటే అప్పుడు రుణం ఇచ్చిన సంస్థతో చర్చలు నిర్వహించి పరిష్కారానికి, పరస్పర అంగీకారానికి రావచ్చు.

హోమ్‌లోన్ లేదా ప్రాపర్టీ లోన్ లేదా బంగారంపై రుణం వంటి సెక్యూర్డ్ రుణాల్లో రుణ గ్రహీత చెల్లింపుల్లో చేతులు ఎత్తేస్తే.. తనఖాగా ఉంచిన ఆస్తులను బ్యాంకులు వేలం వేస్తుంటాయి. అలాగే, ఆటోమొబైల్ రుణాల్లోనూ వాహనాన్ని జప్తు చేసి, చెల్లింపులకు తగినంత వ్యవధి ఇస్తాయి. అప్పటికీ చెల్లించకపోతే వాహనాన్ని వేలం వేసి రుణంలో సర్దుబాటు చేసుకుంటాయి.

బ్యాంక్ జాబ్ కష్టమే!

బలహీన క్రెడిట్ స్కోర్ ఉందంటూ ఉద్యోగ దరఖాస్తు తిరస్కరించే అధికారం బ్యాంకుల బోర్డులకు ఉంటుంది. బ్యాంక్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి కనీసం 650 క్రెడిట్ స్కోర్ ఉండాలన్న నిబంధనను ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) విధించింది. బాధ్యతాయుత ఆర్థిక నడవడిక ఉండాలన్నది దీని వెనుక ఉద్దేశం. ఎంతో విలువైన లావాదేవీల వ్యవహారాల బాధ్యతలను బ్యాంకుల ఉద్యోగులు చూస్తుంటారు. అందుకే ఈ నిబంధన ప్రవేశపెట్టారు. అందుకే బ్యాంకు ఉద్యోగాలకు ప్రయత్నించే వారు మెరుగైన స్కోర్ కోసం ముందు నుంచే తగిన జాగ్రత్త చర్యలను పాటించడం మంచిది. కొన్ని బహుళజాతి సంస్థలు కూడా ఉద్యోగం కోరుతున్న వారి క్రెడిట్ స్కోర్‌ను పరిశీలిస్తుంటాయి. 2022 మార్చిలో ఎస్‌బీఐ ప్రొబేషనరీ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ కోసం జారీ చేసిన



ప్రకటనలో.. బ్యాంక్‌లు/ఎన్‌బీఎఫ్‌సీల నుంచి తీసుకున్న ఏ రుణం చెల్లింపుల్లో అయినా విఫలం అయినట్టయితే, క్రెడిట్ కార్డ్ బకాయిలు సకాలంలో చెల్లింపులు చేయకపోతే అటువంటి వారు నియామకానికి అర్హులు కాదని స్పష్టంగా పేర్కొంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగంలో ఉద్యోగార్థుల క్రెడిట్ రిపోర్ట్‌లను పరిశీలించడం సర్వసాధారణమని.. దీనివల్ల ఆర్థికంగా ఎంత బాధ్యతాయుతంగా ఉంటారనేది తెలుస్తుందని డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ ఫైబ్ హెచ్ఆర్ హెడ్ మోనికా మిశ్రా తెలిపారు. ఇది సంస్థలో మోసాలు, చోరీల అవకాశాలను తెలియజేస్తుందన్నారు. ఆర్థిక అంశాల నిర్వహణలో బాధ్యతారహితంగా ఉండే వ్యక్తి, కంపెనీ ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు సరైన వ్యక్తి కాదని మిశ్రా వివరించారు.

రుణం కోసం రుణం...



తీసుకున్న రుణాన్ని చెల్లించలేని పరిస్థితుల్లో మరో రుణం తీసుకుని చెల్లించే ఆలోచనలు సరికాదు. ముందు తీసుకున్న రుణంపై అధిక వడ్డీ రేటు ఉండి, చాలా తక్కువ రేటుకే మరో సంస్థ రుణం ఇవ్వడానికి ముందుకు వస్తే అప్పుడు ఆలోచించొచ్చు. తక్కువ రేటుపై రుణం తీసుకుని అధిక రేటుతో కూడిన రుణాన్ని తీర్చివేయవచ్చు. వ్యక్తిగత రుణాలపై 14-15 శాతం మేర వడ్డీ రేటు ఉంటే, మెరుగైన క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి 12 శాతానికే లభిస్తుంది. అలాంటప్పుడు పరిశీలించొచ్చు. అంతేకానీ, చెల్లింపుల సమస్య నుంచి బయటపడేందుకు మరో రుణాన్ని ఆశ్రయిస్తే సమస్యను పెంచుకున్నట్టు అవుతుంది. అలాగే, క్రెడిట్ కార్డ్‌పై 3-4 రూపాయల వడ్డీ పడుతుంది. వ్యక్తిగత రుణాన్ని తీసుకుని క్రెడిట్ కార్డ్ రుణాన్ని తీర్చివేయవచ్చు.

రుణ గ్రహీత ముందున్న మార్గం

రుణం తీసుకుని, చెల్లింపులు సకాలంలో చేయకపోయినా.. రుణం ఇచ్చిన సంస్థలు గౌరవప్రదంగా, పారదర్శకంగానే వ్యవహరించాలి కానీ, వేధించడం, బెదిరించడం చేయకూడదని బ్యాంక్ బజార్ సీఈవో ఆదిల్‌శెట్టి తెలిపారు. రుణం 90 రోజులకు మించి చెల్లింపులు లేకపోతే, అప్పటికీ చెల్లించేందుకు 60 రోజుల నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. సెక్యూర్డ్ రుణం చెల్లించనప్పుడు, తనఖాలో ఉంచిన ఆస్తులు లేదా వాహనాలను విక్రయించగా, వచ్చే మొత్తం నుంచి రుణం మినహాయించుకుని మిగిలినది తిరిగి రుణ గ్రహీతకు ఇచ్చేయాల్సి ఉంటుంది. రుణం చెల్లించలేనప్పుడు మారటోరియం లేదా వన్‌టైమ్ పరిష్కారం కోసం డిమాండ్ చేయవచ్చు. రుణం చెల్లించలేకపోవడం వెనుక సహేతుక కారణాలు ఉంటే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ సంస్థను సంప్రదించాలి. చెల్లించడానికి మరింత సమయం ఇవ్వాలని కోరొచ్చు. మీరు చెప్పిన కారణాల్లో వాస్తవికత ఉందని బ్యాంక్/ఎన్‌బీఎఫ్‌సీ భావిస్తే రుణ చెల్లింపులపై స్వల్పకాలం పాటు మారటోరియం (విరామం) కల్పిస్తాయి. లేదంటే రుణ కాల వ్యవధిని పెంచి, ఈఎంఐ మొత్తాన్ని తగ్గిస్తాయి.



ఏ రుణంలో ప్రతికూలతలు ఎలా..?

క్రెడిట్ కార్డు రుణం



క్రెడిట్ కార్డ్ బిల్లు మొత్తం చెల్లించలేని సందర్భాల్లో, మినిమం డ్యూ (బిల్లులో నిర్ణీత శాతం) చెల్లించినా సరిపోతుంది. ఈ మినిమం డ్యూని కూడా చెల్లించనట్టయితే ఆరు నెలలు వేచి చూసిన తర్వాత డిఫాల్ట్‌గా ఖరారు చేస్తారు. డిపాజిట్‌ను సెక్యూరిటీగా ఉంచి క్రెడిట్ కార్డు తీసుకుంటే, బకాయి పడిన సందర్భంలో డిపాజిట్‌ను రద్దు చేసి రుణం కింద సర్దుబాటు చేసుకుంటారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా పొందిన క్రెడిట్‌కార్డు అయితే, బకాయి వసూలు బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగిస్తాయి క్రెడిట్ కార్డు కంపెనీలు. రుణ గ్రహీత నుంచి రుణాన్ని రప్పించే ప్రయత్నాలను ఏజెన్సీలు చేస్తాయి. అప్పటికీ ఫలితం లేకపోతే కోర్టులో కేసు దాఖలవుతుంది. బ్యాంక్‌లు, క్రెడిట్ కార్డ్ కంపెనీలు బ్లాక్ లిస్ట్‌ను నిర్వహిస్తుంటాయి. చెల్లింపులు చేయని వారిని బ్లాక్ లిస్ట్‌లో చేరుస్తాయి.

విద్యా రుణం



విద్యా రుణం ఈఎంఐ చెల్లింపులు సాధారణంగా కోర్సు ముగిసి, ఉద్యోగంలో చేరిన నాటి నుంచి మొదలవుతాయి. కానీ, కొన్ని కారణాల వల్ల కోర్స్‌లో సకాలంలో ఉత్తీర్ణులు కాకపోతే ఉద్యోగం రాదు. కోర్సు పూర్తి చేసినా కానీ వెంటనే అందరికీ ఉపాధి లభిస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. లేదంటే ఉద్యోగం వచ్చినప్పటికీ, అది కోల్పోయి ఖాళీగా ఉండాల్సి వచ్చిన సందర్భాల్లో రుణ ఈఎంఐ చెల్లించలేకపోతే, తదుపరి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వెంటనే ఉద్యోగం లభించకపోయినా, వచ్చిన ఉద్యోగం కోల్పోయినా బ్యాంకులను సంప్రదించి, పూర్తి వివరాలు తెలియజేయాలి. మరింత గడువు కోరాలి. లేదంటే బ్యాంక్‌లు నిర్ణీత కాలం పాటు వేచి చూసి మిగిలిన రుణాల మాదిరే నోటీసు జారీ ద్వారా తదుపరి చర్యలు ప్రారంభిస్తాయి. విద్యా రుణానికి సంబంధించి డిఫాల్టర్‌గా మారితే భవిష్యత్‌లో ఎన్నో రుణాలకు అవరోధంగా మారొచ్చు. రూ.4-10 లక్షల వరకు విద్యా రుణాలకు బ్యాంక్‌లు ఎలాంటి సెక్యూరిటీని కోరవు. అంతకుమించితే మరో వ్యక్తిని గ్యారంటర్‌గా, లేదా ప్రాపర్టీని తనఖాగా ఉంచాలని కోరతాయి. సకాలంలో చెల్లించలేకపోతే గ్యారంటర్ క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది.

వినియోగ రుణం



కన్స్యూమర్ ఉత్పత్తుల కోసం తీసుకునే రుణాలు, వాహన రుణాలు అయినా గడువులోపు చెల్లించకపోతే ఒకటి రెండుసార్లు నోటీసును జారీ చేస్తాయి. 30 రోజుల్లోగా చెల్లించకపోతే అప్పుడు ముందుగా సమర్పించిన చెక్కులను నగదుగా మార్చుకునే చర్యలు మొదలు పెడతాయి. చెక్కులు బౌన్స్ అయితే కోర్టులో కేసు దాఖలు చేస్తాయి. వాహనం లేదా ఉత్పత్తిని స్వాధీనం చేసుకుంటాయి. వడ్డీసహా రుణ మొత్తాన్ని చెల్లించి సమస్య నుంచి బయటపడవచ్చు.

వ్యక్తిగత రుణం



వ్యక్తిగత రుణం వాయిదా గడువు ముగిసిన 30 రోజుల వరకు చెల్లించకపోతే డిఫాల్ట్‌గా పరిణిస్తాయి. ఇదే విషయాన్ని క్రెడిట్ బ్యూరోలకు తెలియజేస్తాయి. ఇలా వరుసగా మూడు వాయిదాల్లో విఫలమైతే అప్పుడు రుణంపై అదనపు వడ్డీ రేటును (పీనల్ ఇంటరెస్ట్) వడ్డిస్తాయి. 30 నుంచి 60 రోజుల్లోపు రుణ వాయిదాను వడ్డీ, అన్ని చార్జీలతో చెల్లిస్తే క్రెడిట్ స్కోర్‌పై స్వల్ప ప్రభావమే పడుతుంది. 90 రోజులకు కూడా చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్‌పై ఎక్కువ ప్రభావం పడుతుంది. 180 రోజుల తర్వాత కూడా చెల్లింపులు రాకపోతే అప్పుడు రుణ గ్రహీతపై కేసులు దాఖలవుతాయి.

గృహ రుణం



ఇంటిపై పొందే మార్ట్‌గేజ్ రుణం చెల్లించకపోతే ఇంటిని కోల్పోవాల్సి వస్తుంది. గడువు ముగిసిన తర్వాత 30 రోజుల్లోపు చెల్లింపులు లేకపోతే దాన్ని డిఫాల్ట్ (బకాయిపడినట్టు)గా పరిగణిస్తారు. వరుసగా మూడు ఈఎంఐలు కూడా చెల్లించకపోతే, అప్పుడు బకాయిలను 60 రోజుల్లోగా సెటిల్ చేసుకోవాలంటే లీగల్ నోటీసు పంపిస్తాయి. ఆ గడువులోపు స్పందించకపోతే, సర్ఫేసీ చట్టం కింద ఇంటి జప్తు ప్రక్రియను మొదలు పెడతాయి. ఆ తర్వాత కూడా కొల్లేటరల్ (తాకట్టు) విలువ, వేలం తేదీ తదితర వివరాలతో ఒక నోటీసు పంపిస్తాయి. అప్పుడు స్పందించినా, బ్యాంక్‌లు పరిష్కారానికి అవకాశం ఇస్తాయి. చివరి ఆప్షన్‌గా ఇంటిని వేలం నిర్వహిస్తాయి. దీనివల్ల ఇంటిని కోల్పోవడంతోపాటు, క్రెడిట్ రిపోర్ట్‌లో కొన్నేళ్లపాటు దీని ప్రభావం కనిపిస్తుంది.

మిరే నుంచి మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్



మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తాజాగా మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జనవరి 24న ముగుస్తుంది. కనీసంగా రూ. 5,000, సిప్ విధానంలోనైతే రూ. 500 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. దీని ద్వారా సేకరించిన నిధులను ఈక్విటీ, డెట్.. మనీ మార్కెట్ సాధనాలు, గోల్డ్ ఈటీఎఫ్‌లు, సిల్వర్ ఈటీఎఫ్‌లు, ఎక్స్చేంజ్ ట్రేడెడ్ కమోడిటి డెరివేటివ్స్ మొదలైన వాటిలో ఇన్వెస్ట్ చేస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-1-2024	
విశాఖ	599-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
14-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

అదనపు పన్ను ఆదాకు మార్గం..?

పన్ను ఆదా కోసం సెక్షన్ 80సీ కింద ఇప్పటికే రూ.1.50 లక్షలు ఇన్వెస్ట్ చేశాను. దీనికి అదనంగా పన్ను ఆదా కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి?

– రాకేశ్ వర్మ

ఐటీ చట్టం సెక్షన్ 80సీ కింద గరిష్ట పరిమితి రూ.1.5 లక్షల మేరకు ఇప్పటికే మీరు ఇన్వెస్ట్ చేసి ఉంటే.. అప్పుడు అదనపు పన్ను ఆదా కోసం మీ ముందున్న మార్గం నేషనల్ పెన్షన్ సిస్టమ్ టైర్-1. రిటైర్మెంట్ పథకమైన ఎన్‌పీఎస్‌లో గరిష్టంగా రూ.50,000 పెట్టుబడిపై పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందొచ్చు. సెక్షన్ 80సీకి అదనంగా కల్పించిన ప్రయోజనం ఇది. విశ్రాంత జీవనం కోసం నిధి ఏర్పాటు చేసుకోవాలనే లక్ష్యాన్ని సాకారం చేసేందుకు వీలుగా 2004లో కేంద్ర సర్కారు ఎన్‌పీఎస్ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. 18-70 ఏళ్ల వయసు పరిధిలోని ఎవరైనా ఇందులో చేరేందుకు అర్హులే. ఒక ఏడాదిలో ఇందులో కనీసం రూ.500 ఇన్వెస్ట్ చేసినా సరిపోతుంది. ఇందులో చేసిన పెట్టుబడి ఏదైనా కానీ 60 ఏళ్ల వరకు వెనక్కి తీసుకోవడానికి ఉండదు. అంటే అప్పటి వరకు లాకిన్ అయి ఉంటుంది. కొన్ని అసాధారణ పరిస్థితులు ఎదురైన సందర్భాల్లోనే దీన్నుంచి ఉపసంహరణలకు అనుమతి ఉంటుంది. 60 ఏళ్లు నిండిన తర్వాత అప్పటి వరకు సమకూరిన నిధి నుంచి 60 శాతాన్ని ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తారు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలి. ఇటీవలి తీసుకొచ్చిన సవరణ నేపథ్యంలో 60 ఏళ్లు నిండిన తర్వాత.. నెల లేదా త్రైమాసికం లేదా ఏడాదికోసారి క్రమంగా కావాల్సినంత ఉపసంహరించుకోవడానికి వీలు ఏర్పడింది. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేసే వారు 2 రకాల ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లలో ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. ఆటో లేదా యాక్టివ్. ఆటో ఆప్షన్ ఎంపిక చేసుకోవడం కొంత బెటర్. ఈ ఆప్షన్‌లో ఈక్విటీలకు కేటాయింపులు ఇన్వెస్టర్ వయసు ఆధారంగా మారుతుంటాయి. ఉదాహరణకు ఇన్వెస్టర్ వయసు 35 ఏళ్లు అనుకుందాం. 100 నుంచి 35 ఏళ్లు తీసివేయగా, మిగిలిన మేర (65%) ఈక్విటీలకు కేటాయింపులు వెళతాయి. ఇన్వెస్టర్ వయసు పెరుగుతున్న కొద్దీ ఈక్విటీలకు కేటాయింపులు తగ్గుతూ వెళతాయి. యాక్టివ్ ఆప్షన్‌లో ఈక్విటీలకు గరిష్టంగా 75% వరకు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. ఈక్విటీ కేటాయింపులు పోను, మిగిలినదాన్ని డెట్, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలకు కేటాయించొచ్చు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

సాక్షి స్టాక్ స్కోప్

జేకే లక్ష్మీ సిమెంట్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 869 **టార్గెట్:** రూ. 1,000

ఎందుకంటే: అనుబంధ సంస్థ ఉదయ్‌పూర్ సిమెంట్ వర్క్స్ లిమిటెడ్ ద్వారా జేకే లక్ష్మీ సిమెంట్ ప్రస్తుతం చేపట్టిన సామర్థ్య విస్తరణ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. వార్షికంగా 2.5 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ) గ్రైండింగ్ యూనిట్ పనులు పటిష్ట రీతిలో కొనసాగుతున్నాయి. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికానికల్లా(ఏప్రిల్-జూన్) వాణిజ్య ప్రాతిపదికన ప్రారంభంకావచ్చని అంచనా. ఇప్పటికే 1.5 ఎంటీపీఏ సామర్థ్యంగల క్లింకర్ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభంకావడంతోపాటు నిలకడను సైతం సాధించింది. ఉదయ్‌పూర్ సిమెంట్ ప్లాంటులో తయారయ్యే క్లింకర్‌ను గ్రైండింగ్ కోసం జేకే లక్ష్మీ సిమెంట్ వినియోగించుకుంటుంది. మరోపక్క సూరత్‌లోనూ 1.35 ఎంటీపీఏ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రణాళికల్లో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇందుకు రూ. 220 కోట్ల పెట్టుబడులను వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు నిధులను అంతర్గత వనరులు, రుణాల ద్వారా సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. 1.35 ఎంటీపీఏలో 0.7 మిలియన్ టన్నుల సామర్థ్యం వచ్చే ఏడాది క్యూ3(అక్టోబర్-డిసెంబర్)కల్లా అందుబాటులోకి రానుంది. మిగిలిన 0.65 ఎంటీపీఏ సామర్థ్యం రెండేళ్ల తదుపరి(2025-26) తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో ప్రారంభంకావచ్చని అంచనా. ప్రణాళికల ప్రకారమే దుర్గ్ ప్లాంటులో రైల్వే సైడింగ్ పనులు కొనసాగుతున్నట్లు కంపెనీ పేర్కొంది. నిర్వహణ లాభాలను పెంచుకునే బాటలో కంపెనీ విభిన్న చర్యలు తీసుకుంటోంది.



తేజాస్ నెట్‌వర్క్స్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 860 **టార్గెట్:** రూ. 1,050

ఎందుకంటే: పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ) ఆధారిత టెలికం పరికరాల తయారీలో దేశీయంగా అతిపెద్ద కంపెనీగా తేజాస్ నెట్‌వర్క్స్ నిలుస్తోంది. వైర్‌లైన్, వైర్‌లెస్ నెట్‌వర్కింగ్ ప్రొడక్టుల తయారీ, డిజైనింగ్‌లో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) మొదలు 2027-28 వరకూ కంపెనీ రూ. 29,200 కోట్ల విలువైన ఆర్డర్లను పూర్తి చేయనుంది. వెరసి రూ. 30,000 కోట్ల ఆదాయం, రూ. 6,000 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ఆర్జించే అవకాశముంది. ఇందుకు ప్రధానంగా ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్ఎన్ఎల్, భారత్ నెట్ ప్రాజెక్టులు తోడ్పాటునివ్వనున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024-25) ఆదాయం గరిష్టస్థాయికి చేరే వీలుంది. ఈ ఏడాదితో పోలిస్తే 5 రెట్లు పుంజుకోవచ్చు. దేశీయంగా తయారీ రంగంపై దృష్టి పెట్టిన కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ) ద్వారా కంపెనీ ప్రధానంగా లబ్ధిని పొందే అవకాశముంది. బీఎస్ఎన్ఎల్, భారత్‌నెట్, రైల్వే ప్రాజెక్టులపై ప్రభుత్వ భారీ పెట్టుబడి వ్యయాలు ఇందుకు సహకరించనున్నాయి. అంతేకాకుండా కీలక మౌలిక సదుపాయాలు, ప్రయివేట్ రంగం నుంచి పెరుగుతున్న డిమాండ్, ప్రపంచస్థాయిలో చైనాకు ప్రత్యామ్నాయ టెలికం పరికరాల కంపెనీలకు పెరుగుతున్న ప్రాధాన్యత సైతం తేజాస్ నెట్‌వర్క్స్‌కు ప్రోత్సాహాన్నిస్తున్నాయి. టాటా గ్రూప్ సెమీకండక్టర్ కార్యకలాపాలు కంపెనీకి ప్రయోజనం చేకూర్చే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఏపీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

- ప్రజలందరికీ మంచి జరగాలంటూ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు
- భోగి మంటలు వెలిగించి సంబరాలను ప్రారంభించిన సీఎం దంపతులు

భోగి మంట వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్ దంపతులు

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నింటాయి. సంప్రదాయ పంచెకట్టుతో సతీసమేతంగా ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గంగిరెద్దులకు సారెను సమర్పించడం, భోగిమంటలు, గోశాలలోని గోవులకు ప్రత్యేక పూజలు, హరిదాసుల కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల సంక్రాంతి నృత్యాలతో వేడుకలు కన్నుపండువగా జరిగాయి. సీఎం క్యాంపు కార్యాలయం పక్కనే ఉన్న గోశాలను చక్కగా పల్లెటూరు వాతావరణం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. సీఎం దంపతులను మంత్రముగ్ధుల్ని చేసేలా ఆ ప్రాంతం శోభాయమానంగా అలంకరించారు. ప్రాంగణంలోకి ప్రవేశించే ముందు ఏర్పాటుచేసిన శిలాతోరణం ఆకట్టుకుంది.

ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఈ కార్యక్రమానికి సంప్రదాయ దుస్తులతో హాజరైన సీఎం జగన్ దంపతులను వేదపండితులు నుదుట తిలకం దిద్ది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం.. వారిరువురూ భోగి మంటలను వెలిగించి సంక్రాంతి సంబరాలను లాంఛనంగా ప్రారంభించారు. హరిదాసుకు స్వయంపాకం, సారె సమర్పించారు. అలాగే, గోశాలలోని గోవులకు పూజచేసి వాటిని నిమురుతూ కొద్దిసేపు అక్కడ గడిపారు. గంగిరెద్దులకు, తులసి చెట్టుకు పూజలు చేశారు. గ్రామీణ సంక్రాంతి వేడుకల్లో ప్రధానంగా కనిపించే వివిధ కళాకారులను సీఎం అప్యాయంగా పలకరించారు. అంతేకాక.. తెలుగింటి సంక్రాంతి పిండివంటలను ముఖ్యమంత్రి దంపతులు రుచి చూశారు. అనంతరం.. కలియుగ దైవమైన శ్రీహరికి పూజలు నిర్వహించటం, సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించేందుకు ఏర్పాటుచేసిన వందేళ్ల క్రితం నాటి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ నమూనా ప్రాంగణంలో (సెట్టింగ్)కి అడుగుపెట్టారు. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి సీఎం జగన్ దంపతులు పూలమాల వేసి నివాళులర్పించారు. కాణిపాక వినాయక విగ్రహానికి సీఎం జగన్ దంపతులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. తర్వాత.. కనకదుర్గమ్మకు.. అనంతరం శ్రీ వేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదపండితుల ఆశీర్వాదం స్వీకరించారు. ఈ సందర్భంగా వేదపండితులు సీఎంకు కంకణం కట్టగా.. వేదపండితులు అందించిన మరో కంకణాన్ని భారతమ్మకు ముఖ్యమంత్రి జగన్ కట్టారు.

విజయానందాలతో అడుగులు ముందుకేయాలి..

సీఎం జగన్ ట్వీట్

ఊరూ వాడా ఒక్కటై.. బంధుమిత్రులు ఏకమై.. అంబరమంత సంబరంగా జరుపుకునే తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. భోగి మంటల సాక్షిగా చెడును దహనం చేసి.. సంతోషాల కాంతిని ఇంటి నిండా నింపుకుని.. సుఖ సంతోషాలతో.. విజయానందాలతో ప్రతి ఒక్కరూ అడుగులు ముందుకేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేస్తున్నా అంటూ ఆదివారం 'ఎక్స్'(ట్విట్టర్)లో తెలిపారు.

క్లుప్తంగా...

ఈపీఎఫ్‌ఓ బోర్డు సభ్యుడిగా సుంకరి మల్లేశం

రాష్ట్రం నుంచి మరోమారు అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ)సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్(సీబీటీ)లో రాష్ట్రానికి చెందిన భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రతినిధి సుంకరి మల్లేశం మరోసారి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ సంయుక్త కార్యదర్శి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ కమిటీకి కార్మిక సంఘాల తరపున వివిధ రాష్ట్రాల నుంచి ఎనిమిది మందికి అవకాశం లభించగా.. తెలుగు రాష్ట్రాల నుంచి కార్మిక నేత మల్లేశం నియమితులయ్యారు. మల్లేశం గతంలో ఈఎస్ఐ బోర్డు సభ్యుడిగా కూడా పనిచేశారు. ఈఎస్ఐ మెడికల్ కాలేజీల్లో చందాదారుల కుటుంబ సభ్యులకు 5% రిజర్వేషన్ కోసం ఆయన ఎంతో కృషి చేశారు.

నేడు ఆలస్యంగా తెలంగాణ ఎక్స్‌ప్రెస్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీకి వెళ్లవలసిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ (12723) సోమవారం ఆలస్యంగా బయల్దేరనుందని దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్. రాకేశ్ తెలిపారు. నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు బయల్దేరాల్సిన ఈ రైలు సుమారు 10 గంటలు ఆలస్యంగా సాయంత్రం 4 గంటలకు బయల్దేరనుంది. సాంకేతిక కారణాల దృష్ట్యా రైలు వేళల్లో మార్పులు జరిగినట్టు సీపీఆర్వో పేర్కొన్నారు.

శంషాబాద్‌కు విమానాల మళ్లింపు

శంషాబాద్ రూరల్: పొగమంచు కారణంగా వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం చెన్నై వెళ్లాల్సిన విమానాలను శంషాబాద్‌కు దారి మళ్లించారు. చెన్నై నగరంలో ఉదయం నుంచి పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో విమానాలను హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించాల్సి వచ్చింది.

టీఎస్ఐఐసీ ఎండీగా విష్ణువర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పెట్టుబడుల ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి ఇ.విష్ణువర్ధన్‌రెడ్డిని టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయనకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బోసిపోయిన జాతీయ రహదారి

చౌటుప్పల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో మూడు రోజులుగా రద్దీగా ఉన్న హైదరాబాద్-విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి ఆదివారం ఒక్కసారిగా బోసిపోయింది. ప్రజలు ఇప్పటికే సొంతూళ్లకు వెళ్లిపోవడం, ఆదివారం భోగి పండుగ కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు సైతం పెద్దగా రాకపోకలు సాగించక జాతీయ రహదారి ఖాళీగా కనిపించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా నిర్మానుష్యంగా మారింది. అడపాదడపా వచ్చే వాహనాలు వేగంగా దూసుకుపోయాయి. రద్దీతో మూడు రోజులపాటు అవస్థలు పడిన వివిధ శాఖల యంత్రాంగం, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

విమానమెక్కి.. శ్రీరాముణ్ణి మొక్కి!

అయోధ్యకు హెలికాప్టర్, చార్టర్డ్ విమానాలు

- ఈనెల 22న రామమందిరం ప్రాణ ప్రతిష్ట
- రాజకీయ, వ్యాపార, సినీ ప్రముఖులకు ఆహ్వానం
- సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి రూ.10–20 లక్షలు చార్జీ



సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 22న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో గర్భగుడిలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ట చేయనున్నారు. ఈ వేడుకకు దేశవ్యాప్తంగా రామభక్తులు, సినీ తారలు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులకు ఆహ్వానాలు వెళ్లాయి. దీంతో అయోధ్యకు వెళ్లే హెలికాప్టర్, చార్టర్డ్ విమానాలకు డిమాండ్ పెరిగింది. ఇప్పటికే ఈనెల 22న అయోధ్య విమానాశ్రయంలో 100 చార్టర్డ్ విమానాలు దిగుతాయని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ తెలిపారు. లక్షమందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా.

ఇప్పటికే క్యాబ్‌లు, రైళ్లు ఫుల్

ఇప్పటికే జనవరి 22 నాటికి రైల్వే టికెట్ బుకింగ్‌లు 60 శాతం మేర పెరిగాయి. అలాగే అయోధ్యలో క్యాబ్ ఆపరేటర్ల బుకింగ్‌లు 50 శాతం పెరుగుతాయని ట్రావెల్ పోర్టళ్ల అంచనా. ఇండిగో, స్పైస్ జెట్, ఎయిర్ ఇండియా విమానయాన సంస్థలు డిసెంబర్ 30 నుంచి దేశంలోని ప్రధాన మెట్రో నగరాల నుంచి అయోధ్యకు సాధారణ విమాన సేవలను ప్రారంభించాయి. ప్రస్తుతం అయోధ్యకు రోజుకు నాలుగు విమాన సర్వీస్‌లు నడుస్తున్నాయని, రాబోయే రోజుల్లో ఇది 20–24కు పెరుగుతుందని అయోధ్య విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే చార్టర్డ్ ఫ్లయిట్ ఆపరేటర్ల నుంచి 42 ఎంక్వయిరీలు వచ్చినట్లు చెప్పాయి. అయోధ్య విమానాశ్రయంలో విమానాల కోసం తగినంత పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఈనెల 22న ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థలు ప్రయాణికులను పికప్, డ్రాప్ మాత్రమే చేయాలని, విమానాలను లక్నో, వారణాసి, ఖుషీనగర్, పాట్నా, ఢిల్లీ వంటి పొరుగు విమానాశ్రయాల్లో పార్కింగ్ చేయాలని సూచించారు.

మెట్రో నగరాల నుంచి డిమాండ్

మిలియన్ ఎయిర్, క్లబ్ వన్ ఎయిర్, ఎంఏబీ ఏవియేషన్, జెట్‌సెట్‌గో వంటి ప్రైవేట్ చార్టర్డ్ విమాన సంస్థలు అయోధ్యకు విమాన సేవలను అందిస్తున్నాయి. ఈ ఏడాది చార్టర్డ్ ఫ్లయిట్లు, హెలికాప్టర్లకు డిమాండ్ పెరిగిందని ఎయిర్ చార్టర్డ్ సంస్థ క్లబ్ వన్ ఎయిర్ సీఈఓ రాజన్ మెహ్రా తెలిపారు. తెలంగాణ, కర్ణాటక వంటి పలు రాష్ట్రాల్లో శాసన సభ ఎన్నికలు, అహ్మదాబాద్‌లో వైబ్రంట్ గుజరాత్ ఇన్వెస్టర్ సమిట్‌లతో ప్రైవేట్ చార్టర్డ్ ఆపరేటర్లకు గిరాకీ పెరిగిందని తెలిపారు. తాజాగా రామమందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యకమంతో చార్టర్డ్ ఫ్లయిట్ల కోసం ఎంక్వయిరీలు వస్తున్నాయన్నారు. ఇప్పటికే 12 సీట్ల జెట్ ఫాల్కన్ 2000 బుక్ అయిందని చెప్పారు. ఆలయ ప్రారంభోత్సవం రోజున చార్టర్డ్ విమానాల కోసం 25 ఎంక్వయిరీలు వచ్చాయని మరో ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థ ప్రతినిధి తెలిపారు. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, ముంబై, పుణే, నాగ్‌పూర్ వంటి మెట్రో నగరాల నుంచి అభ్యర్థనలు వచ్చాయని చెప్పారు.

సీటింగ్‌ను బట్టి చార్జీలు

విమానం సైజు, సీటింగ్ సామర్థ్యాన్ని బట్టి ఈ మార్గంలో ధర రూ.10–20 లక్షలు ఉంటుందని ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీలు తెలిపాయి. అయితే చలికాలం నేపథ్యంలో పొగమంచు, తక్కువ విజిబిలిటీ కారణంగా అయోధ్యకు విమాన సర్వీసులు సవాలేనని, దీంతో అయోధ్యకు ప్రైవేట్ చార్టర్డ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల అనుమతులపై విమానాశ్రయ వర్గాల నుంచి మరింత స్పష్టత రావాల్సి ఉందని తెలిపాయి. ప్రస్తుతం అయోధ్య విమానాశ్రయం రోజుకు 6 గంటలు మాత్రమే తెరిచి ఉంటుంది. ఈనెల 22న ఆలయ ప్రారంభోత్సవం రోజున మాత్రం 24 గంటలు తెరిచి ఉండేలా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఏర్పాట్లు చేస్తోంది.

సైబర్ కిడ్నాపింగ్!



వ్యక్తిగత వివరాలు సేకరించి మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలతో బెదిరింపులు

- డబ్బులు డిమాండ్ చేస్తున్న సైబర్ మోసగాళ్లు
- జాగ్రత్తలు పాటించాలని సైబర్ భద్రత నిపుణుల సూచన



సాక్షి, హైదరాబాద్

సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త తరహా మోసాలకు తెరతీస్తూనే ఉన్నారు. అలాంటి మోసాల్లో ఇప్పుడు సైబర్ కిడ్నాపింగ్‌ను నేరగాళ్లు ఎంచుకున్నట్లు సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ సైబర్ కిడ్నాపింగ్‌లో నేరగాళ్లు ఎక్కడా కనిపించకుండానే నేరాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరస్థులు ఎంచుకున్న బాధితుల పూర్తి వివరాలు తీసుకుని వారి మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను సృష్టిస్తారు. ఆ తర్వాత ఆ బాధితులు తమ అధీనంలోకి వచ్చారని నిర్ధారించుకున్న తర్వాత నకిలీ బందిఖానాలో సదరు బాధితులను ఉంచినట్టుగా ఫొటోలను, వీడియోలను పెట్టి బాధితుల కుటుంబం నుంచి డబ్బులు డిమాండ్ చేస్తారు. ఇదే తరహాలో ఇటీవల చైనా విద్యార్థి ఒకరు అమెరికాలో ఇలాంటి సైబర్ మోసానికి గురయ్యాడు. ఆ విద్యార్థిని కిడ్నాప్ చేసినట్లుగా వీడియోలు సృష్టించి సైబర్‌నేరగాళ్లు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారు. ఇలాంటి తరహా సైబర్ మోసాలు తాజాగా వెలుగుచూస్తుండటంతో అప్రమత్తంగా ఉండాలని సైబర్ పోలీసులు సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో మన వ్యక్తిగత సమాచారం, కీలక వివరాలు తెలియకుండా జాగ్రత్త వహించాలి. ఏ సమాచారం మనం షేర్ చేస్తున్నామన్నది మనకు స్పృహ ఉండాలి.

- రోజు వారీ పనుల సమాచారం, మీ వ్యక్తిగత ట్రిప్‌లు, ఇతర అంశాల సమాచారం పంచుకోవద్దు.
- కుటుంబ సభ్యుడు కిడ్నాప్ అయ్యారని ఎవరైనా అజ్ఞాత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్, ఫొటోలు, వీడియోలు వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలి.
- మన సోషల్ మీడియా ఖాతాలు, ఈ మెయిల్స్ హ్యాక్ కాకుండా స్ట్రాంగ్‌పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలి. తరచూ పాస్‌వర్డ్‌లు మార్చుతూ ఉండాలి.

పబ్లిక్ ప్రదేశాల్లోని వైఫై వాడకపోవడమే మేలు.

మూడో కీలక రైల్వేలైన్ సిద్ధం

- కాజీపేట-బల్లార్షా మధ్య ట్రిప్లింగ్ పనుల్లో ముందడుగు
- ఉత్తర-దక్షిణ భారత్‌లను జోడించే గ్రాండ్ ట్రంక్ రూట్‌లో అదనంగా రైళ్లు
- తాజాగా హసన్‌పర్తి–ఉప్పల్ మధ్య విద్యుదీకరించిన లైన్



కొత్తగా అందుబాటులోకి వచ్చిన మూడో లైన్

సాక్షి, హైదరాబాద్: ఉత్తర- దక్షిణ భారతాలను అనుసంధానించే కీలక రైల్వే మార్గంలో మూడో లైన్ సిద్ధమైంది. బల్లార్షా నుంచి విజయవాడ వరకు మూడు లైన్లను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. బల్లార్షా నుంచి కాజీపేట వరకు ఒక ప్రాజెక్టు, కాజీపేట నుంచి విజయవాడకు మరో ప్రాజెక్టుగా పనులు జరుగుతున్నాయి. ఇందులో కాజీపేట-బల్లార్షా మధ్య పనులు తుది దశకు చేరాయి. తాజాగా వరంగల్ శివారులోని హసన్‌పర్తి రోడ్ స్టేషన్ నుంచి ఉప్పల్ వరకు 12.7 కి.మీ. మేర విద్యుదీకరణతో కూడిన మూడో లైన్ అందుబాటులోకి వచ్చింది. పనులు పూర్తి చేయటంతో దాని మీదుగా రైళ్ల రాకపోకలకు అధికారులు అనుమతించారు. దీంతో ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటివరకు 131.7 కి.మీ. మూడో లైన్ నిడివి అందుబాటులోకి వచ్చినట్టయింది. హసన్‌పర్తి రోడ్ స్టేషన్ నుంచి మందమర్రి వరకు 104 కి.మీ. మేర నిరంతరాయ మూడో లైన్ అందుబాటులోకి వచ్చింది.

గ్రాండ్ ట్రంక్ రూట్‌గా..

ఉత్తర-దక్షిణ భారతాలను రైల్వే మార్గంతో అనుసంధానించే ఈ లైన్‌ను గ్రాండ్ ట్రంక్ రూట్‌గా పేర్కొంటారు. ఈ మార్గంలో స్పెషల్ రైళ్లతో కలుపుకొంటే నిత్యం 300 రైళ్లు పరుగుపెడతాయి. కానీ, ట్రాఫిక్ సామర్థ్యానికి మించి 130 శాతంతో రైళ్లను నడుపుతున్నారు. దీంతో 2015–16లో మూడో లైన్ నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. రూ.2,063 కోట్ల అంచనాతో 202 కి.మీ. మేర బల్లార్షా–కాజీపేట మధ్య మూడో లైన్ నిర్మాణం మొదలైంది. ఇందులో తెలంగాణ రాష్ట్రం పరిధిలో 159 కి.మీ.లు, మహారాష్ట్ర పరిధిలో 43 కి.మీ. మేర పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టుతో సంబంధం లేకుండా రాఘవాపురం-మందమర్రి మధ్య బొగ్గు తరలింపును పెంచే ఉద్దేశంతో 33 కి.మీ. మూడో లైన్‌ను గతంలోనే నిర్మించారు. ప్రాజెక్టులో భాగంగా ఉప్పల్-రాఘవాపురం మధ్య 59 కి.మీ.లు, సిర్పూర్ కాగజ్‌నగర్-మాణిక్‌ఘర్ మధ్య 60 కి.మీ. మేర పనులు పూర్తి చేయగా, ఇప్పుడు హసన్‌పర్తి –ఉప్పల్ మధ్య 12.7 కి.మీ. పూర్తి చేసి ప్రారంభించారు. కాజీపేట-హసన్‌పర్తి మధ్య 12 కి.మీ, మందమర్రి-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య పనులు తుది దశలో ఉన్నాయి. ఈ సంవత్సరం ముగిసేలోపు ఆ పనులు పూర్తి చేయనున్నారు.

వందే రైళ్లు నడిపేందుకు అవకాశం..

ఈ మొత్తం పనులు పూర్తి చేస్తే కాజీపేట–బల్లార్షా మార్గంలో అదనంగా వంద రైళ్లను నడిపే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. మాణిక్‌ఘర్, రేచిని, ఉప్పల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, మందమర్రి, రామగుండం, పెద్దంపేట, సిర్పూర్–కాగజ్ నగర్ ప్రాంతాల్లో బొగ్గు గనులు, సిమెంటు పరిశ్రమలు విస్తారంగా ఉన్నాయి. ఎరువుల కర్మాగారం కూడా ఉండటంతో సరుకు రవాణా రైళ్లు వందల సంఖ్యలో తిరుగుతుంటాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మార్గం మీదుగానే ప్రయాణికుల రైళ్లు, సరుకు రవాణా రైళ్లను తిప్పుతున్నారు. విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు తరలించే అత్యవసర రైళ్లు తిప్పుతుండటం, సరుకు రవాణా రూపంలో రైల్వేకు భారీ ఆదాయం సమకూరుతున్నందున, ఈ మార్గంలో చాలా సందర్భాల్లో సరుకు రవాణా రైళ్ల కోసం ప్రయాణికుల రైళ్లను నిలుపుతున్నారు. ఇది ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఇప్పుడు మూడో లైన్ అందుబాటులోకి వస్తే ఓ లైన్‌ను సరుకు రవాణా కోసం వినియోగించే వీలుంది. మిగతా రెండు లైన్లను పూర్తిగా ప్రయాణికుల రైళ్లకోసమే వాడే అవకాశం ఉంది.

సంక్రాంతి అంటే సనాతన క్రాంతి

కైట్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కైట్ ఫెస్టివల్ ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి

ఖైరతాబాద్ (హైదరాబాద్): బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం పీపుల్స్ ప్లాజాలో కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ ఫెస్టివల్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతిని దేశవ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటున్నారని, తెలుగు రాష్ట్రాల్లో పట్టణాల్లో జీవించే లక్షలాది మంది.. సంవత్సరానికి ఒకసారైనా సొంత గ్రామాల్లో పండుగను జరుపుకోవడం శుభసూచకమన్నారు. 550 సంవత్సరాల నుంచి అనేక పోరాటాలు, త్యాగాలు, ఉద్యమాలు చేసి కోట్లాది మంది ప్రజలు అయోధ్యలో రామమందిర నిర్మాణం జరగాలని ఆకాంక్షించారని, వారి ఆకాంక్ష సాకారమవుతోందని అన్నారు. ఈసారి సంక్రాంతి అంటే సనాతన క్రాంతి అని, దేశంలో ఈ నెల 22న సనాతన క్రాంతి రానుందని పేర్కొన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ, అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్టకోసం 11 రోజుల దీక్షపూని సనాతన ధర్మ విలువలు వ్యాపింపజేస్తూ అన్ని మందిరాల్లో సంక్రాంతి మొదలుకొని 22వ తేదీ వరకు ప్రజలు ప్రాణప్రతిష్ట వేడుకల్లో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతూ ప్రధాని అభినందనలు అందుకున్న ఆకర్షణ అనే విద్యార్థిని కేంద్రమంత్రి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర ఫేస్‌బుక్ హ్యాక్

సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు



మంత్రి రాజనర్సింహా ఫేస్‌బుక్ హ్యాక్ అయిన దృశ్యం

జోగిపేట (అందోల్): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్ అయింది. సైబర్ నేరగాళ్లు ఆయన ఖాతా నుంచి రకరకాల పోస్టులు పెడుతున్నారు. బీజేపీ, టీడీపీ, తమిళనాడు రాజకీయ పార్టీలకు చెందిన పోస్టులను వందల సంఖ్యలో పెట్టారు. సైబర్ నేరగాళ్లు కుట్రపూరితంగానే అకౌంట్‌ను హ్యాక్ చేసినట్లు సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. మంత్రి వెంటనే స్పందించి తన ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్ అయిందంటూ కార్యకర్తలు, అభిమానులను అప్రమత్తం చేశారు. ఫేస్‌బుక్ నుంచి వచ్చే పోస్టులను చూసి ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన అనుచరులు తెలిపారు.

రక్షణరంగ ఉత్పత్తుల్లో బీడీఎల్ పాత్ర ఎంతో కీలకం

- రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్
- బీడీఎల్‌లో అస్త్ర మిస్సైల్ సరఫరాను ప్రారంభించిన కేంద్ర మంత్రి



మిస్సైల్‌ను పరిశీలిస్తున్న మంత్రి అజయ్‌భట్

సాక్షి, హైదరాబాద్ : భారత ప్రభుత్వ ఆత్మనిర్భర్ విధానానికి అనుగుణంగా, దేశీయంగా క్షిపణిలు తయారు చేయడంలో బీడీఎల్ (భారత్ డైనమిక్స్ లిమిటెడ్) పాత్ర ఎంతో కీలకమని రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ పేర్కొన్నారు. దేశ రక్షణ ఎగుమతులను పెంపొందించడంలోనూ బీడీఎల్ సహకారం మరువలేనిదని ఆయన ప్రశంసించారు. భారత వైమానిక దళానికి సరఫరా చేయడానికి దేశీయంగా తయారు చేసిన అస్త్ర క్షిపణులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం భారత్ డైనమిక్స్ లిమిటెడ్, కంచన్‌బాగ్ యూనిట్లో బీడీఎల్ సీఎండీ కమోడోర్ ఎ.మాధవ రావు (రిటైర్డ్), డీఆర్‌డీఓ, భారత వాయుసేన సీనియర్ అధికారుల సమక్షంలో ఈ క్షిపణిని ఫ్లాగ్ ఆఫ్ చేశారు. అస్త్రా క్షిపణి డీఆర్‌డీఓ స్వదేశీపరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన విజువల్ రేంజ్ ఎయిర్-టు-ఎయిర్ మిస్సైల్. ఈ క్షిపణి 100 కి.మీ.పైగా దూరంలోని లక్ష్యాలను చేధించగలదు. ఈ సందర్భంగా ఎ.మాధవరావు మాట్లాడుతూ...అస్త్ర క్షిపణుల తయారీతో జాతీయ, అంతర్జాతీయ డిమాండ్‌లను ఒకేసారి తీర్చేలా బీడీఎల్ తన సామర్థ్యాన్ని పెంచుకుందని పేర్కొన్నారు. జనవరి 12న డీఆర్‌డీఓ ప్రయోగించిన ఆకాశ్ ఎన్‌జీ క్షిపణి పరీక్ష అత్యాధునిక రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్‌తో సహా బీడీఎల్‌లోనే తయారు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీడీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) ఎన్.శ్రీనివాసులు, డైరెక్టర్ (ప్రొడక్షన్) పీవీ రాజారామ్, డీజీఎంఎస్ఎస్ యు.రాజాబాబు, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఉపేందర్ వెన్నం తదితరులు పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా



జన సంచారం లేని రాష్ట్ర సచివాలయం పరిసరాలు



కూకట్‌పల్లిలోని మలేషియా టౌన్‌షిప్‌లో భోగి మంటల ముందు ఆటాపాటా..

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.